

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 285

శుక్రవారం 28-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రోహిత్, సూర్య మెరుపులు

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో టీ20 వరల్డ్ కప్ సెమీ ఫైనల్ పోరులో భారత్ మెరుగైన స్కోరుతో తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ (39 బంతుల్లో 57 : 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా...సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 47 : 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

12లో



రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలంటూ వైఎస్సార్ జిల్లా కడపలోని తహశీల్దార్ ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రైతుకు రొక్కమేది?

తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలంటూ రైతు సంఘాల ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు

కేంద్రం మాట నిలబెట్టుకున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపాటు

- అన్నదాత సుఖీభవతో ఆదుకోకుంటే ఆందోళన చేస్తామని ప్రకటన
- భూ యజమానులతో పాటు కౌలుదారులకూ ఇవ్వాలని డిమాండ్
- సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపచేయాలని వినతి
- గత ఐదేళ్లుగా సీజన్‌కు ముందే తొలివిడత సాయం అందేది..
- కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని రైతుల ఆందోళన

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: తాము అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు రూ.20 వేలు చొప్పున సాగు సాయం అందిస్తామంటూ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయాన్ని ఇటీవలే జమ చేసిందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సైతం అన్నదాతా సుఖీభవ ద్వారా రైతన్నలకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కోరాయి. వ్యవసాయదారులకు తొలి విడత పెట్టుబడి సాయాన్ని వెంటనే జమ చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా రైతులతో పాటు కౌలు రైతులు, అటవీ, దేవదాయ, అసైన్డ్ భూసాగుదారులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మిగతా 2వ పేజీలో ▶

గడిచిన ఐదేళ్లూ ఈ పాటికే ఖాతాల్లోకి..

ప్రస్తుతం 'భరోసా' లేక భారంగా సాగు

పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాత అగచాట్లు.. ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అంటూ సూపర్‌సిక్స్‌లో కూటమి హామీ

పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ ఊసెత్తని ప్రభుత్వ పెద్దలు.. అప్పల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

ఐదేళ్ల పాటు పెట్టుబడి సాయం సమయానికి అందించిన వైఎస్ జగన్ ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఖరీఫ్ ఊపందుకుంటున్న వేళ పెట్టుబడి ఖర్చుల కోసం చేతిలో చిల్లిగవ్వలేక అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అప్పుల కోసం ముప్పుతిప్పలు పడుతున్నారు. గత ఐదేళ్లుగా ఏటా మూడు విడతల్లో పెట్టుబడి సాయం చేతికందగా ఈసారి వ్యవసాయ పనులు మొదలైనా దిక్కులు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఆర్బీకేలలో విత్తనాలు, ఎరువులు నిల్వ చేయడంతోపాటు

మిగతా 2వ పేజీలో ▶

పేకాట మొదలు

మళ్లీ తెరుచుకుంటున్న క్లబ్‌లు, శిబిరాలు

అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండాదండా

- గుంటూరు నడిబొడ్డున ఏ అనుమతులు లేకుండా పేకాట క్లబ్ ప్రారంభం
- టీడీపీ హయాంలో క్లబ్‌లది ప్రత్యేక చరిత్ర
- రిక్రియేషన్ పేరుతో పేకాట, బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలు.. వీటి బారిన పడి ఆస్తులు కోల్పోయి అప్పుల పాలైన వారెందరో
- ఆత్మహత్యలతో రోడ్డున పడ్డ కుటుంబాలు
- 2019లో వీటిని మూసివేయించిన వైఎస్ జగన్ ప్రభుత్వం.. మళ్లీ తెరుచుకోకుండా చర్యలు
- అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, బెట్టింగ్‌లపై నిషేధం.. టీడీపీ కూటమి విజయంతో మళ్ళీ ప్రారంభమవుతున్న క్లబ్‌లు

5లో



సచివాలయాల సిబ్బంది

సిద్ధం కావాలి

జూలై 1న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి

ఒక్కరోజులోనే 65,18,496 మందికి పెన్షన్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు



- పెంచిన మేరకు మొత్తం పింఛన్ల మొత్తం రూ.4,399.89 కోట్లు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 నుండి పంపిణీ చేయాలి
- ఒక్కో ఉద్యోగికి 50 ఇళ్లు.. అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగులూ వినియోగం
- 29నే బ్యాంకుల నుండి నగదు డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం కావాలి
- సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశం

3లో

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల అవర్తనం ఏర్పడింది. ఇది పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా కొనసాగుతోంది. మరోవైపు.. నైరుతి రుతుపవనాలు దేశమంతటా క్రమంగా విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న 3 రోజుల పాటు కోస్తా, రాయలసీమకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేడు, రేపు తేలికపాటి నుంచి భారీ వర్షాలకు ఆస్కారముంది.

14లో



ఏటయిందే గోదారమ్మ!

ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి ఇప్పటికీ పదివేల క్యూసెక్కుల ప్రవాహమే

డెల్టా కాలువలకూ సరిపడా నీటిని విడుదల చేయలేని పరిస్థితి

సాధారణంగా జూన్ నాలుగో వారానికి 20–30 వేల క్యూసెక్కుల ప్రవాహం

బేసిన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్లే ఈ పరిస్థితి

- వివరాలు 14లో

ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం



- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం
- నరేంద్ర మోదీ 3.0 ప్రాధామ్యాల వెల్లడి
- లీకేజీ దోషులపై కఠిన చర్యలన్న ముర్ము

6లో



ప్రయోగాలు ఉపయోగమేనా?

సైన్స్ ల్యాబ్స్ ఎలా పనిచేస్తున్నాయి

13 అంశాలపై పరిశీలన చేయనున్న అధికారులు



అటల్ ల్యాబ్‌లో ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థులు

రాయవరం: పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు కృత్యాధార బోధన చేయాలి. ముఖ్యంగా సైన్స్ విద్యార్థుల్లో పరిశీలనాశక్తిని పెంచి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా బోధన చేయాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వాలు స్టెమ్ ల్యాబ్స్ మంజూరు చేశాయి. త్వరలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మరిన్ని స్టెమ్ ల్యాబ్స్ పాఠశాలలకు మంజూరు కానున్నాయి. పీఎంశ్రీ పాఠశాలలకు ప్రత్యేకంగా అటల్ ల్యాబ్స్ కూడా మంజూరు కానున్నాయి.

కోనసీమ జిల్లాలో 45 అటల్ టింకరింగ్ ల్యాబ్స్

ఉపాధ్యాయుడిని తరగతికి పరిమితం చేయాలన్న ఆలోచనలకు అనుగుణంగా ప్రయోగశాలలపై పర్యవేక్షణను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పెంచారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్ ల్యాబ్స్, పాల్ ల్యాబ్స్ నిర్వహణ ఏ విధంగా జరుగుతుందన్న విషయాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంది. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగాలు ఎంతవరకు ఫలవంతమవుతున్నాయి? విద్యార్థులకు ప్రయోగాలు ఎంత మేర చేరుతున్నాయి? విద్యార్థులను ఎంత వరకు భాగస్వాములను చేస్తున్నారు? తదితర విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి జిల్లా సైన్స్ అధికారి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కోనసీమ జిల్లాలో 45 అటల్ టింకరింగ్, 12 స్టెమ్ ల్యాబ్స్, 30 పాల్ ల్యాబ్స్ ఉన్నాయి. గణితాన్ని సులువుగా విద్యార్థులకు అందజేసేందుకు గతంలోనే పాల్‌ల్యాబ్స్‌ను మంజూరు చేశారు.

ప్రయోగాలను మరింత చేరువ చేసేందుకు

విద్యార్థి తాను నేర్చుకున్న విషయాన్ని ప్రయోగపూర్వకంగా చూసినప్పుడు మరింత అవగాహన పెంచుకోవడానికి అవకాశముంటుంది. తాను విన్న, చూసిన విషయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేడు. అందుకే ముఖ్యంగా సైన్స్ బోధనలో ప్రయోగాలకు ప్రాధాన్యముంది. దీన్ని గ్రహించి గత ప్రభుత్వంలోనే సిమ్యులేషన్ విధానంలో ప్రయోగాలు ఏ విధంగా నిర్వహించాలి? అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ప్రయోగాలపై ఇచ్చిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనికితోడు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను అందజేశారు. ఈ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా ప్రయోగాల నిర్వహణ విద్యార్థి మనసును మరింతగా హత్తుకుంటుంది. జిల్లావ్యాప్తంగా 486 మంది గణితం, 327 మంది ఫిజికల్ సైన్స్, 346 బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు సిమ్యులేషన్ విధానంలో శిక్షణ ఇచ్చారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్స్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.


ల్యాబ్‌ల పరిశీలన

పాఠశాలల్లో ఉన్న అటల్ టింకరింగ్, స్టెమ్, పాల్ ల్యాబ్స్ నిర్వహణ ఏ విధంగా సాగుతోందన్న విషయాన్ని పరిశీలించేందుకు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. ల్యాబ్‌ల పరిస్థితి, ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటారు. పాఠశాలల్లో ఉన్న సైన్స్ ల్యాబ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకుని రావాలన్న సంకల్పంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉన్నారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

13 క్వాలిటీ ఇండికేటర్స్

అటల్ ఇన్నోవేషన్ మిషన్ పోర్టల్‌లో గత నెలకు సంబంధించి పాఠశాలలో చేసిన ప్రయోగాలు, యాక్టివిటీస్‌ను 15 రోజులలోపు అప్‌లోడ్ చేయాలి. ఆఫ్‌లైన్ క్యాష్‌బుక్ అండ్ లెడ్జర్ నిర్వహించాలి. ప్రతి విద్యార్థిలో డిజైన్ థింకింగ్ అభివృద్ధి చేయాలి. ఇచ్చిన కాంపొనెంట్స్‌ను ఒక క్రమపద్ధతిలో అమర్చాలి. సందేహాల నివృత్తికి ఏఎం పోర్టల్‌లో ప్రశ్నలు సంధించాలి. అటల్ క్యాలెండర్‌ను మెయింటెన్ చేయాలి. ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలి. అటల్ ఇన్నోవేషన్ మిషన్ నిర్వహించే కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. అటల్ ల్యాబ్‌లో ఉన్న అన్ని టూల్స్ పనిచేయాలి. టైమ్ టేబుల్‌లో తప్పనిసరిగా వారానికి రెండు పీరియడ్లు అటల్ ల్యాబ్‌కు కేటాయించాలి. ఒక అటల్ నోడల్ టీచర్‌ను నియమించాలి, ఆ టీచర్ తప్పనిసరిగా ఫిజికల్ సైన్స్ టీచర్ అయి ఉండాలి.

పిన్నెల్లికి రిమాండ్



- బుధవారం అర్ధరాత్రి మాచర్ల మేజిస్ట్రేట్ ముందుకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- తెల్లవారుజామున 4 వరకు వాదనలు
- ఈవీఎం ధ్వంసం, మహిళను బెదిరించిన కేసుల్లో బెయిల్
- సీఐలపై దాడి కేసుల్లో రిమాండ్.. కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలింపు
- కోర్టు ప్రాంగణంలో పిన్నెల్లిపై దాడికి యత్నించిన టీడీపీ కార్యకర్త శివ
- అడ్డుకోని పోలీసులు.. శివను తోసుకుంటూ కోర్టులోకి వెళ్లిన పీఆర్కే
- కోర్టు ఎదుటే బాణసంచా కాల్చి కవ్వించిన టీడీపీ శ్రేణులు

14లో

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు

రక్షణ కల్పించండి

పార్టీ నేతలు, కార్యకర్తలపైన టీడీపీ కూటమి నేతల అమానుష దాడులు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లోకి అక్రమచొరబాట్లు, విధ్వంసం
- నిర్లిప్తంగా వ్యవహరిస్తున్న పోలీసులు.. రాష్ట్రంలో శాంతి భద్రతలు ప్రమాదంలో పడుతున్నాయి
- కూటమి నేతల దాష్టీకాలను వెంటనే నిలువరించండి
- రాష్ట్ర డీజీపీకి వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల లేఖ

3లో




ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు



ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు నాయకులు



అనంతపురం జిల్లా పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు నాయకులు


విజయవాడ రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నేతలు కేవీవీ ప్రసాద్, జమలయ్య తదితరులు

రైతుకు రొక్కమేది?

▶ మొదటి పేజీ తరువాయి

జి.ఈశ్వరయ్య కడపలో, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కాటమయ్య పుట్టపర్తిలో, ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య విజయవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

గత ఐదేళ్లుగా పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించిందని గుర్తు చేశారు. తొలివిడత సాయాన్ని గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే జమ చేసిందని చెప్పారు. ఆ డబ్బులు దుక్కి పనులు, విత్తనాల కొనుగోలు లాంటి సాగు అవసరాలకు రైతులకు ఎంతగానో ఉపయోగపడేవన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున సాగు సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారని, ఈ హామీని వెంటనే అమలులోకి తేవాలని సూచించారు. తొలి విడత సాయం అందకపోవడంతో పెట్టుబడి ఖర్చుల కోసం ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేలు చొప్పున సాగు సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని విడతల్లో ఎంత జమ చేస్తారో స్పష్టత ఇవ్వడంతో పాటు త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు కూడా జరపాలన్నారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచి పంట రుణాలు అందించాలన్నారు. రూ.3 లక్షల వరకు వడ్డీ లేకుండా, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీతో రైతు, కౌలురైతులకు రుణాలివ్వాలని కోరారు. సాగు చేస్తున్న భూమి దామాషాను పరిగణనలోకి తీసుకొని పంటరుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతంలోని మురుగునీటి కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. వ్యవసాయ మోటార్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించి ఉచిత విద్యుత్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం 2019లో తెచ్చిన పంట సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించాలని, గ్రామ సభలోనే కౌలు రైతులను గుర్తించి స్వీయ ధ్రువీకరణ ఆధారంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇప్పటివరకు జారీ చేయనందున కౌలు రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని పచ్చిరొట్ట విత్తనాలు, అన్ని రకాల పంటల విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఎరువులు, పురుగు మందులు 90% సబ్సిడీపై అందించాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ సాగు భూముల వేలం పాటలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సీజన్‌లో వర్షాభావం, తుపాను వల్ల నష్టపోయిన కౌలురైతులకు కౌలు రేట్లు తగ్గించి నామమాత్రపు ధరతో లీజుకు ఇవ్వాలని కోరారు.

ఏలూరులో ధర్నా..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున సాగు సాయం కింద రూ.20 వేలు వెంటనే రైతులకు అందించాలంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని, పోలవరం నిర్మాణం వేగంగా చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, నాగలి తదితర పనిముట్లు కొనుగోలుపై 50 శాతం రాయితీ అందించాలన్నారు. ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీపై డీజిల్ సరఫరా చేయాలని, కల్తీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వెంటనే అందించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా చోడవరం తహసీల్దార్‌కు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సాయం అందకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఖరీఫ్ రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం కర్నూలులో డీఆర్‌ఓకు వినతిపత్రం అందచేశారు.

తక్షణమే పెట్టుబడి సాయం ఇవ్వాలి



సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల పెట్టుబడి సాయం పంపిణీని కూటమి ప్రభుత్వం తక్షణమే ఆచరణలో పెట్టాలి. ఎన్ని విడతల్లో జమ చేస్తారో స్పష్టత ఇవ్వాలి. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలి. తక్షణమే తొలి విడత సాయం అందించి రైతులకు అండగా నిలవాలి. లేదంటే దశలవారీగా ఆందోళన చేస్తాం.

–జి.ఈశ్వరయ్య, అధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం

ప్రతీ కౌలు రైతుకూ సాయం అందించాలి



సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రతీ కౌలు రైతుకూ సాగు సాయం అందించాలి. గతంలో సీజన్‌కు ముందుగానే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీసీఆర్సీ కార్డులు ఇచ్చారు. పంటసాగు హక్కుదారుల చట్టం 2019ని సవరించి స్వీయ ధ్రువీకరణతో ప్రతీ కౌలుదారుడికి సీసీఆర్సీ కార్డులివ్వాలి. సాగు సాయంతో పాటు సంక్షేమ ఫలాలన్నీ కౌలు రైతులందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలి.

–కె.కాటమయ్య, అధ్యక్షుడు, ఏపీ కౌలురైతు సంఘం

గడిచిన ఐదేళ్లూ ఈపాటికే ఖాతాల్లోకి

▶ మొదటి పేజీ తరువాయి

కొన్ని సందర్భాల్లో పీఎం కిసాన్ కంటే ముందుగానే తొలి విడత పెట్టుబడి సాయం చేతికందిన వైనాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఈ డబ్బులు రైతులు దుక్కి దున్ని భూమిని సిద్ధం చేసుకోవడం, సబ్సిడీ పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోవడం, నారుమళ్లు పోసు కోవడం, నాట్లు వేయడం లాంటి అవసరాలకు ఉపయోగపడేవి. గతంలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా మూడు విడతల్లో అందించిన సాయం సన్న, చిన్నకారులకు ఎంతగానో ఉపయోగపడేది. రాష్ట్రంలో అర హెక్టార్ (1.25 ఎకరాలు) లోపు విస్తీర్ణం కలిగిన రైతులు 50 శాతం మంది ఉండగా హెక్టార్ (2.50 ఎకరాలు) లోపు విస్తీర్ణమున్న రైతులు 70 శాతం మంది ఉన్నారు. అర హెక్టార్ లోపు సాగుభూమి ఉన్న రైతులు వేసే పంటలకు అయ్యే పెట్టుబడిలో 80 శాతం ఖర్చు రైతు భరోసా రూపంలో అందడంతో వారికి ఎంతో ఊరటగా ఉండేది. తాము అధికారంలోకి వస్తే ప్రతీ రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామని సూపర్ సిక్స్‌లో టీడీపీ – జనసేన కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించారు. ఒకపక్క వ్యవసాయ పనులు జోరందుకున్నా ప్రభుత్వ పెద్దలెవరూ ఇంతవరకూ ఆ ఊసెత్తక పోవడం పట్ల రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేరు మార్చేందుకే ఉత్సాహం..

ఇచ్చిన హామీ కంటే మిన్నగా వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ ద్వారా ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించి వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులకు



అండగా నిలిచింది. ప్రతీ రైతు కుటుంబానికి ఏటా మే/ జూన్‌లో రూ.7500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో 2 వేలు చొప్పున క్రమం తప్పకుండా జమ చేశారు. ఏటా సగటున 51.50 లక్షల మందికి ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ కింద రూ.34,288.17 కోట్లు జమ చేసి రైతులకు అండగా నిలిచారు. భూ యజమానులతో పాటు అటవీ, దేవదాయ భూసాగుదారులకే కాకుండా సెంటు భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులకు ఐదేళ్లూ వైఎస్ జగన్ ప్రభుత్వమే సొంతంగా పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. పీఎం కిసాన్ కింద 2024–25 సీజన్ తొలి విడత సాయాన్ని మాట ప్రకారం కేంద్రం ఇటీవలే జమ చేసింది. సీఎం చంద్రబాబు కూడా అదే మాదిరిగా రైతన్నలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.20 చొప్పున పెట్టుబడి సాయాన్ని కేంద్ర సాయంతో సంబంధం లేకుండా ఇవ్వాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చటంలో చూపిన ఉత్సాహాన్ని సాయం అందించడంలోనూ ప్రదర్శించాలని కోరుతున్నారు.

ఐదేళ్లు నమ్మకంగా ఇచ్చారు..



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జూన్ మొదటి వారంలోనే రైతు భరోసా డబ్బులు పడేవి. ఆ నగదుతో పాటు కొంత డబ్బు కలిపి పంటలు సాగు చేసేవాళ్లం. ఐదేళ్లు నమ్మకంగా రైతు అకౌంట్‌లో జమ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంత వరకు ఆ ఆలోచన చేయలేదు. ఎప్పుడు ఇస్తారో నమ్మకం లేదు. ఏం చేయాలో అర్థం కావటం లేదు. రైతులు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.

– తూళ్లూరి నీరజ, గమ్మళ్లపాలెం, కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా

మా గోడు పట్టించుకోండి..



గత ఐదేళ్లు రైతు భరోసా సకాలంలో అందడంతో సాగు సాఫీగా సాగేది. ప్రస్తుత పాలకులు మా బాధను పట్టించుకుని రైతులకు ఆర్థిక సాయం త్వరగా అందించాలి.

– రాధయ్య, రైతు, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం, చిత్తూరు జిల్లా.

పాత రోజులు గుర్తుకొస్తున్నాయి..



సీజన్ మొదలై నెల గడుస్తున్నా ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం అందలేదు. ప్రధాని మోదీ సాయం అందినా అది ఎందుకూ సరిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం సాయం అందక పోవడంతో మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పడం లేదు. ఏదో బాధపడి విత్తనాలు కొనుగోలు చేశాం. మిగిలిన పనులకు పెట్టుబడి సహాయం అత్యవసరం.

– చింతల వెంకటరమణ, రైతు, లుకలాం, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా

పెట్టుబడి కోసం అగచాట్లు..



గత ఐదేళ్లు పెట్టుబడి సాయం సకాలంలో అందింది. దీంతో అదునులో విత్తనాలు కొనుగోలు చేసేవాళ్లం. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తుందో చెప్పడం లేదు. కేంద్రం నుంచి పీఎం కిసాన్ సాయం అందింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఇంతవరకు విడుదల కాకపోవడంతో పెట్టుబడి కోసం అగచాట్లు తప్పడం లేదు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– కారసాని శివారెడ్డి. సూరేపల్లి, బాపట్ల జిల్లా

సాగు ఖర్చుల కోసం ఇబ్బందులు..



గత ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా అందజేసిన వైఎస్సార్ రైతు భరోసా సాయం రైతులకు కొండంత అండగా నిలిచేది. ఏటా మూడు విడతలుగా రైతుల ఖాతాలో నేరుగా జమ చేసి భరోసా కల్పించేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం డబ్బులు ఇవ్వకపోవడంతో సాగు ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– చింతల రాజు, బురదకోట, ప్రత్తిపాడు రూరల్, కాకినాడ జిల్లా

వారం పది రోజుల్లోనే ఇస్తామని..



అధికారంలోకి వచ్చిన వారం పది రోజుల్లోనే రైతు భరోసా అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకోవాలి. లేదంటే అప్పులే శరణ్యం.

–ప్రభాకర్, రైతు, తిరుపతి రూరల్ మండలం


వ్యవసాయం ఇక కష్టమే



జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జూన్ నెలలో రైతు భరోసా సాయం ఖాతాలో పడేది. ఇప్పుడు ప్రభుత్వం మారడం వల్ల రైతుల గురించి ఆలోచన చేసే విధంగా కనిపించడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు వ్యవసాయం చేయడం కష్టమే.

–ఆకుల నారాయణ రైతు వంగర

సాయం చేయాలి...



మాలాంటి పేద రైతులకు గత ప్రభుత్వం అందించిన రైతు భరోసా సాయం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం వ్యవసాయ పనులు, సేద్యం ప్రారంభమైనా కొత్త ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందకపోవడం విచారకరం. రైతుల పట్ల ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో ఆలోచించి సాయం చేయాలి.

– వెన్నపూస కృష్ణారెడ్డి, ఖాన్‌సాహెబ్‌పేట, మర్రిపాడు మండలం

గుర్తుకొస్తున్నాయి..!

2019కి ముందు పరిస్థితులను తలచుకుంటూ రైతన్నల ఆందోళన



● జగనన్న ప్రభుత్వంలో ఏటా ఖరీఫ్ ప్రారంభంలో రైతు భరోసా అందించి ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పింది. ఇంతవరకూ ఆ హామీకి అతీగతీ లేదు. వ్యవసాయానికి ఇదే అదును. ఈ సమయంలో చేతిలో సొమ్ములేక అప్పులు చేయల్సివస్తోంది. మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి.

– మిడితాన కన్నంనాయుడు, బాసూరు గ్రామం, పాలకొండ మండలం, పార్వతీపురం మన్యం



● వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు. రైతు భరోసా పథకం రైతులకు ఎంతో చేదోడుగా నిలిచింది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం అమలు చేయని రైతు భరోసా పథకాన్ని తెచ్చి అండగా నిలిచారు. పెట్టుబడుల కోసం కూటమి ప్రభుత్వం డబ్బులు ఎప్పుడిస్తుందో అంతుబట్టడం లేదు.

–పోల్నాటి శ్రీనివాసరావు, శ్రీనివాసపురం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా



● వైఎస్ జగన్ క్రమం తప్పకుండా సాయం అందించి రైతులను ఆదుకున్నారు. ప్రభుత్వం మారాక ఇంతవరకు రైతు భరోసా పడలేదు. పెట్టుబడుల కోసం ఏం చేయాలో తోచడం లేదు.

– పిప్పళ్ల వెంకటేశ్వరరావు, రైతు, పోతేపల్లి గ్రామం, బందరు మండలం, కృష్ణాజిల్లా



● గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే నెలలో రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కొత్త ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. జూన్ ముగుస్తోంది. తక్షణం సాయం అందిస్తే బాగుంటుంది.

–తోక కృష్ణ, రైతు, వెల్దుర్తిపాడు, పెనుగంచిప్రోలు మండలం



● ఖరీఫ్ ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి దిగులు లేకుండా సాగు చేసుకున్నాం. ఇప్పుడు సాగు ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పడం లేదు.

– సుంకుగారి భాస్కర్‌రెడ్డి, గోపాయపల్లె గ్రామం, రాజుపాలెం మండలం, వైఎస్సార్‌జిల్లా.



● వర్షాలు కురుస్తున్నాయి. ఆరుద్ర కార్తె కూడా వచ్చింది. పంటల సాగుకు ఇదే మంచి అదును. గత ప్రభుత్వంలో రైతు భరోసా ఠంఛనుగా అందేది. చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి రెండు వారాలు దాటినా రైతుభరోసా ఊసే ఎత్తడం లేదు. జగన్ మళ్లీ సీఎం అయి ఉంటే మాకు ఈ బాధలు ఉండేవి కావు.

– కృష్ణారెడ్డి, రైతు, హస్తవరం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా



● గత ప్రభుత్వంలో ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో రైతు భరోసా డబ్బులు మా బ్యాంక్ అకౌంట్లలో జమ అయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత కేంద్రం నుంచి పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు మాత్రమే జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం రాలేదు.

– రంగయ్య, రైతు, కమ్మవారిపల్లె, నంద్యాల జిల్లా



● గత ప్రభుత్వంలో ఈ సమయానికి రైతు భరోసా అందించేవారు. ఆ సొమ్ము వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడింది. టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలుకు పెంచినట్లు చెప్పినా ఇంతవరకు ఇవ్వలేదు. వ్యవసాయ పనుల సీజన్‌లో అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, పి.జలాలపురం, శింగనమల మండలం, అనంతపురం జిల్లా



● వరి సాగు చేస్తా. గత ప్రభుత్వం రైతు భరోసాతో ఆదుకోవడంతో పెట్టుబడి కష్టాలు తొలగిపోయాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సాయం అందలేదు. దీంతో మళ్లీ 2019 మునుపు పరిస్థితులు వస్తాయని భయంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు పెట్టుబడి సాయంతో ఆదుకోవాలి. లేదంటే ఈ ఏడాది సాగుకు దూరం కాక తప్పదు.

– గుల్లేలు నారాయణరావు, మర్రిపుట్టు గ్రామం, గుల్లేలు పంచాయతీ, పాడేరు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా



● ఏటా మే నెలలో రైతు భరోసా డబ్బులు మా ఖాతాల్లో పడేవి. ఈ ఏడాది జూన్ వెళ్లిపోతున్నా ఇంకా అందలేదు. వర్షాలు పడుతున్నాయి. పెట్టుబడి సాయం ఇంతవరకూ అందలేదు.

– పెచ్చెట్టి సుబ్బారావు, కౌలు రైతు, జిన్నూరు, పోడూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా



● ఏటా 5 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేవాడిని. గత ప్రభుత్వం మే నెలలోనే రైతు భరోసా కింద రూ.5,500 ఖాతాల్లో జమ చేసేది. ఖరీఫ్ పెట్టుబడికి ఆ డబ్బులు ఉపయోగపడేవి. ఇప్పుడు ఇంతవరకు ఆ ఊసే లేదు. సకాలంలో రైతుకు సాయం అందకపోతే చాలా ఇబ్బందులు పడతారు.

– వి. హరినాథరెడ్డి, రైతు, చెరువుమరవపల్లి, తలుపుల మండలం, శ్రీసత్యసాయి జిల్లా



● వరి, చెరకు సాగు చేస్తున్నా. జగన్ సీఎంగా ఉన్న కాలంలో సీజన్‌లో పెట్టుబడులకు సాయం అందించారు. రూ.20 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎప్పుడు ఇస్తారో మాత్రం చెప్పడం లేదు. సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలి.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ, మునగపాక, అనకాపల్లి జిల్లా



● గతంలో రైతు భరోసా క్రమం తప్పకుండా అందింది. ఈ ఏడాది జూలై వస్తున్నా పెట్టుబడి సాయం అందక పోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉంది.

– చిన్నభగవంతప్ప, రైతు, ఆరేకల్, ఆదోని మండలం

రాష్ట్రంలో పేట్రేగిపోతున్న
వ్యక్తిత్వ హంతకులు

- వైఎస్ జగన్‌పై మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌ల దుష్ప్రచారం
- ఎన్నికలకు ముందు నిమ్మగడ్డ, పీవీ రమేష్‌లు జగన్ లక్ష్యంగా పనిచేశారు
- ఎన్నికలవగానే వారు మాయమయ్యారు
- ఇప్పుడు ఎల్వీ సుబ్రమణ్యం, ఇక్బాల్‌లు జగన్‌పై పడుతున్నారు
- ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణంరాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యక్తిత్వాన్ని హననం చేసే హంతకులు రోజురోజుకు పేట్రేగిపోతున్నారని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు అన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. కేరక్టర్ అసాసినేషన్ చేసే వారు వేల సంఖ్యలో పెరిగిపోయారని, నిత్యం కొన్ని వేల మందిని వెంటాడి వేధిస్తున్నారని చెప్పారు. గతంలో ఏపీలో పని చేసి మాజీలైన కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం శోచనీయమని అన్నారు. వారి చేష్టలు ఒక వర్గానికి, ఒక పార్టీకి, ఒక నాయకుడికి అనుకూలంగా ఉంటున్నాయని, వారికి ఇష్టం లేని మరో నాయకుడి వ్యక్తిత్వాన్ని హత్య చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సంఘం మాజీ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అండ్ కో, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ పీవీ రమేష్ ఎన్నికల ముందు వైఎస్ జగన్ పరిపాలనను, జగన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారన్నారు. దీని కోసం సిటిజన్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థను కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సంస్థను ఏపీ వరకే పరిమితం చేశారని, తెలంగాణ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. వీరి కార్యకలాపాలన్నీ వైఎస్ జగన్ అండ్ కోని అధఃపాతానికి తొక్కేయాలన్న విధంగానే సాగాయని తెలిపారు. వారి లక్ష్యం పూర్తయిందని, ఇప్పుడు వారి జాడ లేదని, సిటిజన్ ఫర్ డెమోక్రసీ కార్యక్రమాలు లేవని చెప్పారు. ఇప్పుడు తాజాగా మరికొందరు వైఎస్ జగన్‌ని టార్గెట్ చేశారని తెలిపారు. ఆయనకు పరిపాలన చేతకాదని, ఎవరినీ గౌరవించడని, సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి మీద పాలనంతా వదిలేశారంటూ వింత విషయాలు చెబుతున్నారని చెప్పారు. తాజాగా ఎల్‌వీ సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్‌లు ఖాళీగా ఇంట్లో ఉండి వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని చెప్పారు. విశాఖలో స్టీల్ ఫ్యాక్టరీ అమ్మేసి అక్కడ రాజధాని పెడదామని జగన్ చెప్పారని సుబ్రమణ్యం అనడం వింతగా ఉందన్నారు. జగన్ రాజకీయాల్లోకి రాకముందే వ్యాపారంలో అనుభవం ఉందని, స్టీల్ ఫ్యాక్టరీ అమ్మటం సాధ్యం కాదని ఆయనకు తెలీదా అని అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయొద్దని జగన్ కేంద్రానికి లేఖ కూడా రాశారని తెలిపారు. జగన్‌కి పాలన తెలీదని అని అంటున్న ఐఏఎస్ సుబ్రమణ్యంకి కూడా తెలియని విధంగా వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. వైఎస్ జగన్ 30లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇలా ఇమ్మని ఎల్వీ గానీ, ఇక్బాల్ కానీ చెప్పారా.. అని నిలదీశారు. ఎల్వీ సుబ్రమణం ఫైల్స్ ఏమీ తేల్చడనే ప్రచారం ఉందని, టీటీడీ నిధులను విలాసాలకు వాడుకొన్నారన్న ఆరోపణలు ఉన్నాయని, వీటికి ఆయన ఏమి సమాధానం చెబుతారని అన్నారు. 2019 ఎన్నికల కౌంటింగ్ కాగానే జగన్‌ను కలిసి ఆయన ప్రాపకం కోసం ఎందుకు ప్రయత్నించారని, గవర్నర్ ఆదేశిస్తేనే కలవాలి కదా.. అని నిలదీశారు. ఇక్బాల్ వక్ఫ్ బోర్డు అధికారిగా ఉన్నప్పుడు ఆయన సామాజికవర్గం వారే ఇక్బాల్ పనికిరాడని ఆరోపించారన్నారు. ఇక్బాల్ ఎన్నికల్లో ఓడిపోయినా వైఎస్ జగన్ ఎమ్మెల్సీగా ఎంపిక చేశారని చెప్పారు. జగన్‌కు పాలన తెలియదని వీరు ఎలా అంటారని ప్రశ్నించారు. వీరి వెనుక ఉన్న మూల విరాట్ ఎవరో అందరికీ తెలుసునని అన్నారు.

క్లుప్తంగా...

వారానికి ఐదు రోజుల పనిదినాలు మరో ఏడాది పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంతోపాటు శాఖాధిపతుల కార్యాలయాల్లో వారానికి ఐదు రోజులు పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వారానికి ఐదు రోజులు పనిదినాల విధానం గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం మరో ఏడాదిపాటు వారానికి ఐదు రోజుల పనిదినాలు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వారానికి ఐదు రోజుల పనిదినాలను మరో ఏడాది కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనివేళలుగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

బాధ్యులందరిపై కఠిన చర్యలు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్

సాక్షి, అమరావతి: డయేరియా విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను హెచ్చరించారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డయేరియాపై పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. డయేరియా అడ్మిషన్లపై సమాచారం ఇవ్వని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. తమ పరిధిలో కేసులు వచ్చిన వెంటనే సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి చేరవేయడంలో విఫలమైన డీఎంహెచ్‌వోలపైనా చర్యలకు వెనుకాడబోమని చెప్పారు. జూలై 1నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సున్నా ప్రసవాలున్న పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్, ఎన్‌హెచ్‌ఎం ఎస్పీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తామనడం సరికాదు

మాల మహానాడు నేత నాగమల్లేశ్వరి



అల్లిపురం(విశాఖ దక్షిణ): ఎస్సీ, ఎస్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించడం సరికాదని మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి అన్నారు. విశాఖలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తారన్నారు. ఈ క్రమంలోనే కుప్పంలో ఎస్సీల విభజన గురించి ఆయన మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అంబేడ్కర్ ఆలోచనావిధానానికి ఎవరు అడ్డుపడినా వారిని నామరూపాలు లేకుండా చేసిన చరిత్ర చాలానే ఉందన్నారు.

అభివృద్ధికి రైతులు అడ్డుకాదు



రైతులతో చర్చిస్తున్న సీఆర్‌డీఏ సీఏ ఎం.విశ్వేశ్వరనాయుడు

తాడేపల్లి రూరల్: రైతులు అభివృద్ధికి అడ్డుకాదని, అయితే గ్రామాలవారీగా భూముల విలువ ఆధారంగా మెరుగైన ప్యాకేజీలు ఇవ్వాలని రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు కొర్రప్రోలు ఈశ్వరరెడ్డి తెలిపారు. రాజధాని ప్రాంతం నుంచి జాతీయ రహదారి వరకు సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం గుంటూరు జిల్లా పెనుమాక సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ సీఏ ఎం.విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రైతులు తమ పంట పొలాలను ఇవ్వాలని, సీఆర్‌డీఏ నిబంధనల ప్రకారం ప్యాకేజీ అందజేస్తామని తెలిపారు. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ.. నేలపాడులో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ఎకరా రూ.3లక్షలు ఉందని, అక్కడ ప్యాకేజీ కింద 1,400 గజాలు ఇస్తున్నారని, పెనుమాకలో రిజిస్ట్రేషన్ విలువ ఎకరాకు రూ.8 లక్షలు ఉందని, ఇక్కడి వారికి 2,400 గజాలు ఇవ్వాలని కోరారు. సీడ్ యాక్సెస్ రోడ్‌కు 11మంది రైతులు తమ పొలాలను ఇవ్వాల్సి ఉంది. వారు తమ నిర్ణయాన్ని రైతు సంఘం నాయకుడు ఈశ్వర్‌రెడ్డి ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ రైతులు కోరిన ప్యాకేజీ గురించి సీఆర్‌డీఏ కమిషనర్‌తో మాట్లాడి తుది నిర్ణయం తెలియజేస్తామని చెప్పారు.

జేఎన్‌టీయూఏ వీసీ రాజీనామా

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు ఆ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీకి సమాచారం పంపారు. ఆయన జనవరి 17న జేఎన్‌టీయూఏ వీసీగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వీసీలంతా రాజీనామా చేయాలని మౌఖిక ఆదేశాలందాయి. దీంతో వీసీ రాజీనామా చేశారు.

సచివాలయాల సిబ్బంది సిద్ధం కావాలి

65,18,496 మంది పెన్షనర్లకు ఒక్కరోజులోనే పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం అమలులో భాగంగా కొత్త ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పింఛన్లను జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీకి ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 65,18,496 మందికి పెంచిన మొత్తాన్ని ఒక్క రోజులోనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయించాలన్నారు. రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎస్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందుకు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ..

ఎన్నికల సమయంలో తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు ఒకటో కేటగిరీలోని వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప కేటగిరీలకు చెందిన వారి పింఛను సొమ్మును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1న రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే జూన్‌కు సంబంధించిన ఎరియర్ల సొమ్ము నెలకు రూ.వెయ్యి చొప్పున మూడునెలల ఎరియర్స్ మూడువేలతో కలిపి మొత్తం రూ.7,000లను పంపిణీ చేయాలని సీఎస్ ఆదేశించారు. రెండో కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, మూడో కేటగిరీలోని పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుండి రూ.15 వేలకు, నాల్గో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.5 వేల నుండి 10 వేలకు పెంచిన పింఛను సొమ్మును పంపిణీ చేయాలని ఆయన సూచించారు. మిగిలిన ఐదో కేటగిరీలోని వారికి గతంలోలాగే ఎలాంటి మార్పులేకుండా యథావిధిగా పింఛన్ సొమ్మును పంపిణీ చేయాలన్నారు.

1వ తేదీనే పంపిణీ

ఇక పెంచిన పింఛన్లను జూలై 1న రూ.4,399.89 కోట్లను 65,18,496 మంది పింఛనుదారులకు ఒక్కరోజులోనే పంపిణీకి ఏర్పాట్లుచేయాలని నీరబ్‌కుమార్ చెప్పారు. ఇందులో రూ.4,369.82 కోట్లను 64.75 లక్షల మంది పింఛనర్ల ఇళ్ల వద్ద, మిగిలిన సొమ్ము రూ.30.05 కోట్లను రాష్ట్రం వెలుపల ఉండే 0.43 లక్షల పింఛనర్లు.. బయట చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు డీబీటీ పద్ధతిలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇళ్ల వద్ద నగదు రూపేణా పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును శనివారమే బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జూలై 1న ఉ.6.00 గంటల నుండి పింఛనర్ల ఇంటివద్దే పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగుల సేవలనూ వినియోగించుకోవాలని సీఎస్ చెప్పారు. అలాగే, ఒక్కో ఉద్యోగికి 50 ఇళ్ల చొప్పున అప్పగించేలా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని శుక్రవారంకల్లా పూర్తిచేయాలన్నారు. సాధ్యమైనంత మేర ఒకే రోజు ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని.. అవసరమైతే రెండోరోజు కొనసాగించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిస్, ఆర్బీఐఎస్ అథంటికేషన్ ఆధారంగానే పింఛను సొమ్మును పంపిణీ చేయాలని, పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ సర్టిఫికెట్ కూడా జారీచేయాలని నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శులు సౌరబ్ గౌర్, సత్యనారాయణ.. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులతోపాటు అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రక్షణ కల్పించండి

రాష్ట్ర డీజీపీకి వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల లేఖ

సాక్షి, అమరావతి: అధికార కూటమి నేతల అమానుష దాడుల నుంచి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ కల్పించాలని పార్టీ ముఖ్య నేతలు డీజీపీ ద్వారకా తిరుమలరావును కోరారు. పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పార్టీ కార్యాలయాల్లోకి అక్రమ చొరబాట్లను, దాడులను నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం డీజీపీకి ఓ లేఖ రాశారు. దానిని డీజీపీకి మెయిల్ ద్వారా పంపారు. కూటమి నేతల దౌర్జన్యాలకు సంబంధించిన పలు ఆధారాలు, వివరాలు కూడా లేఖతోపాటు జత చేశారు.'రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపొందినప్పటి నుంచి గత 25 రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు, వారి ఆస్తులకు, పార్టీ కార్యాలయాలకు రక్షణ లేకుండా పోయింది. పార్టీ నాయకులు, కార్యకర్తలపైన అమానుషంగా దాడులు చేస్తున్నారు. వారి ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. ఈ కేసులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పోలీసులు తగిన రీతిలో చర్యలు తీసుకోవడం లేదు. మా ప్రాణాలకు హాని ఉందని చెప్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. ఈ ఘటనలపై వెంటనే కేసులు నమోదు చేసి, కారకులను వెంటనే అరెస్టు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. అంతేకాకుండా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లోకి టీడీపీ, జనసేన మంత్రులు, నాయకులు, కార్యకర్తలు అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు దిగుతున్నారు. గురువారానికి రాష్ట్రంలోని 14 చోట్ల పార్టీ కార్యాలయాల్లోకి చొరబడ్డారు. మా పార్టీ కార్యాలయాలు, ప్రాంగణాల్లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడి చట్టాన్ని ఉల్లంఘించారు. ఘర్షణలు రేపేందుకు ప్రయత్నించారు. టీడీపీ, జనసేన నాయకులు అక్రమంగా ప్రవేశించినా, బెదిరింపులకు దిగినా పోలీసులు ఎక్కడా వారిని నియంత్రించడంలేదు సరికదా వారి అక్రమాలకు దన్నుగా నిలబడ్డారు. శాంతి భద్రతలను కాపాడి, రక్షణగా ఉండాల్సిన పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులకు తావివ్వడం ద్వారా శాంతి భద్రతలను ప్రమాదంలో పడేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు రక్షణ లేకుండా పోయింది. అధికార టీడీపీ కూటమి నాయకుల దాడులు, దౌర్జన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. నిర్లిప్తంగా వ్యవహరించిన పోలీసు అధికారులపైనా శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

పోలీసు శాఖలో అంతర్గత ఇంటెలిజెన్స్ వ్యవస్థ

హోం మంత్రి వంగలపూడి అనిత



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న హోం మంత్రి అనిత

సాక్షి, అమరావతి: పోలీసు శాఖలో అంతర్గత ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉండాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో ఆమె గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రం మొత్తం మీద ఒక టోల్ ఫ్రీ నంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి సత్వరం న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని చెప్పారు. మహిళల మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళిక రూపొందించాలన్నారు. గంజాయి నిర్మూలన కోసం హోమ్, ఎక్సైజ్, విద్య, వైద్య శాఖలు సంయుక్తంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావుతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తాం



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జేసీ, ఆర్డీఓలతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేశారు. చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయ భవనాలను పరిశీలించి చట్టపరంగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన విధంగా వాడుకుంటామని మంత్రి చెప్పారు. ఈ మేరకు రెండు రోజుల క్రితమే వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డికి నోటీసులు పంపినట్టు తెలిపారు. మంత్రి వెంట జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ రంగస్వామి ఉన్నారు.

రామోజీ అక్షర శిఖరం

- ఎన్టీఆర్‌తో పాటు రామోజీకీ భారతరత్న కోసం పోరాడాలి
- అమరావతిలో రామోజీ విజ్ఞాన్ కేంద్రం నిర్మిస్తాం
- రామోజీరావు సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు



అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.10 కోట్ల చెక్కును చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు అందచేస్తున్న రామోజీరావు కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి/పెనమలూరు: రామోజీ గ్రూప్స్ అధిపతి చెరుకూరి రామోజీరావు అక్షర శిఖరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. తెలుగు భాషపై ఎనలేని అభిమానం, తెలుగు జాతిపై ఎంతో ఆప్యాయతతో రామోజీరావు విలువలతో కూడిన సమాజం కోసం కృషి చేశారన్నారు. విజయవాడ శివారు పెనమలూరు మండలం కానూరులో గురువారం ప్రభుత్వం నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభకు ఆయన విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌తో పాటు రామోజీరావుకు 'భారతరత్న' సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని కోరారు. అమరావతిలో రామోజీ స్మారకార్థం విజ్ఞాన కేంద్రాన్ని నిర్మిస్తామని.. ఒక రోడ్డుకు రామోజీరావు మార్గ్‌గా నామకరణం చేయడంతో పాటు విశాఖలో రామోజీ చిత్రనగరి పేరుతో సినిమా షూటింగ్‌లకు ప్రత్యేక వాతావరణం కల్పిస్తామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 1982లో ఎన్టీఆర్‌ను అధికారంలోకి తేవడంలోనూ, ఆగస్టు విపత్తు నుంచి గట్టెక్కించడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని చంద్రబాబు గుర్తు చేశారు. వందల మంది జర్నలిస్టులను, నటీనటులను, కళాకారులను, గాయకులను సమాజానికి అందించిన దార్శనికుడిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధికి రామోజీరావు కుమారుడు కిరణ్ రూ.10 కోట్ల విరాళాన్ని చెక్కు రూపంలో చంద్రబాబుకు అందజేశారు.

రామోజీ ప్రజల పక్షపాతి: డెప్యూటీ సీఎం పవన్

రామోజీరావు ప్రజల పక్షపాతి అని డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ప్రజా క్షేమం కోసం నిత్యం పాటుపడుతూ జర్నలిజం విలువలు కాపాడటానికి కృషి చేశారన్నారు. పత్రికా రంగం, సినీ నిర్మాణం, స్టూడియోలతో ఎందరికో ఉపాధి కల్పించారని.. ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని ఎదుర్కొని ఎక్కడా రాజీ పడలేదన్నారు. రామోజీరావు స్ఫూర్తిదాయక పాత్రికేయులని.. కచ్చితంగా ఆయనకు విగ్రహం పెట్టాలని పవన్ ఆకాంక్షించారు.

విలువలకు కట్టుబడిన రామోజీ..

హిందూ దినపత్రిక ఎండీ ఎస్.రామ్ మాట్లాడుతూ.. విలువలకు కట్టుబడిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా ఆయన సేవలు ఎనలేనివన్నారు. రాజస్థాన్ పత్రిక ఎడిటర్ గులాబ్ కొఠారి, నిర్మాత శ్యాంప్రసాద్‌రెడ్డి, సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, సినీనటుడు మురళీమోహన్ కూడా మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల ఆదాయం పెంచండి

అధికారులతో సమీక్షలో పురపాలక మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. గురువారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ సింఘాల్‌తో కలిసి విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెన్సీలు, డెవలపర్లు కచ్చితంగా నిబంధనలను పాటించేలా పర్యవేక్షించాలన్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని లేఅవుట్ల అనుమతుల విషయంలో వస్తున్న ఫిర్యాదులపై కమిటీని నియమించారు.

లోకేశ్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ జూలై 8కి వాయిదా



సాక్షి, అమరావతి: నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, నిధుల వృథా, ప్రభుత్వ సంపదకు, సహజ వనరులకు నష్టం కలిగించడం వంటి విషయాల్లో తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా అధీకృత అధికారుల నియామకం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అప్పటి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రఘురామిరెడ్డి రాసిన లేఖను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు మరోసారి ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు వీలుగా నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోవడం, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, నిధుల వృథా, ప్రభుత్వ సంపదకు, సహజ వనరులకు నష్టం కలిగించడం వంటి విషయాల్లో ఏ సంస్థలోకైనా వెళ్లేందుకు, సోదాలు చేసేందుకు, సమాచారం సేకరించేందుకు, రికార్డులను పరిశీలించేందుకు, జప్తు చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసేలా గెజిటెడ్ అధికారులందరినీ అధీకృత అధికారులుగా నియమించాలని కోరుతూ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదాలో కొల్లి రఘురామిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఈ లేఖను సవాల్ చేస్తూ టీడీపీ తరపున నారా లోకేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా గురువారం ఈ వ్యాజ్యంపై జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు.

న్యాయమూర్తి అసహనం

లోకేశ్ తరపు న్యాయవాది అఖిల్ చౌదరి వాదనలు వినిపిస్తూ.. కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. ఈ వ్యవహారంపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం గతంలో చెప్పిందని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయం తీసుకున్నారా?, తీసుకోబోతున్నారా?, అసలు ఈ వ్యవహారంలో ఏం చేయబోతున్నారో తెలియచేస్తూ కౌంటర్ దాఖలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం ఏం చెప్పాలో మీరే పేరాల వారీగా కౌంటర్ దాఖలు చేసి ఇవ్వండి. దాన్నే ప్రభుత్వం దాఖలు చేస్తుంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏయే అంశాలపై కౌంటర్ దాఖలు చేయాలో కోర్టు ఎలా చెబుతుందని ప్రశ్నించారు. కౌంటర్ దాఖలు నిమిత్తం విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఎస్పీఎంగా శ్రీనివాసరావు

మంత్రి సత్యకుమార్ అనుమతి లేకుండానే నియామకం!

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్(ఎస్పీఎం)గా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ మెంబర్ సెక్రటరీ అయిన డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావుకు బాధ్యతలప్పగిస్తూ ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. వెనువెంటనే శ్రీనివాసరావు ఎస్పీఎంగా బాధ్యతలు స్వీకరించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా సేవలను మెరుగుపరచడం కోసం ఈయన సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శ్రీనివాసరావుకు ఎస్పీఎంగా బాధ్యతలు అప్పగించడం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఆయన అనుమతితో పనిలేకుండానే కీలకమైన ఎస్పీఎం నియామక ఉత్తర్వులిచ్చారని తెలిసింది. కూటమిలో బీజేపీ ఏకైక మంత్రిగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అనుమతితో సంబంధం లేనట్లుగా టీడీపీ నేతలు వ్యవహరించడం వల్లే ఇలా జరిగిందనే చర్చ నడుస్తోంది.

పోలీసు స్టేషన్‌లోనే టీడీపీ నేతల దాష్టీకం

- కుక్కునూరులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై దాడి
- టీడీపీ మండలాధ్యక్షుడు, అతని సోదరుల గూండాయిజం
- వైఎస్సార్‌సీపీ నాయకుడికి తీవ్ర గాయాలు.. రక్షించిన స్థానికులు
- మరో వ్యక్తి పైనా దాడి చేసిన టీడీపీ వర్గీయులు



దాడిలో గాయపడ్డ మల్లెల నాగముక్తేశ్వరరావు

ఏలూరు: పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ఎదుటే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌పై టీడీపీ నేతలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఏలూరు జిల్లా కుక్కునూరు పోలీసు స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే గురువారం సాయంత్రం ఓ కేసు విషయమై మాట్లాడేందుకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ మల్లెల నాగ ముక్తేశ్వరరావు, కుక్కునూరు ప్రసాద్, మరికొందరు కుక్కునూరు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. సీఐతో మాట్లాడి బయటకు వస్తుండగా అప్పటికే ప్రణాళిక ప్రకారం తన అనుచరగణంతో అక్కడ ఉన్న టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, అతని ఇద్దరు సోదరులు, కొందరు ఎస్టీ యువకులతో కలిసి ముక్తేశ్వరరావుపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. కుక్కునూరు ప్రసాద్ పైనా దాడి చేయబోగా, అతను తప్పించుకున్నాడు. అతనిపై పదునైన ఆయుధం విసరడంతో అతని వేలికి గాయమైంది. ఈ దాడిలో నాగముక్తేశ్వరరావు ఎడమ కంటికి, పక్కటెముకలకు, కాలికి, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడు గట్టిగా అరవడంతో అక్కడున్నవారు అడ్డుకుని అతడిని అక్కడి నుంచి తప్పించారు. సాధారణంగా కుక్కునూరు ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికల వరకే రాజకీయ పోటీ ఉంటుంది. ఆ తరువాత అందరూ అన్నదమ్ముల్లా జీవిస్తుంటారు. కానీ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. పోలీసులు కూడా అధికార పార్టీ నాయకులకు తలొంచి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో శ్రీధరలో ఇటువంటి ఘటనే జరిగినా కఠిన చర్యలు చేపట్టకపోవడం వల్లే మళ్లీ ఇటువంటివి పునరావృతం అవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆస్పత్రిపై మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు



ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పేరు తొలగించగా.. మిగిలి ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం పెదపూడి పేరు

పెదపూడి: తూర్పుగోదావరి జిల్లా పెదపూడి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంపై ఉన్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఆస్పత్రి పైభాగాన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం పెదపూడి, ఆరోగ్య ప్రదాత శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎంఎస్ అని రాసి ఉంది. ఇందులో ఆరోగ్య ప్రదాత శాసన సభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎంఎస్‌ని తొలగించారు. 2020 సెప్టెంబర్ 7న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాడు–నేడు పథకంలో నాబార్డు నిధులు రూ.5.86 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి, ఆధునీకీకరణకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు పూర్తి చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 6న ప్రారంభించారు. కాగా.. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పేరు పెట్టాలని తీర్మానించగా.. ఆ మేరకు ఏర్పాటు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే పేరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విషయమై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రమణమూర్తిని వివరణ కోరగా.. ఈ పేరును ఎవరు తొలగించారో, ఎప్పుడు తొలగించారో తెలియదని సమాధానమిచ్చారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటుచేసి ఉద్యోగాలు కల్పించండి

- యువతకు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కె.శ్రీనివాస్ పిలుపు
- 12 యూనిట్లకు రూ.9.39 కోట్ల రుణ చెక్కుల పంపిణీ
- 38 యూనిట్లకు అనుమతి మంజూరు పత్రాల అందజేత



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వివిధ సంస్థల ప్రతినిధులు

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి, విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాలనే ఆలోచనలను యువత వదిలేసి రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వినియోగించుకుంటూ చిన్న పరిశ్రమలు ఏర్పాటుచేసి స్వయం ఉపాధి పొందడంతోపాటు పది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు వచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు. అంతర్జాతీయ ఎంఎస్‌ఎంఈ డే సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్స్ (ఫాప్సియా) సంయుక్తంగా గురువారం విజయవాడలో నిర్వహించిన సదస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా తరహాలో రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి తీసుకువెళ్లే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఒక జిల్లా ఒక ప్రోడక్ట్ (ఓడీవోపీ) పథకం కింద స్థానిక ఉత్పత్తులను ఎగుమతి చేయడంపై ప్రధానంగా దృష్టిసారించనున్నట్లు తెలిపారు. పారిశ్రామికవేత్తలు కోరినట్లు ఎంఎస్‌ఎంఈలకు తక్కువ ధరకు భూమి కేటాయింపు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈల సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వేలో అందరూ పాల్గొనాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ర్యాంప్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కొత్త యూనిట్లు ఏర్పాటుచేయడానికి 12 సంస్థలకు బ్యాంకులు మంజూరు చేసిన రుణం రూ.9.39 కోట్ల చెక్కులను మంత్రి కె.శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొత్తగా రూ.7.29 కోట్లతో ఏర్పాటుచేస్తున్న 38 యూనిట్లకు అనుమతి మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఫాప్సియా సభ్యులకు తక్కువ ధరకే తమ సేవలు అందించే విధంగా రమేష్ హాస్పిటల్స్, ట్యాలీ, కేఎల్ యూనివర్సిటీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఏపీ పటేల్, ఫాప్సియా ప్రెసిడెంట్ వాసిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

> తండ్రి లేని బిడ్డల సొమ్మును అన్యాయంగా తినేవారు తమ పొట్టల్ని అగ్నితో నింపుకుంటున్నారు. త్వరలోనే వారు మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 జూన్ 2024

'పెండింగ్'కు మంచి దోవ!

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల గురించి ఎవరికీ తెలియనిది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసినవారు గతంలో చాలాసార్లు మాట్లాడారు. రిటైరయ్యే రోజున కూడా ఆ మాట చెప్పి నిష్క్రమించేవారు. తమ పదవీకాలంలో పెండింగ్ బెడదను సాధ్యమైనంత తగ్గించేందుకు పలు విధానాలు అమలు పరిచేవారు. న్యాయమూర్తుల సంఖ్య పెంచాలంటూ ప్రధానికి బహిరంగ వినతులు చేసినవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మరో అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. ఈ శనివారం నుంచి వరసగా ఆరురోజులపాటు ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో సుప్రీంకోర్టులో లోక్ అదాలత్‌లు జరగకపోలేదు. కానీ ఎప్పుడో ఒకసారి జరిగే ఈ అదాలత్‌లకు పెద్దగా స్పందన ఉండేది కాదు. అందువల్లే ఈసారి వరసగా ఆరురోజులపాటు సాగించాలని ఆయన భావించారు. ఈ కార్యక్రమంలో పదివేల కేసుల్ని పరిష్కరించాలన్నది ఆయన లక్ష్యం. పైగా ఈ కేసుల పరిష్కారానికి లిటిగెంట్లకు పైసా ఖర్చుండదు. వీటిల్లో కార్మిక చట్టాలు, అద్దె, సేవలు, పరిహారం, కుటుంబ తగాదాలు, సాధారణ సివిల్ తగాదాలు, వినియోగదారుల కేసులు ఉంటాయి. జస్టిస్ చంద్రచూడ్ చెబుతున్న ప్రకారం సుప్రీంకోర్టులో ప్రస్తుతం 66,059 సివిల్ కేసులూ, 18,049 క్రిమినల్ కేసులూ ఉన్నాయి. రెండూ లెక్కేస్తే 84 వేల పైమాటే. ఇవిగాక వివిధ హైకోర్టుల్లో 44,03,152 సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ చెబుతోంది. క్రిమినల్ కేసుల సంఖ్య 17,55,946. మొత్తంగా చూస్తే దాదాపు 62 లక్షలు! హైకోర్టుల్లో ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నవి పది లక్షల సివిల్ కేసులు. ఇవిగాక సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో రోజూ దాఖలయ్యే కేసులు, అప్పీళ్లు, కింది కోర్టుల్లో పెండింగ్ పడిన కోట్లాది కేసులు అదనం.

న్యాయవ్యవస్థ పుట్టిన నాటినుంచీ అవతలి పక్షాన్ని కోర్టుకీడ్చి ఇరుకున పెట్టాలన్న యావ కక్షిదారులకు సహజంగా ఏర్పడివుంటుంది. రాచరికాల్లో ఇంత చేటు సాహసం ఉండేది కాదు. తప్పనిసరైతే తప్ప, తనవైపే న్యాయం ఉందన్న ధీమా ఉంటే తప్ప ఫిర్యాదు చేయడానికి జంకేవారు. తేడా వస్తే తల తీస్తారన్న భయమే అందుకు కారణం కావొచ్చు. చిత్రమేమంటే వర్తమాన కాలంలో ప్రభుత్వాలే పెద్ద లిటిగెంట్లుగా మారాయి. అసమ్మతి ప్రకటించేవారిపై ఎడాపెడా కుట్ర కేసులు బనాయించటం, ఇతరత్రా కేసుల్లో ఇరికించటం ఇప్పటికీ సాగుతూనే వుంది. ప్రభుత్వాలు అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవటం ఒకపక్క, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాలను కోర్టుకీడ్చటం మరోపక్క సమాంతరంగా సాగుతుంటాయి. వలస పాలకుల నాటి చట్టాలనే ఇప్పటికీ నెత్తిన పెట్టుకోవటం, అవకతవకలు జరగలేదని తెలిసికూడా అధికార మదంతో వ్యతిరేకులను అక్రమ కేసుల్లో ఇరికించటం మితిమీరుతోంది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాల పుణ్యమా అని యూపీ నుంచి ఏపీ దాకా బుల్‌డోజర్లు నడిపించే సంస్కృతి పెరిగింది. ప్రత్యర్థి పక్షాలకు చెందినవారి ఇళ్లపై, కార్యాలయాలపై దాడులు సరేసరి. సహజంగానే ఇలాంటి కేసులన్నీ న్యాయస్థానాలకు ఎక్కక తప్పదు. దానికితోడు పొలాలు, స్థలాలు, ఇళ్లు వగైరా స్థిరాస్తుల వారసత్వ హక్కుల కోసం దాయాదులు, తామే న్యాయమైన హక్కుదారులమంటూ వచ్చే కక్షిదారులు లెక్కలేనంతమంది. ఎన్‌డీఏ సర్కారు ఈమధ్య కాలం చెల్లిన చట్టాల్లో కొన్నిటిని రద్దుచేయటంతోపాటు ఐపీసీ, సీపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టం స్థానాల్లో కొత్త చట్టాలు తీసుకొచ్చింది. అవి ఏమేరకు మార్పు తీసుకురాగలవో ఆచరణ తర్వాతగానీ తెలియదు. నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిరుడు ఏపీలో జగన్ సర్కారు తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం కూడా వినూత్నమైనది. 130 ఏళ్ల తర్వాత దేశంలో తొలిసారిగా తీసుకొచ్చిన ఈ చట్టం ఉద్దేశం నిజమైన హక్కుదారులను గుర్తించి వారి హక్కులు కాపాడటం, అనవసర వ్యాజ్యాలు నిరోధించటం. అధికార యావతో ప్రత్యర్థులు ఎన్నికల్లో వక్ర భాష్యాలు చెప్పి ప్రజలను పక్కదోవ పట్టించారు. చివరకు ఎన్‌డీఏ సర్కారు దాన్ని రద్దుచేస్తోంది. లోక్ అదాలత్‌ల పనితీరు భిన్నమైనది. ఇందులో సామరస్య పరిష్కారానికి ఇరుపక్షాలనూ ప్రోత్సహిస్తారు. ప్రధాన న్యాయమూర్తి నియమించిన న్యాయనిపుణులు ఆ కేసులో ఉన్న సమస్యను న్యాయమూర్తులకూ, లిటిగెంట్లకూ వివరిస్తారు. పిటిషనర్లు నేరుగా న్యాయమూర్తులతో మాట్లాడే అవకాశం కూడా ఇస్తున్నారు. జస్టిస్ చంద్రచూడ్ తీసుకొచ్చిన మరో మార్పేమిటంటే... పిటిషనర్లు దీనికోసం ఢిల్లీ వరకూ వెళ్లనవసరం లేదు. వారికి హైకోర్టుల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

ఇది పెండింగ్ కేసులకు న్యాయవ్యవస్థ నుంచి వచ్చిన ఒక సృజనాత్మక పరిష్కారం. ఇప్పుడు తమ వంతుగా ఏం చేయవచ్చునో ప్రభుత్వాలు ఆలోచించాలి. ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల ఖాళీలు భర్తీచేయటం తక్షణావసరం. వేరే దేశాలతో పోలిస్తే జనాభాకూ, న్యాయమూర్తుల సంఖ్యకూ మధ్య నిష్పత్తి మన దేశంలో చాలా అధికం. అలాగే చట్టాలు చేసేముందు వాటి పర్యవసానంగా ఎన్ని వ్యాజ్యాలు కోర్టు మెట్లెక్కే అవకాశమున్నదో ప్రభుత్వాలు అంచనా వేసుకోవాలి. చెక్ బౌన్స్ కేసులు ఇందుకు ఉదాహరణ. గతంలో సివిల్ తగదాగా ఉన్నదాన్ని శిక్షార్హమైన నేరంగా మార్చారు. దీనివల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగాయి. పెండింగ్ కేసులు తగ్గించటం కోసం సెలవు రోజుల్లోనూ పనిచేయక తప్పడం లేదని ఆ మధ్య ఒక న్యాయమూర్తి వాపోయారు. సుప్రీంకోర్టు తీసుకున్న తాజా చొరవకు ప్రభుత్వాల వివేకం కూడా తోడైతే ఈ సంక్లిష్ట సమస్యకు సులభంగా పరిష్కారం దొరుకుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋుతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.సప్తమి సా.6.10 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** పూర్వాభాద్ర ప.12.29 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర **వర్జ్యం:** రా.9.24 నుండి 10.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 9.00 వరకు, తదుపరి ప.12.29 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పొరుగు స్నేహాల్లో పురోగతి ఎంత?

విశ్లేషణ


జయంత రాయ్ చౌధురీ

ఉగ్రవాద ఎగుమతి ఆరోపణలతో భారత్ సంబంధాలు పాకిస్తాన్‌తో నిలిచిపోయాయి. చైనా ప్రభావ పరిధిలోకి నేపాల్ జారిపోయింది. భారత్‌తో అనేక వ్యూహాత్మక ఒప్పందాలను రద్దు చేసుకోవడంతో సహా అనేక చైనా అనుకూల నిర్ణయాలను మాల్దీవులు తీసుకుంది. చైనా అప్పుల ఊబిలో చిక్కుకున్నప్పటికీ ఆ రుణాలను చైనా పునఃవ్యవస్థీకరిస్తుందని శ్రీలంక ఆశపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం బంగ్లాదేశ్ మాత్రమే భారత ఏకైక పొరుగు నేస్తంగా మిగిలిపోయింది. దాన్ని బలపరిచేలా, ఎన్డీఏ 3.0 ప్రభుత్వం స్థిరపడేలోపే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా గత వారం భారత పర్యటనకు వచ్చారు. ఆ స్నేహాన్ని కాపాడుకుంటూనే, బంగ్లాదేశ్‌ను దాటి ఈ స్ఫూర్తిని విస్తరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారత్ ఆలోచించాలి.

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, తీవ్రమైన వేడితో ఉడికిపోతున్న ఢిల్లీని ఒక నెలలోనే రెండోసారి సందర్శిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కోసం గతవారం ఇండియా వచ్చారు. ఆ భేటీ నాటికి ఎన్డీఏ 3.0 ప్రభుత్వం అప్పుడే స్థిరపడుతోంది. తదుపరి 125 రోజుల కోసం అది రచిస్తున్న పథకాలు ఇంకా పురోగతిలోనే ఉన్నాయి.

ప్రభుత్వాధినేతల స్థాయి సమావేశాలను చాలా నెలల ముందుగానే ప్లాన్ చేయడం జరుగుతుంది. ఇరుదేశాల మధ్య కుదిరే ఒప్పందంలోని ప్రతి పదాన్ని భేటీకి వారాల ముందుగానే దౌత్యవేత్తల బృందం నిశిత పరిశీలన చేసిన తర్వాతే సంతకాలు చేయడం జరుగుతుంది. షేక్ హసీనా పర్యటన కూడా... రెండు పొరుగు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలను మెరుగ్గా ఉంచడానికి ఢిల్లీలోని సౌత్ బ్లాక్, ఢాకాలోని సెగున్‌బగీచాలో ఉన్న బంగ్లా విదేశాంగ మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రణాళికాబద్ధమైన ప్రయత్నంలో భాగమే.

ఈ పర్యటన నుండి సాధించిన రెండు పెద్ద ప్రయోజనాలు ఏవంటే, తీస్తా నదీ జలాలను మెరుగ్గా సంరక్షించడానికీ, నిర్వహించడానికీ సహాయం చేస్తామనే వాగ్దానం. ఇది పశ్చిమ బెంగాల్ ఆవేశపూరిత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకున్న అస్థిరమైన వైఖరి కారణంగా రెండు దేశాల చేయి దాటిపోయిన ఒప్పందం. అలాగే చైనాపై కన్నేస్తూనే, ఇరు దేశాల మధ్య మరిన్ని రహదారి, రైలు, విద్యుత్ కనెక్టివిటీలపై స్పష్టంగా సంతకం కుదిరింది.

భూటాన్ నుండి ఉత్తర బెంగాల్ మీదుగా బంగ్లాదేశ్‌లోకి ప్రవహించే నదిలోని పూడికను తొలగించడంతోపాటు జెట్టీలు, ఓడరేవులు, రహదారులను నిర్మించి నౌకాయానానికి అనువుగా ఉండేలా చేయడానికి చైనా ఇంతకుముందు బంగ్లాదేశ్‌కు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చింది. దీంతో భారతదేశ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య దిశగా కలిపే చికెన్ నెక్ కారిడార్‌కు సమీపంలో చైనా ఉనికికి అవకాశం ఉండటంతో కేంద్రప్రభుత్వం అప్రమత్తమైంది. భారత్ చేస్తున్న ఎదురు ప్రతిపాదనకు (కౌంటర్ ఆఫర్) అనుకూలంగా వ్యవహరిస్తూ, చైనా ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌ను కోరింది.

మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా పని చేసినప్పటినుండి, లాటిన్ అమెరికా కోసం ఫ్రాంక్లిన్ డెలానో రూజ్‌వెల్ట్ ప్రతిపాదించిన 'మంచి పొరుగు' విధానం తరహాలో భారతదేశం ఒక పొరుగు విధానాన్ని రూపొందించడానికి ప్రయత్నిస్తోంది. ఇది దక్షిణాసియాను సన్నిహితం చేయగలదు. అంతేకాకుండా భారత ఉపఖండం వరకు దేశాల మధ్య శాంతి, ఆర్థిక సంబంధాలను ప్రోత్సహిస్తుంది.

ఇస్లామాబాద్‌కు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న ఉగ్రవాద ఎగుమతి ఆరోపణల కారణంగా పాకిస్తాన్‌తో భారత్ సంబంధాలు స్తంభించిపోయాయి. అదే సమయంలో చైనా ప్రభావ పరిధి వైపు నేపాల్ మొగ్గ చూపుతోంది. పైగా పూర్వ హిందూ రాజ్యంలో భాగంగా కుమావూ భూభాగాలను చూపిస్తున్న మ్యాప్ విషయమై భారతదేశంతో నేపాల్ గొడవ పడుతోంది. భారత రక్షణ ప్రాంతమైన భూటాన్, ఎదుగుతున్న చైనాతో విరోధించకూడదనే ఆత్రుతలో బీజింగ్‌తో సరిహద్దు చర్చల్లో మునిగిపోయింది.


భారత ప్రధాని నరేంద్ర మోదీతో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

ద్వీప దేశమైన మాల్దీవులు గత సంవత్సరం ప్రభుత్వంలో మార్పును చూసినప్పటి నుండి, 'తుంటరి పిల్లాడి'లా వ్యవహరిస్తోంది. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ ఢిల్లీలో ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రధాని మోదీతో కలిసి వేదికపై కనిపించారు; కానీ మాల్దీవులలోని కొన్ని డజన్ల మంది భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని కోరడం, భారత్‌తో అనేక వ్యూహాత్మక ఒప్పందాలను రద్దు చేయడంతో సహా అనేక చైనా అనుకూల భారత వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. బీజింగ్‌తో కుదుర్చుకున్న ఖరీదైన ప్రాజెక్టుల కారణంగా చైనా అప్పుల ఊబిలో శ్రీలంక చిక్కుకుంది; అయినప్పటికీ చైనా తన రుణాలను పునఃవ్యవస్థీకరిస్తుందనీ, మరిన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందనీ ప్రకటించింది. కొలంబో చైనా ఆలింగనంలోకి వెళ్తోందనడానికి ఇది గట్టి సంకేతం.

దీంతో భారత్‌కు పొరుగున ఉన్న 'మంచి మిత్రుడు'గా ఢాకా మాత్రమే ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ స్థాపకుడు షేక్ ముజీబ్ హత్య తర్వాత, భారత్ పట్ల బంగ్లాదేశ్ విద్వేషపూరితమైన ప్రారంభానికి సంబంధించిన మొదటి సంకేతాలు, 2007–09లో సైనిక మద్దతుగల ఆపద్ధర్మ ప్రభుత్వ పాలనలో వచ్చాయి. ముజీబ్ కుమార్తె షేక్ హసీనా తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరుదేశాల సంబంధాలు వికసించాయి. అప్పటి నుండి రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విద్యుత్ గ్రిడ్‌ల గొలుసు ద్వారా ఈ ప్రాంతాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నంలో బంగ్లాదేశ్... భారతదేశానికి గొప్ప మిత్రదేశంగా ఉంది.

భారత్‌కు సమస్యాత్మకమైన ఈశాన్య తిరుగుబాటుదారులను, ఇస్లామిస్ట్ టెర్రర్ మాడ్యూల్స్‌ను అప్పగించడంలో సహకారం, పరస్పర భూభాగాల్లోని చిన్న ప్రాంతాల మార్పిడి అనేవి, ఇరుదేశాల మధ్య సంబంధానికి బలమైన పునాదిని ఏర్పర్చాయి. ఈ ఢాకా–న్యూఢిల్లీ సంబంధాలపై చీకటి మేఘాలు లేవని కాదు. గత సంవత్సరం ఎన్నికల సమయంలో మాల్దీవుల్లో వివాదాస్పదమైన 'ఇండియా అవుట్' ప్రచారాన్ని చూసినట్లే, బంగ్లాదేశ్ కూడా ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రతిపక్షాలు నిర్వహించిన అదే తరహా ప్రచారాన్ని చూసింది. ఇది భారత స్నేహితులను ఆందోళనకు గురి చేసింది.

1980 నుండి తలసరి ఆదాయం పదిరెట్లు పెరిగి 2,700 అమెరికన్ డాలర్లకు చేరిన నదీతీర దేశం, మరింత వృద్ధి సాధించడం కోసం విదేశీ వాణిజ్యంపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే ఇప్పటినుంచి రెండు సంవత్సరాల్లో బంగ్లాదేశ్ తక్కువ అభివృద్ధి చెందిన దేశం అనే తన స్థితిని మార్చుకుంటుంది. దీంతో ఎదురయ్యే ఒక సవాలు ఏమిటంటే, చాలా మార్కెట్లలో డ్యూటీ–ఫ్రీ ప్రాప్యత అవకాశాన్ని కోల్పోతుంది. సుంక రహిత మార్కెట్ ప్రాప్యత కొనసాగే కొత్త సమగ్ర వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్ సహాయం చేయాలి. మరింత వెసులుబాటుతో కూడిన వీసా పాలన; ఆ దేశానికి అవసరమైన ఉల్లిపాయలు, వెల్లుల్లి వంటి ఆహారాన్ని అంతరాయాలు లేకుండా సాఫీగా ఎగుమతి చేయడం వంటివి భారత్ రాబోయే రోజుల్లో అనుసరించే 'మంచి పొరుగు' విధానంలో భాగంగా ఉండాలి.

అదే సమయంలో బంగ్లాదేశ్‌ను దాటి, ఈ స్నేహపూర్వకమైన స్ఫూర్తిని విస్తరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారత్ ఆలోచించాలి. ప్రధాని మోదీ తన దక్షిణాసియా ప్రత్యర్థులకు ఆహ్వానాలు పంపినప్పుడు, పాకిస్తాన్ మాత్రమే దీనికి మినహాయింపు అయింది. బహుశా మన విధానాన్ని మార్చుకుని, దివాళాకు దగ్గరగా ఉన్న పొరుగుదేశానికి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చుతూ బదులుగా శాంతిని పొందడానికి సమయం ఆసన్నమై ఉండవచ్చు. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం కోసం బీజింగ్‌తో కొత్త గొప్ప ఆటలో భారత్ నిమగ్నమై ఉన్నప్పుడు... ఇస్లామాబాద్‌ను దాని 'బెస్ట్ ఫ్రెండ్' అయిన చైనా నుండి దూరంగా ఉంచడం భారతదేశానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

వాస్తవానికి, తక్కువ వాగాడంబరం, చిన్న పొరుగువారి పట్ల ఎక్కువ సున్నితత్వం, మరింత వాణిజ్యం, కనెక్టివిటీ, చిన్నచిన్న అసౌకర్యాలను విస్మరించి పెద్ద చిత్రాన్ని చూసే తేడాలను క్రమబద్ధీకరించడంలో ఉదారమైన ప్రతిపాదనల వంటివి భారతదేశం చుట్టూ ఉన్న రాజధానులతో కంచెలను చక్కదిద్దడానికి మార్గం కావచ్చు. బీజింగ్‌ను ఈ ప్రాంతంలోకి మరింత ప్రవేశించకుండా నిరోధించాలి.

వ్యాసకర్త 'పీటీఐ' ఈస్టర్న్ రీజియన్ నెట్‌వర్క్ హెడ్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఎమర్జెన్సీ కాదా?



ఎమర్జెన్సీ పాలన కాలపు చీకటి రోజులు ఒక రాజకీయ మహాపరాధం; అది ప్రజాస్వామ్యపు గొంతు నులమడమే! కానీ 'ప్రజాస్వామ్యం' ముసుగులో అప్రకటిత 'ఎమర్జెన్సీ' అంతకంటే ఘోరమైనది.

– చంద్రకుమార్ బోస్, యాక్టివిస్ట్

మనో రీతి



చాలామంది మహిళలు తమ భర్త వాళ్ల అమ్మకు విధేయుడిగా ఉన్నాడనీ, తమ కొడుకు అతడి భార్యకు విధేయుడిగా ఉన్నాడనీ నమ్ముతుంటారు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

అత్యుత్తమ విధానం



విదేశాంగ విధానానికి సంబంధించి ఈ క్షణంలో ఇండియా రెండు అంశాల్లో తన అత్యుత్తమ దశలో ఉంది: 1. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మీద మన వైఖరి: మన పౌరుల భద్రతకు హామీ ఇస్తూనే రష్యా నుంచి చమురు కొనడాన్ని కొనసాగిస్తున్నాం. 2. ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధానికి సంబంధించి రెండు–దేశాల పరిష్కారానికి మద్దతు ఇస్తున్నాం.

– ఒమర్ ఘాజీ, రచయిత

ఎందుకంత తొందర?



నూపుర్ శర్మను తిరిగి తన పదవిలో బీజేపీ ఇప్పటికీ నియమించలేదు. కానీ శ్యామ్ పిట్రోడాను ఒక్క నెలలోనే కాంగ్రెస్ తిరిగి నియమించింది. (వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఇరువురినీ ఆ యా పార్టీలు పక్కనపెట్టాయి.)

– పూర్ణిమ, వైద్యురాలు

ఎందుకా ఎగతాళి?



దక్షిణాఫ్రికా చేతిలో సెమీ ఫైనల్(టీ20 ప్రపంచ కప్) ఓడినందుకు పాకిస్తానీయులు అఫ్గానిస్తాన్‌ను ఎగతాళి చేస్తున్నారు. కానీ మీకు ఇది గుర్తుచేయనీ– మీ జట్టు కనీసం సూపర్ 8లోకి కూడా పోలేదు; అమెరికా లాంటి జట్టు చేతిలో ఓడిపోయింది. నోర్మూసుకోండి!

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ వ్యాఖ్యాత

జొరబడుతున్నారా?



అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఉమ్మడి పౌర స్మృతిని విమర్శించడం అంటే నేరుగా ఇండియా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడమే! ఉమ్మడి పౌర స్మృతి అనేది దేశ విధానానికి సంబంధించిన ఆదర్శ సూత్రం (ఆర్టికల్ 44). ఇప్పుడు రాజ్యాంగాన్ని తక్కువ చేస్తున్నారా? అంతేనా?

– మోనికా వర్మ, కాలమిస్ట్

దివ్య పరిష్కారం



ఒక మనిషి మానసిక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ముఖ్యమైనదనే విషయాన్ని నేను గాఢంగా నమ్ముతాను. ఒక సమస్య వచ్చినప్పుడు, మనం దానికి వేగంగా పరీక్షలు నిర్వహిస్తాం; కానీ అప్పటికే ప్రభావశీలమైన ఒక పరిష్కారం ఉందని మరిచిపోతాం. రోజువారీ వ్యాయామం. అది నిరూపితమైన దివ్యౌషధం.

– కరోల్ సైకోరా, ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ అధిపతి

ఇన్ బాక్స్

సభా సంప్రదాయాలు పాటించాలి!

18వ లోక్ సభ కొలువు తీరిన వెంటనే అధికార, ప్రతిపక్షాలు తమ తమ రంగులు బయట పెట్టాయి. మాటలు పార్లమెంటు గోడలు దాటినా... పనులు పాతవే అని నిరూపించాయి. ప్రొటెం స్పీకరు ఎంపిక మొదలుకొని తమ మధ్య ముందు ముందు విభేదాలు తప్ప ఏకాభిప్రాయం ఉండబోదని తెలియజెప్పాయి. సభలో అత్యంత సీనియర్‌ను ప్రొటెం స్పీకరుగా ఎంచుకొని గౌరవిస్తారు. అలా అయితే విపక్షానికి చెందిన సురేష్‌ని నియమించాలి. కానీ అధికార పక్షం తమ పార్టీకి చెందిన సభ్యుణ్ణి నియమించింది. అలా పరిమిత అధికారం, రెండు మూడు రోజుల తాత్కాలిక పదవీ కాలం ఉన్న గౌరవ స్థానం విషయంలోనే అధికార పక్షం సంకుచితంగా ఆలోచించింది. తర్వాత పాటించాల్సిన సంప్రదాయం పట్ల కూడా మౌనం దాల్చింది. అదేమిటంటే డిప్యూటీ స్పీకరు పదవి విపక్షాలకు ఇవ్వడం! అధికార పక్షం మౌనంలో నిరాకరణ అర్థమై, స్పీకరు పదవికి పోటీ నిలబెట్టింది విపక్షం. అది కూడా సంప్రదాయానికి విరుద్ధమే. ఎలాగూ గెలిచే బలం లేదు. పెద్ద మనసుతో స్పీకరు ఎన్నికను ఏకాభిప్రాయంతో జరగనిస్తే హుందాగా ఉండేది. అధికార పక్షపు వైఖరి కన్నా మెరుగైనదిగా భావించబడేది.

ఇక స్పీకరు, తన మొదటి తీర్మానంలోనే తన ఉద్దేశ్యం తెలియబర్చారు. 49 ఏళ్ళ క్రితం కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, దేశంలో పెట్టిన ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానం అది. ఎమర్జెన్సీని వ్యతిరేకించడం వందశాతం ఒప్పే కానీ ఇప్పుడా పని చెయ్యడం అంత ఎమర్జెన్సీయా? నిష్పక్షపాతంగా ఉండాల్సిన స్పీకరు కాంగ్రెస్ పార్టీని రక్షణలో పడేయడానికి అర్జెంటుగా పూనుకున్నట్లు ఉంది తప్పించి ఇదేమంత అత్యవసర కార్యక్రమం అనిపించలేదు.

అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటులో ఏకాభిప్రాయంతో మెలగనక్కర లేదు. అలా మెలగడం మంచిది కూడా కాదు. సంప్రదాయాలనూ, ఉన్న చట్టాలనూ, ఎదుటి పక్షాలనూ, వారి వాదనలోని ఔచిత్యాన్నీ గౌరవించాలి. అంతిమంగా ప్రజల పట్ల తమ బాధ్యతను గుర్తించాలి. ఈ సారి ప్రజా తీర్పు ఇరు పక్షాలకూ పాఠాలు నేర్పింది. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ఏకపక్ష ధోరణులు విడిచిపెట్టి ప్రజా పక్షం వహించాలని స్పష్టం చేసింది. ఆ స్ఫూర్తి ఇరు పక్షాలూ నిలపాలి. అర్థవంతమైన చర్చలకూ, ఆరోగ్యకరమైన సంప్రదాయాలకూ మరలా పట్టంగట్టాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు; మాజీ ఎంపీ, పార్వతీపురం

నిజంగానే ఆకాశానికి నిచ్చెన!

ఆకాశానికి నిచ్చెన వేయటం అనే మాటను మనం చాలా సార్లు యాథాలాపంగా వాడుతూంటాం. ఇప్పుడు జపాన్ దేశం అదే అంశంపై దృష్టి పెట్టింది. అంతరిక్షానికి ఎలివేటర్ నిర్మించే సన్నాహాల్లో ఉంది. అదీ అక్షరాలా వంద బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో. ఈ ఎలివేటర్ ఎలా నిర్మిస్తారు? అసలు అది ఆచరణ సాధ్యమేనా అన్న అనుమానం మీకక్కరలేదు. ఎయిరో స్పేస్ అన్వేషణలో జపాన్ అగ్రగామిగా ఉంది. అలాగే రోబొటిక్స్, బయోమెడికల్ రీసెర్చి, నేచురల్ సైన్స్ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఆ దేశానికి చెందిన ఒబాయషి కార్పొరేషన్ అనే నిర్మాణ సంస్థ ఎలివేటర్ నిర్మాణ బాధ్యతను స్వీకరించింది. దానివల్ల ఒనగూడే ప్రయోజనాలను ఆ సంస్థ ప్రకటించింది.



'భూవాతావరణం నుంచి రికార్డు వేగంతో మనుషులను అంతరిక్షంలోకి పంపవచ్చు. అంగారక గ్రహం మీదకు వెళ్లటానికి ఇప్పటి మాదిరిగా ఆరు నుంచి ఎనిమిది నెలల సమయం అక్కర లేదు. కేవలం 40 రోజుల్లోనే అక్కడకు చేరగలుగుతా'మని సంస్థ చెబుతోంది.

ఇంత పెద్ద భారీ నిర్మాణం చేపట్టటానికి తగినంత స్టీల్ అందుబాటులో లేదు. పైగా వాతావరణంలో ఒత్తిళ్లను తట్టుకోగలిగినంత దృఢత్వం ఉన్న మెటీరియల్ అవసరం అవుతుంది. అందుకే ఒబాయాషీ కార్పొరేషన్ 'కార్బన్ నానో ట్యూబ్' లను ఎంచుకుంది. అవి చుట్టచుట్టిన గ్రాఫైట్ లేయర్లు. స్టీలు కంటే గ్రాఫైట్ లేయర్లు తక్కువ బరువు ఉంటాయి. అవి విరిగిపోయే అవకాశాలు తక్కువ. కార్బన్ నానో ట్యూబ్‌ల వ్యాసం మీటరులో బిలియన్ వంతు ఉంటుంది. ఇంత వరకూ ఎవరూ కూడా రెండడుగుల కంటే పెద్ద నానో ట్యూబ్‌ను రూపొందించలేదు. ఇప్పుడు నానో ట్యూబ్‌ల ఆధారంగానే ఎలివేటర్ నిర్మాణానికి ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి.

ఎలివేటర్‌లో నానో ట్యూబ్ 60 వేల మైళ్ల పొడవున ఉంటుంది. వీల్ లిఫ్టుల ద్వారా అది మనుషులను, సామగ్రిని రవాణా చేయగలుగుతుంది. వాటిని 'క్లైంబర్స్'గా పిలుస్తారు. భూమి నుంచి 22 వేల మైళ్ల ఎత్తులో స్పేస్ షిప్‌కు కార్బో నానో ట్యూబ్‌ను అమరుస్తారు. థ్రస్టర్ దాని కొనకు జోడించబడుతుంది. అదే సమయంలో స్పేస్ షిప్ భూమికి దూరంగా జరుగుతుంది. సంస్థ వేస్తున్న అంచనాల ప్రకారం ఎనిమిది నెలల తర్వాత కార్బన్ నానోట్యూబ్ భూమి ఉపరితలానికి చేరుతుంది. అదే సమయంలో స్పేస్ షిప్ తన తుది గమ్యం 60 వేల మైళ్లకు చేరుకుంటుంది. అది ట్యూబ్‌కి కౌంటర్ వైట్‌గా ఉపయోగపడుతుంది. ఈ ట్యూబ్ ద్వారా పైకి వెళ్లి కేబుళ్లతో బలోపేతం చేస్తారు. ఇందుకోసం ముందుగా 'లో ఎర్త్ ఆర్బిట్' (ఎల్ఈఓ)లో స్పేస్ షిప్ నిర్మిస్తారు. ఇందుకోసం రాకెట్ల ద్వారా నిర్మాణ సామగ్రి పంపుతారు. అక్కడ నుంచి స్పేస్ షిప్ ఎలక్ట్రికల్ ప్రొపల్షన్లను ఉపయోగించుకుని కదులుతుంది. జియో స్టేషనరీ ఎర్త్ ఆర్బిట్ (జీఈఓ)కు చేరే వరకూ అది కొనసాగుతుంది.

భూమి మీద ఎర్త్ పోర్టును రెండు భాగాలుగా నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఒకటి ఈక్వేటర్ దగ్గర, మరొకటి సముద్రం దగ్గర. ఈ రెండూ సముద్రం దిగువన టన్నెల్‌తో అనుసంధానమయి ఉంటాయి. ఎర్త్ పోర్ట్ నుంచి పైకి పాకేవాళ్లు సుమారు గంటకు 93 మైళ్ల వేగంతో కార్బో నానో ట్యూబ్ అధిరోహిస్తారు. వాళ్లు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌ని రెండున్నర గంటల్లో చేరతారని సంస్థ ప్రకటించింది.

జపాన్ సంస్థ చెబుతున్న దాని ప్రకారం, ఇప్పుడు అంతరిక్షంలో ప్రయోగాలకు పెడుతున్న ఖర్చులతో పోలిస్తే, దీనివల్ల తక్కువ ఖర్చవుతుంది. అలాగే ఇందులో ఇంధన వినియోగం లేదు. ఇదంతా సౌరశక్తి ఆధారంగా సాగుతుంది. భారీగా సోలార్ ప్యానళ్లతో జియో స్టేషన్ నిర్మిస్తారు. మానవుల పరంగా కానీ, వాతావరణ పరంగా కానీ ఎలివేటర్లకు ఉండే ముప్పుల గురించి సంస్థ ఇంకా అధ్యయనం చేపట్టలేదు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది అంటే 2025లో ప్రారంభం కావాలి. ప్రస్తుతం ఆర్ అండ్ డీ పైనా, పార్ట్‌నర్‌షిప్ బిల్డింగ్, ప్రమోషన్లపైనా దృష్టి పెట్టారు. ఇందుకు మరికొంత జాప్యమయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఒక రోజున మానవాళి ఈ ఎలివేటర్ ద్వారా అంతరిక్షంలోకి అడుగు పెడుతుంది. అందుకు జపాన్‌ను మనం తప్పకుండా అభినందించి తీరాలి.


డా॥ పార్థసారథి చిరువోలు, వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

దొంగల దోపిడి

ఓ లక్ష్మీనృసింహ స్వామీ! నాకు చేయూతనివ్వవయ్యా! మమ దేహి కరావలంబమ్!

నాకు కనిపించడం మానేసింది. అంధత్వం ఏర్పడింది. ఎదురుగా మంచీ, చెడూ కనిపిస్తుంటే కూడా ఏది ఏదో పోల్చుకోలేకుండా ఉన్నాను. ఇది పాపం, ఇది పుణ్యం అని గుర్తించలేకపోతున్నాను. ఎటు పోతున్నానో, ఎటు పోవాలో, ఏమి కాబోతున్నదో ఏమీ పాలు పోవడం లేదు. ఇది నేత్రవ్యాధి కాదు. బుద్ధి వైకల్యం. నేను వివేకాన్ని కోల్పోయాను. నేనేం చేస్తున్నానో నాకే అర్థం కావడం లేదు!

మహాబలవంతులైన చోరులు నా మీద దాడి చేసి, అమూల్యమైన నా వివేక ధనాన్ని దొంగిలించుకెళ్లారు. ఆ దొంగలకు 'ఇంద్రియాలు' అని నామధేయం. నేను ఏమరుపాటుగా ఉండగా, వాళ్ళు నన్ను ఇట్టే లొంగదీసుకుని, భోగలాలసత అనే ఇనుప గొలుసులతో కట్టివేసి, నా వివేకాన్ని ఊచముట్టుగా దోచేశారు. దాంతో నేను అవివేకిగా, మూర్ఖుడిగా, పాప పుణ్యాల గ్రహింపు లేకుండా, నాకు ఏది మేలో నేను తెలుసుకోలేని స్థితిలో ఉన్నాను.



నాకు మిగిలిందల్లా ఇంద్రియ భోగాల మీద మితిలేని, మతిలేని వ్యామోహం. ఆ మోహాంధకారం నా జీవితాన్ని చీకటి కూపం చేసేసింది. అది ఏ గోతిలోకి లాక్కెళితే అందులో పడిపోతున్నానే తప్ప, నాకు క్షేమకరమైన మార్గాన్ని స్వయంగా ఎంచుకోగల శక్తిని, దొంగలు దోచారు. నా బుద్ధి పని చేయడం మానేసింది. విచక్షణా జ్ఞాననేత్రం మూసుకుపోయింది. నాకు చేయూత ఇచ్చి, ఈ అంధకారంలో నుంచి బయటపడే మార్గం చూపు స్వామీ!

అంధస్య, మే, హృత వివేక మహా ధనస్య/ చోరైః మహా బలిభిః ఇంద్రియ నామధేయైః/ మోహాంధకార కుహరే విని పాతితస్య/ లక్ష్మీనృసింహ, మమ దేహి కరావలంబమ్!

– ఎం. మారుతి శాస్త్రి

పేకాట మొదలు

మళ్లీ తెరుచుకుంటున్న పేకాట క్లబ్‌లు, శిబిరాలు


గుంటూరులోని ఓ క్లబ్‌లో ప్రారంభమైన పేకాట

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేకాట మళ్లీ మొదలైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూసేయించిన పేకాట క్లబ్‌లు టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ తెరుచుకుంటున్నాయి. అధికార కూటమి నేతలు క్లబ్‌లను ప్రారంభించేందుకు వారం రోజులుగా సన్నాహాలు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్లబ్‌లను ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే గుంటూరు నగరంలో నడిబొడ్డున ఉన్న ప్రముఖ క్లబ్‌లో బుధవారం నుంచి పేకాట ప్రారంభమైంది.

గత టీడీపీ ప్రభుత్వాల హయాంలో పేకాట క్లబ్బులది ప్రత్యేక చరిత్ర. రిక్రియేషన్ పేరుతో ఈ క్లబ్‌లలో పేకాటే కాదు.. బెట్టింగులు, అసాంఘిక కార్యకలాపాలూ కొనసాగేవి. ఊర్ల శివార్లు, తోటల్లో ప్రత్యేక శిబిరాలు కూడా నిర్వహించేవారు. అంతా ఆ పార్టీ నేతల నిర్వహణలో, వారి కనుసన్నల్లోనే జరుగుతుండేవి. వీటిని మూసివేయాలని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశాయి. అయినా అధికార పార్టీ ఎమ్మెల్యేల అండతో అవి నిరాఘాటంగా కొనసాగాయి. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా క్లబ్‌లను మూసివేయించింది. రిక్రియేషన్ పేరుతో క్లబ్‌లలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, బెట్టింగ్‌లను పూర్తిగా నిషేధించింది. వీటి మూసివేతకు ప్రత్యేక బృందాలను కూడా నియమించింది. గత ఐదేళ్లలో ఎక్కడా పేకాట క్లబ్‌లు నడవకుండా చర్యలు తీసుకుంది.

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే

రాష్ట్రంలో మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్లీ క్లబ్‌లు, శిబిరాలు తెరిచి పేకాట, బెట్టింగ్, ఇతర కార్యకలాపాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. క్లబ్‌ల నిర్వాహకులు ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించగా, తాము చూసుకుంటామని, క్లబ్‌లు ప్రారంభించుకోండని భరోసా ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఎలాంటి అనుమతులు లేకపోయినా 2019కి ముందు మాదిరిగానే మళ్లీ క్లబ్‌ల వ్యవహారాలు నడిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే గతంలో ఆడిన క్లబ్ సభ్యులకు మళ్ళీ పేకాట ప్రారంభిస్తున్నట్టు సమాచారం అందించారు.

రోజూ లక్షల్లో వ్యాపారం

క్లబ్‌లో ప్రతి ఆటకు ప్రతి టేబుల్ నుంచి సుమారు రూ.1000 చొప్పున కమీషన్ తీసుకుంటారు. అలా 20కి పైగా టేబుల్స్‌తో పేకాట, సైడ్ బిజినెస్‌లతో రోజూ లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ పేకాట కొనసాగుతూనే ఉంటుంది. ఈ క్లబ్‌ల బారిన పడి ఉన్నతస్థాయిలో ఉన్న వారు, మధ్యతరగతి వారు అనేక మంది ఆస్తులు పోగొట్టుకొని, అప్పుల పాలైపోయారు. వారిలో కొందరు దిక్కు తోచక ఆత్మహత్యలు కూడా చేసుకొన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బాగు పడిందల్లా క్లబ్‌ల నిర్వాహకులు, వాటి నుంచి నెలనెలా మామూళ్ల రూపంలో లక్షలాది రూపాయలు దండుకొనే కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులే. ఇప్పుడు మళ్లీ ప్రజల జేబులను పీల్చి పిప్పి చేసి, తమ జేబులు నింపుకొనేందుకు అధికార కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. ఇవి మళ్లీ ప్రారంభమైతే మధ్య తరగతి కుటుంబాల జీవితాలు చీకటిమయం కావడం ఖాయం. అధికార పార్టీ నాయకులకు భయపడి ఇలాంటి క్లబ్‌లను పోలీసులు చూసీ చూడకుండా వదిలేస్తారా లేక వాటిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

చిన్నారిపై లైంగిక దాడి దోషికి 20 ఏళ్ల జైలు

బాధితురాలికి నిందితుడు రూ.లక్ష, ప్రభుత్వం మరో రూ.3 లక్షలివ్వాలని ఆదేశం

విశాఖ లీగల్: ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనంది గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు ఐదు వేల రూపాయలు జరిమానా, బాధితురాలికి లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ఎస్పీపీ కరణం కృష్ణ వివరాల ప్రకారం నిందితుడు చేపర అప్పన్న (45) నగరంలోని ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మర్రిపాలెంలో ఉంటున్నాడు. రాష్ట్ర విద్యుత్ శాఖలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మర్రిపాలెంలోని పార్వతినగర్‌లో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను మచ్చిక చేసుకున్నాడు. 2021 జూలై 1వ తేదీన మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో బాలికను తన ఇంటికి తీసుకెళ్లి.. రెండు గంటలపాటు బాలికను చిత్రహింసలకు గురిచేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఆర్తనాదాలు వినిపించకుండా తలుపులు మూసేశాడు. తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పగా ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయికి 20 ఏళ్ల జైలు, లక్ష రూపాయలు జరిమానా విధించారు. అతడు చెల్లించిన లక్ష రూపాయలు, ప్రభుత్వం తరఫున మరో మూడు లక్షలు బాధితురాలికి చెల్లించాలని తీర్పులో స్పష్టం చేశారు. నిందితుడు జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

క్లుప్తంగా...

పాపికొండల విహార యాత్రకు బ్రేక్

- వర్షాల కారణంగా నాలుగు రోజులు నిలిపివేసిన అధికారులు



బుట్టాయగూడెం: దేశంలోని నదీ పర్యాటక యాత్రల్లో కీలకమైనదిగా భావించే పాపికొండల విహార యాత్రకు తాత్కాలిక బ్రేక్ పడింది. తుపాను హెచ్చరికలు, వర్షాల కారణంగా యాత్రికుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రను నాలుగు రోజులపాటు అధికారులు నిలిపివేసినట్లు ప్రకటించారు. పాపికొండలు తూర్పు కనుమల్లోని దట్టమైన అడవితో కూడిన ఒక పర్వతశ్రేణి. అందమైన ప్రకృతిలో కొండల మధ్య గోదావరిపై లాంచీ ప్రయాణం యాత్రికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ కొండలు, జలపాతాలు, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గ్రామీణ వాతావరణం ఉండటంతో దీనిని ఆంధ్ర కశ్మీర్‌గా పిలుస్తుంటారు. విస్తారంగా వర్షాలు కురవడంతోపాటు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో పాపికొండల పర్యటనకు వెళ్లే బోట్లను నిలిపివేస్తున్నట్లు టూరిజం అధికారులు తెలిపారు. నాలుగురోజుల విరామం తర్వాత వాతావరణం అనుకూలిస్తే మళ్లీ పర్యటన ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు.

మందుబాబును ఎత్తి విసిరేసిన ఏనుగు

- కుక్కే సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఘటన



యశవంతపుర: మద్యం తాగి గజరాజు పక్క నుంచి వెళుతోన్న వ్యక్తికి గుణపాఠం దక్కింది. తొండంతో ఎత్తి కొట్టడంతో మందుబాబుకు నిషా దిగిపోయింది. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లాలోని కుక్కే సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో జరిగింది. ఇటీవల దేవస్థానానికి చెందిన ఏనుగు యశస్వి వద్దకు ఇద్దరు పోలీసులు వెళ్లి మావటీతో చెప్పి ఫోటోలు తీసుకున్నారు. మరో వ్యక్తి మద్యం మత్తులో ఏనుగు పక్క నుంచి వెళ్తుండగా యశస్వినికి కోపం కట్టలు తెంచుకుంది. తొండంతో అతన్ని పట్టుకుని ఎత్తి విసిరేయడంతో చాలా దూరంలో ఎగిరి పడ్డాడు. అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఏనుగుకు మద్యం వాసన అంటే పడదు. మందు తాగి దాని దగ్గరలో ఉన్నా సులభంగా కనిపెడుతుంది. గతంలోనూ ఇలానే మద్యం తాగి వెళుతున్న వ్యక్తిని తొండంతో కొట్టింది. ఏనుగు దాడి వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి.

గోధుమ నిల్వలపై పరిమితులు

సాక్షి, అమరావతి: వ్యాపారులు, మిల్లర్లు పరిమితికి మించి గోధుమ నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ తమ నిల్వలను కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. టోకు వ్యాపారులు 3వేల టన్నులు, రిటైలర్స్ 10 టన్నులు, ప్రాసెసర్లు/మిల్లర్లు నెలవారీ కెపాసిటీలో 70శాతం, పెద్ద చైన్ రిటైలర్లు ఒక్కోచోట 10 టన్నులు/అన్ని డిపోల్లో కలిపి 3వేల టన్నుల లోపు ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని పేర్కొన్నారు.

జల్‌శక్తి అభియాన్‌లో డ్వాక్రా సంఘాల భాగస్వామ్యం

- కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆదేశం

సాక్షి, అమరావతి: జల్‌శక్తి అభియాన్ పథకం అమలులో డ్వాక్రా (స్వయం సహాయక బృందాల) సంఘాల భాగస్వామ్యాన్ని విస్తృత స్థాయిలో పెంచాలని, తద్వారా నిర్ణీత లక్ష్యాలను సకాలంలో సాధించాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆదేశించారు. గురువారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జల్‌శక్తి అభియాన్ పథకం అమలు తీరును సమీక్షించారు. భవిష్యత్‌లో దేశం ఎదుర్కోబోయే నీటి సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనే లక్ష్యంతో కలయిక విధానం (కన్వర్జెన్స్ మోడ్)లో భూగర్భ జలాలను మెరుగుపర్చే చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది జల్‌శక్తి అభియాన్ పథకాన్ని 'నారీశక్తి సే జల్ శక్తి' థీమ్‌తో అమలు చేస్తున్న దృష్ట్యా స్వయం సహాయక బృందాల మహిళలకు నీటి వనరుల సంరక్షణ, నిల్వ, వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వర్షపు నీటి నిల్వలను పెంపొందించుకోవడం, అందుబాటులో జల వనరులను సమర్థవంతంగా పరిరక్షించడం ద్వారా జల వనరులను పెంచుకోవాలన్నారు. నీటి వనరులన్నిటినీ గుర్తించి జియోట్యాగింగ్ చేసుకుని పరిరక్షించాలని, అటవీ ప్రాంతాలను నిర్మూలించే విధానాలను అరికట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ అనిల్‌కుమార్ సింఘాల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు, భూగర్భ వనరుల శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

ముగ్గురు మృతి... నలుగురికి గాయాలు

- పల్నాడు జిల్లాలో ఘటన
- వేర్వేరు ప్రమాదాల్లో మరో ముగ్గురు మృతి


ప్రమాదంలో నుజ్జు అయిన వాహనం

వినుకొండ (నూజెండ్ల): పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై కేవలం గంటల వ్యవధిలో జరిగిన ఈ ప్రమాదాలతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..

చెట్టును ఢీకొన్న వాహనం

రూరల్ పరిధిలోని కొత్తపాలెం సమీపంలో టయోటా వాహనం అదుపు తప్పిచెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన టీటీడీలో పనిచేసి పదవీ విరమణ చేసిన బ్రహ్మశ్రీ సోమాసి బాలగంగాధర్ శర్మ (69), ఆయన భార్య యశోద (67), డ్రైవర్ కట్టా నిర్మలరావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. అదే కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు హెచ్.వై.శర్మ, అతని భార్య సంధ్య తీవ్రంగా గాయపడగా, ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. వీరందరూ కర్ణాటకలోని బళ్లారి నుంచి శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకుని గుంటూరు వెళుతుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి వెళ్తూ..

బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నూజెండ్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీరావలి (25) స్వగ్రామం వెళుతుండగా మినీలారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మీరావలి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు.

తండ్రీ కొడుకులు మృతి

అదే రహదారిలో వినుకొండ రూరల్ మండలం వద్ద.. ప్రకాశం జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన మాలెపాటి పెదరామ కోటేశ్వరరావు(45) తన కుమారుడు అంజిబాబుతో (25) కలిసి వినుకొండ రూరల్ మండలం కొతపాలెం వస్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావు మృతి చెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. అంజిబాబును మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ గుంటూరులో మృతిచెందాడు.

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనంపై రెండు నెలల్లో నిర్ణయం

డైరెక్టర్ విశ్వనాథరాజు


విశ్వనాథరాజుకు బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: సెయిల్‌లో విశాఖ, నగర్నార్ స్టీల్‌ప్లాంట్‌ల విలీనంపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారని సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీ విశ్వనాథరాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు గురువారం నగరంలో కాశీవిశ్వనాథరాజును కలిసి విలీనం జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంలో ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల రోజుకు సుమారు రూ.15 కోట్లు నష్టం వస్తోందని తెలిపారు. ఆర్థికంగా, ముడి సరుకుల కొరతతో సమస్యలు ఎదుర్కొంటున్న స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అర్థం చేసుకోవాలని వారు కోరారు. దీనిపై కాశీవిశ్వనాథ రాజు మాట్లాడుతూ ఇప్పటికే ఏపీ బీజేపీ ఎంపీలు బుధవారం కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి విశాఖ, నగర్నార్ స్టీల్‌ప్లాంట్లను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారని, రెండు నెలల్లోగా విలీనంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, చీకటి శ్రీనివాసరావు, డొక్క నర్సింగరావు, బి. కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా మావోయిస్టుల లొంగుబాటు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎటపాక/పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు మహిళా మావోయిస్టు సభ్యులు గురువారం రంపచోడవరం ఓఎస్డీ కె.వి. మహేశ్వరరెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా మహేశ్వర రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, కుంట ఏరియా కమిటీ సభ్యురాలు సోడె సుక్కి, పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యురాలు మడివి గంగి లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. వీరికి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు సంఘటనలతో సంబంధం ఉందన్నారు. లొంగిపోయిన సోడె సుక్కిపై రూ.4లక్షలు, మడివి గంగిపై రూ.లక్ష రివార్డు ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు.

నలుగురు మిలీషియా సభ్యుల లొంగుబాటు

మావోయిస్టు పార్టీ గాలికొండ దళానికి చెందిన నలుగురు మిలీషియా సభ్యులు తమ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొయ్యూరు మండలం, బూదరాళ్ల పంచాయతీ, నల్లబిల్లి గ్రామానికి చెందిన తాంబేలు సాయిరాం అలియస్ డొంబు మిలీషియా కమాండర్‌గా పని చేశారన్నారు. ఇతడు ఏడు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడన్నారు. అలాగే అన్నవరం గ్రామానికి చెందిన వంతాల కిరణ్ అలియాస్ ప్రోమణి మిలీషియా సభ్యుడిగా పని చేశాడని, ఇతనిపై 16 కేసులు ఉన్నాయని, అదే గ్రామానికి చెందిన తాంబేలు రమేశ్ కూడా మిలీషియా సభ్యుడిగా పనిచేశాడని, అతడిపై కూడా 12 కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. ఇక జీకే వీధి మండలం, దేవరాపల్లి పంచాయతీ పెదపాడు గ్రామానికి చెందినకుర్రా బాబురావు అలియాస్ సీరు మిలీషియా సభ్యుడిగా పనిచేస్తున్నాడని, అతడు ఐదు ప్రధాన సంఘటనల్లో నేరుగా పాల్గొన్నాడని చెప్పారు. లొంగిపోయిన మిలీషియా సభ్యులపై ఎటువంటి కేసులు లేకుండా చూస్తున్నామని ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేసి అభినందనలు తెలిపారు.

జిందాల్ సిమెంట్స్ అధికారిపై టీడీపీ నేతల దౌర్జన్యం

నంద్యాల: టీడీపీ నేతలు ప్రైవేట్ పరిశ్రమలపైనా దౌర్జన్యానికి తెగబడుతున్నారు. నంద్యాల జిల్లా గడివేముల మండలం బిలకలగూడూరులోని జిందాల్ సిమెంట్స్ పరిశ్రమ అధికారిపై బూజునూరుకు చెందిన టీడీపీ నాయకులు గురువారం దాడికి దిగిన ఘటన కలకలం రేపింది. సంబంధిత పరిశ్రమకు సంబంధించిన కాంట్రాక్టులను తమకే ఇవ్వాలంటూ బూజునూరుకు చెందిన పంటా రామచంద్రారెడ్డి, దిలీప్‌రెడ్డి, పంట వంశీధర్‌రెడ్డి, పంట మద్దిలేటిరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు జిందాల్ అకౌంట్స్ విభాగం మేనేజర్‌పై దౌర్జన్యం చేసి తమ ప్రతాపం చూపించారు. జిందాల్ కర్మాగారం ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోంది. రాజకీయాలకు అతీతంగా పరిసర గ్రామాల్లో సామాజిక బాధ్యత కింద ఎన్నో సేవా కార్యక్రమాలు సైతం చేపడుతోంది. గత ప్రభుత్వంలో పరిశ్రమపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వ్యవహరించారు. భూ సమస్యలతో పాటు పరిశ్రమకు సంబంధించిన అన్ని విషయాలలో తోడ్పాటు అందిస్తూ చేయూతనిచ్చారు. కూటమి అధికారం చేపట్టిన అనంతరం టీడీపీ నేతలు జిందాల్ పరిశ్రమ యాజమాన్యాన్ని బెదిరించి తమకే కాంట్రాక్టులు, ఇతర లాభదాయకమైన పనులు కావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఘటనపై పంటా రామచంద్రారెడ్డితో పాటు దిలీప్‌రెడ్డి, పంట వంశీధర్‌రెడ్డి, పంట మద్దిలేటిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మరో ఇద్దరిపై జిందాల్ ప్రతినిధులు గడివేముల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని వివరణ కోరగా.. జిందాల్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటనను సంబంధిత సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యపై విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ విషయంలో బీజేపీ డ్రామా

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): స్టీల్‌ప్లాంట్ విషయంలో ఢిల్లీలో బీజేపీ ఎంపీలు ఆడిన డ్రామా ప్రజలందరూ గమనిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ తెలిపారు. గురువారం రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలంటూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రికి వినతిపత్రం అందజేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధానికి బదులుగా, ఉక్కు మంత్రిని కలవడం ఏంటని ప్రశ్నించారు. గతంలో గంగవరం పోర్టు కూడా అదానీకి కారుచౌకగా కట్టబెట్టారని, అదానీ, అంబానీ, జిందాల్, మిట్టల్‌లకు బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. 8 లక్షల కోట్లు విలువ గల స్టీల్ ప్లాంట్‌ను కూడా చౌకగా విక్రయించాలని చూడడం అన్యాయమన్నారు. ప్రధాని మోదీ కోర్టు ఆదేశాలను పాటించాలని, 2024 ఏప్రిల్ 25వ తేదీన స్టీల్‌ప్లాంట్ ఆస్తులు అమ్మకూడదంటూ హైకోర్టు స్టే ఇచ్చిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎంపీ భరత్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కాపాడడం కోసం వందరోజుల కార్యాచరణ ప్రణాళిక తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠ్యాంశంగా నటి తమన్నా జీవితం

బెంగళూరు స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



సాక్షి బెంగళూరు: సినీ నటి తమన్నా జీవితాన్ని పాఠ్యాంశంగా చేయడంపై బెంగళూరులో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. హెబ్బాళలోని సింధీ ఉన్నత పాఠశాలపై బాలల హక్కుల రక్షణ సంఘానికి వారు ఫిర్యాదు చేశారు. పాఠశాలలోని ఏడో తరగతి విద్యార్థుల పాఠ్యాంశాల్లో ఏడో చాప్టర్‌లో సింధీ వ్యక్తుల గురించి అంశాన్ని పొందుపరిచారు. ఇందులో నటి తమన్నా భాటియా, నటుడు రణ్‌వీర్ సింగ్ గురించి పాఠ్యాంశంగా చేర్చారు. పలు చిత్రాల్లో అర్ధ నగ్నంగా నటించే తమన్నా జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చడమేంటని తల్లిదండ్రులు మండిపడ్డారు. సింధీ సామాజికవర్గంలో ఎంతో మంది కళాకారులున్నారని, వారి గురించి పాఠ్యాంశంగా ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. దీన్ని వ్యతిరేకించినందుకు తమ పిల్లలకు టీసీ ఇస్తామని పాఠశాల యాజమాన్యం బెదిరిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం బుజ్జగిస్తోంది. అదొక పాఠ్యేతర అంశంగా చేర్చినట్లు, అందులో తమన్నా పాఠాలను ఇచ్చినట్లు తెలిపింది. స్వాతంత్ర్యం అనంతరం సింధూ ప్రాంత విభజన అనంతరం ఆ సామాజిక వర్గ ప్రజల జీవితాలు ఎలా ఉన్నాయనే విషయం విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠ్యాంశంగా ముద్రించినట్లు తెలిపింది. సింధీ సామాజికవర్గానికి చెందిన తమన్నా సినీ రంగంలో ఎన్నో విజయాలు సాధించడంతో ఆమె జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చినట్లు తెలిపింది.

ఏ అర్హతతో రామోజీ సంస్మరణ సభ జరిపారు?

చంద్రబాబుకు హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి ప్రశ్న

సాక్షి,అమరావతి: ఏ అర్హత ఉందని ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు సంస్మరణ సభను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి జరిపిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు, హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు చనిపోయినప్పుడు కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సంస్మరణ కార్యక్రమం నిర్వహించలేదని, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ చనిపోయినప్పుడు కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నా.. సంస్మరణ సభ నిర్వహించలేదని గుర్తు చేశారు. రామారావును ముఖ్యమంత్రి పదవి నుంచి దింపి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు రామోజీరావు ప్రముఖ పాత్ర వహించినందుకేనా అని ప్రశ్నించారు. 2024లో వైఎస్ జగన్‌పై ఈనాడు పేపర్‌లో అనేక అబద్ధాలు వండి వార్చి ప్రజలను ఏమార్చిన రామోజీరావు రుణం తీర్చుకునేందుకే చంద్రబాబు ప్రభుత్వం సొమ్మును విచ్చల విడిగా ఖర్చు పెట్టారని విమర్శించారు.

ఎట్టకేలకు చిక్కిన చిరుత!



గిద్దలూరు రూరల్: దాదాపు 30 గంటల పాటు అటవీశాఖ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిన చిరుత పట్టుబడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలోని దేవనగరం గ్రామ శివారులో బుధవారం సాయంత్రం ఓ చిరుత పులి స్థానికుల కంటబడింది. వారు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ఓ పాడుబడిన బావిలోకి దిగి దాక్కుంది. సమాచారం తెలుసుకున్న నంద్యాల ఫారెస్ట్ డైరెక్టర్ బీఎస్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ వై.వి.నరసింహారావు, రేంజి ఆఫీసర్లు కలిసి సిబ్బందితో గురువారం సాయంత్రం పాడుబడిన బావిలో నక్కి ఉన్న చిరుతపులిని బయటకు రప్పించేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ముందుగా పాడుబడిన బావిచుట్టూ వల ఏర్పాటు చేసి బావికి ఒక వైపుగా బోను ఉంచి చిరుత బయటకు వచ్చే ఏర్పాట్లు చేశారు. బావిలోకి నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని పంపుతూ చిరుతను బయటకు వచ్చేలా ప్రయత్నించారు. అయినా ఎంతసేపటికీ చిరుతపులి బయటకు రాకపోవడంతో బోనులో మేకను ఎరగా చూపి బోనులోకి వచ్చేలా చేసి బంధించారు. 60 మంది అటవీ సిబ్బంది బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు దాదాపు 30 గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు చిరుతపులిని బోనులో బంధించి ప్రత్యేక వాహనంలో అడవిలోకి తరలించారు.

చిరుధాన్యాలపై విస్తృత పరిశోధనలు

- డిమాండ్‌కు తగిన ఉత్పత్తిని పెంచేలా రైతులను ప్రోత్సహిస్తాం
- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్ శర్మ


మాట్లాడుతున్న ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీఆర్ శర్మ

తిరుపతి సిటీ: రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా విస్తృత పరిశోధనలు చేస్తున్నామని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీఆర్ శర్మ తెలిపారు. తిరుపతి వెటర్నరీ కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించనున్న అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టీఆర్ శర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అధిక దిగుబడినిచ్చే చిరుధాన్యాల వంగడాలపై పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌కు తగినట్లుగా ఉత్పత్తిని పెంచేందుకు సాంకేతికతను జోడించి నూతన వంగడాలను సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత ఆశించిన స్థాయిలోనే ఉందని తెలిపారు. రాష్ట్రంలో నంద్యాల, తిరుపతిలోని పెరుమాళ్లపల్లి, అనంతపురం, విజయనగరంలలోని నాలుగు పరిశోధనా స్థానాల్లో చిరుధాన్యాలపై పెద్ద ఎత్తున పరిశోధనలు కొనసాగుతున్నాయని చెప్పారు. వరి, గోధుమ వంటి పంటలతో పోలిస్తే చిరుధాన్యాల సాగుకు నీటి అవసరం తక్కువని పేర్కొన్నారు. కేజీ వరి, గోధుమ ధాన్యాలు పండించాలంటే 4వేల నుంచి 6వేల లీటర్ల నీరు అవసరమని, అదే చిరుధాన్యాలకు వెయ్యి లీటర్ల నీరు సరిపోతుందని వివరించారు. ఎన్జీ రంగా యూనివర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ తమ యూనివర్సిటీ విడుదల చేసిన చిరుధాన్యాల రకాలు విస్తృతంగా ప్రాచుర్యం పొందాయని తెలిపారు. వచ్చే ఏడాదికి సంబంధించి చిరుధాన్యాల సాగు, దిగుబడి పెంచడం, నూతన వంగడాలు, సాంకేతికత వంటి విషయాలపై ఈ సదస్సులో పూర్తిస్థాయిలో చర్చిస్తామని చెప్పారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్‌కే ప్రధాన్, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారాసత్యవతి, డాక్టర్ పీవీ సత్యనారాయణ, ప్రధాన శాస్త్రవేత్త మధుసూదన్, ఏడీఆర్ వి.సుమతి పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో పురాతన ఆస్ట్రిచ్ గుడ్ల ఆనవాళ్లు

41వేల ఏళ్ల క్రితానికి చెందినవిగా గుర్తించాం: ఆర్కియాలజీ డీడీ


ఆస్ట్రిచ్ గుడ్లపై పెంకుల ఆనవాళ్లు దొరకిన ప్రాంతం

పామూరు: ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని మన్నేరు పరిసర ప్రాంతాల్లో 41వేల ఏళ్ల క్రితం నాటి ఆస్ట్రిచ్ పక్షిగుడ్ల అవశేషాలను పరిశోధకులు గుర్తించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించేందుకు విజయవాడకు చెందిన ఏపీ పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, ఏడీ ఎస్.వెంకట్రావు, నెల్లూరు ఏడీ గంగాధరరావు గురువారం పామూరు మండలంలోని మోట్రావులపాడు వద్ద మన్నేరు, నాసవాగు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీ సురేష్ మాట్లాడుతూ మన్నేరు, నాసవాగు ప్రాంతాల్లో ఎక్కువగా ప్రాచీన ఆదిమానవునికి సంబంధించిన ఆనవాళ్లు లభిస్తున్నాయని తెలిపారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలోని మహారాజ సాయాజీరావ్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవర అనిల్‌కుమార్ బృందం ఏపీ పురావస్తు శాఖ అనుమతితో గత నెల నుంచి పలుమార్లు మన్నేరు, నాసవాగు ప్రాంతాల్లో తవ్వకాలు జరిపిందని చెప్పారు. ఈ తవ్వకాల్లో భాగంగా రెండు ప్రాంతాల్లో ఆస్ట్రేలియాలో అధికంగా నివసించే ఆస్ట్రిచ్‌పక్షి (నిప్పుకోడి)కి చెందిన రెండు గూళ్లను గుర్తించినట్లు చెప్పారు. ఒక్కో గూటిలో 9 నుంచి 11వరకు గుడ్లు పెట్టినట్లు నిర్ధారించారని, వాటికి సంబంధించి శిలాజాలుగా మారిన గుడ్లపైన పెంకుల(షెల్) ఆనవాళ్లు సుమారు 3,500 వరకు గుర్తించారని వివరించారు. వీటి కాలాన్ని నిర్ధారించేందుకు కార్బన్ డేటింగ్ (సీ14) పద్ధతిలో పరిశోధన చేయగా, 41వేల ఏళ్లకు ముందువని తేలిందని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో ఆదిమానవుడి కాలం మొసలి, ఆవు, ఉడుము, ఆక్టోపస్, నాటి ఆదిమానవుల ఆయుధాలు, ఇతర పనుల కోసం ఉపయోగించిన రాతి వస్తువుల నమూనాలు లభ్యమయ్యాయని చెప్పారు. వాటిని పరీక్షల నిమిత్తం వివిధ ల్యాబ్‌లకు పంపామని, కొన్ని నివేదికలు వచ్చాయని, మరికొన్ని రావాల్సి ఉందన్నారు. దీనిపై పూర్తి నివేదికలు వచ్చిన తర్వాత సమగ్ర నివేదికను ఏపీ పురావస్తు శాఖ కమిషనర్‌కు అందజేస్తామని సురేష్ పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పులివెందులలో టీడీపీ శ్రేణుల దౌర్జన్యం

పులివెందుల: వైఎస్సార్ జిల్లా పులివెందులలో టీడీపీ శ్రేణుల దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో పీర్ల చావడి వద్ద సంపత్ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త 35 ఏళ్లుగా కోడిగుడ్ల దుకాణం నడుపుకుంటున్నాడు. గురువారం టీడీపీ శ్రేణులు సంపత్ షాపు పెట్టే ప్రాంతంలో పచ్చరంగు చల్లి.. రేపటి నుంచి ఇక్కడ దుకాణం పెట్టవద్దని హెచ్చరించారు.మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు, కార్యకర్తలు అక్కడకు చేరుకుని సంపత్‌కు అండగా నిలిచారు.

బతుకు చితికి.. గూడు చెదిరి... వలస బాట

ప్రపంచవ్యాప్తంగా 12 కోట్ల మంది శరణార్థులు

40 శాతం పొట్ట చేత పట్టుకుని విదేశాలకు	ఉక్రెయిన్, గాజా యుద్ధాలతో పెరిగిన శరణార్థుల సంఖ్య	యుద్ధం, హింసతో చితుకుతున్న బతుకులు

పుట్టిన నేల.. పెరిగిన ఊరు.. ఇవే మనిషి అస్తిత్వం. కానీ యుద్ధం, హింస ప్రజలను నిరాశ్రయులను చేస్తోంది. అధికార దాహం, అహంకార ధోరణి కోట్ల మందిని సొంత నేలకే పరాయివాళ్లుగా మారుస్తోంది. గత పదేళ్లలో ప్రపంచ జనాభాలో ప్రతి 69 మందిలో ఒకరు చొప్పున ఏకంగా 12 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలామంది తలదాచుకునేందుకు కూడా దిక్కులేక శరణార్థులుగా మారాల్సి వస్తోంది. ప్రాణాలను చేతబట్టుకుని విదేశాల బాట పట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది...! – సాక్షి, నేషనల్ డెస్క్



తుర్కియే వైపుగా భారీగా వలస వెళ్తున్న సిరియా ప్రజలు (ఫైల్)

సంఘర్షణ, హింస, మానవ హక్కుల ఉల్లంఘనల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మందికి పైగా నిరాశ్రయులైనట్టు ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషన్ (యూఎన్‌హెచ్‌సీఆర్) వెల్లడించింది. వీరిలో 6.83 కోట్ల మంది సంఘర్షణలు, ఇతర సంక్షోభాల కారణంగా సొంత దేశాల్లోనే ఇతర ప్రాంతాలకు చెదిరిపోయారు. దాదాపు 4.5 కోట్ల మంది పొట్ట చేత పట్టుకుని శరణార్థులుగా విదేశాలకు వలస వెళ్లారు. 2024 తొలి నాలుగు నెలల్లో ఇది మరింత పెరిగింది.

పదేళ్లకోసారి రెట్టింపు..

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1951లో ఐరోపాలోని శరణార్థుల హక్కులను పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి శరణార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. 1967లో శరణార్థుల కన్వెన్షన్ ఆవిర్భవించినప్పుడు 20 లక్షల మంది శరణార్థులున్నారు.

- 1980 నాటికి కోటికి చేరిన శరణార్థులు
- 1990 నాటికి రెండు కోట్లకు చేరిన సంఖ్య
- 2021 చివరి నాటికి 3 కోట్లను మించిన శరణార్థులు
- తాజాగా 11 కోట్లు దాటేసిన వైనం

2020 నుంచి వేగంగా...

- 2022లో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక 2023 చివరి నాటికి 60 లక్షల మంది ఉక్రేనియన్లు నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలామంది దేశం విడిచి వెళ్లారు.
- 2023లో సుడాన్‌లో సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య ఘర్షణలు శరణార్థుల సంఖ్యను 10.5 లక్షలు పెంచాయి.
- ఇక ఇజ్రాయెల్ దాడులతో గాజాలో గతేడాది చివరి మూడు నెలల్లో 10.7 లక్షల మంది నిరాశ్రయులై వలస వెళ్లారు.

ఎక్కడి నుంచి వస్తున్నారు?

ప్రపంచవ్యాప్తంగా నమోదైన దాదాపు 4.5 కోట్ల మంది శరణార్థులలో దాదాపు మూడొంతులు (72 శాతం) ఐదు దేశాల నుంచే వచ్చారు.

అఫ్గానిస్తాన్	64 లక్షలు
సిరియా	64 లక్షలు
వెనెజులా	61 లక్షలు
ఉక్రెయిన్	60 లక్షలు
పాలస్తీనా	60 లక్షలు

ఆశ్రయమిస్తున్న దేశాలు?

- ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మంది శరణార్థులు తమ సమీప పొరుగు దేశాల్లోనే బతుకీడుస్తున్నారు.
- ఇరాన్, పాకిస్తాన్లోని శరణార్థులందరూ అఫ్గాన్లే.
- టర్కీలో ఎక్కువ మంది శరణార్థులు సిరియన్లు.

దేశం	శరణార్థులు
ఇరాన్	38 లక్షలు
తుర్కియే	33 లక్షలు
కొలంబియా	29 లక్షలు
జర్మనీ	26 లక్షలు
పాకిస్తాన్	20 లక్షలు

ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం

రాజ్యాంగంపైనే దాడి: రాష్ట్రపతి

ఎమర్జెన్సీ. నిన్నటికి నిన్న లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికవుతూనే ఓం బిర్లా నోట సభలో విన్పించిన మాట. గురువారం పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంలోనూ ప్రముఖంగా చోటుచేసుకుంది! ఇందిరాగాంధీ హయాంలో 1975లో విధించిన ఎమర్జెన్సీని దేశ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయంగా, రాజ్యాంగంపై దాడిగా రాష్ట్రపతి అభివర్ణించారు. "స్వతంత్ర భారత చరిత్రలో రాజ్యాంగంపై ఇలాంటి దాడులు జరుగుతూ వచ్చాయి. 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీపై దేశమంతా భగ్గుమంది. అంతిమంగా రాజ్యాంగ వ్యతిరేక శక్తులపై దేశం విజయం సాధించి ప్రగతి పథాన సాగుతోంది" అన్నారు. "మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కేవలం పాలనా మాధ్యమంగా మాత్రమే చూడటం లేదు. దాన్ని ప్రజల చేతనలో అవిభాజ్య భాగంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది. నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవడం వంటి చర్యలు అందులో భాగమే" అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఎమర్జెన్సీ అంశాన్ని చొప్పించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచీ ఎమర్జెన్సీపై తరచూ విమర్శలు చేస్తూ వస్తోంది. ప్రధాని మోదీ జూన్ 24న మాట్లాడుతూ ఎమర్జెన్సీని దేశ పార్లమెంటరీ చరిత్రలో చెరగని మచ్చగా అభివర్ణించారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ కూడా బుధవారం గాజియాబాద్‌లో ఒక కార్యక్రమంలో ఎమర్జెన్సీపై విమర్శలు గుప్పించారు. ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నికవుతూనే ఎమర్జెన్సీని నిరసిస్తూ లోక్‌సభలో ఏకంగా తీర్మానమే చేసి రాజకీయ దుమారానికి తెర తీశారు.



గురువారం పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము. వేదికపై రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించేందుకు ముర్ము గుర్రపు బగ్గీలో సంప్రదాయ రీతిలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకున్నారు. గజ ద్వారం వద్ద ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, బిర్లా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముర్ము తన ప్రసంగంలో మోదీ 3.0 ప్రభుత్వ ప్రాథమ్యాలను ఒక్కొక్కటిగా వివరించారు. ''ప్రపంచంలోనే అతి పెద్ద సార్వత్రిక ఎన్నికల విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఇవ్వడం ద్వారా దేశ ప్రజలు వరుసగా మూడోసారి సుస్థిరతకే పట్టం కట్టారు'' అన్నారు. ''లోక్‌సభ సభ్యులుగా మీరంతా ప్రజల నమ్మకం చూరగొని నెగ్గారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా'' అన్నారు. భారత్ తీసుకోబోయే ప్రతి నిర్ణయాన్ని ప్రపంచమంతా వేయి కళ్లతో గమనిస్తోందన్న విషయాన్ని సభ్యులు గుర్తెరగాలన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. దీనిపై పార్టీలకు అతీతంగా దేశవ్యాప్తంగా గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ''ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత చాలా ముఖ్యం. ఈ దిశగా పరీక్షల విధానంలోనే సమూల సంస్కరణలకు కేంద్రం సిద్ధమవుతోంది'' అని చెప్పారు. ఐఐటీ, ఐఐఎంలను బలోపేతం చేసి వాటిల్లో సీట్లను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులంతా 'నీట్, నీట్' అంటూ జోరుగా నినాదాలు చేశారు. పలు ఇతర అంశాలపై రాష్ట్రపతి వ్యాఖ్యలు ఆమె మాటల్లోనే...

పరీక్షల విధానంలో సంస్కరణలు

- దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బ తీసేందుకు జరుగుతున్న ప్రతి ప్రయత్నాన్నీ ఐక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఈవీఎంలు సుప్రీంకోర్టు నుంచి ప్రజా కోర్టు దాకా అన్ని పరీక్షల్లోనూ నెగ్గి విశ్వసనీయతను నిరూపించుకున్నాయి.
- కొన్నాళ్లుగా భారత్ అనుసరిస్తున్న సమర్థమైన విదేశీ విధానం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతి అంతర్జాతీయ సమస్యపైనా తక్షణం స్పందిస్తూ క్రమంగా విశ్వబంధుగా పరిణతి చెందుతోంది. భారత్–మధ్య ప్రాచ్యం–యూరప్ ఆర్థిక కారిడార్ 21వ శతాబ్దంలో అతి పెద్ద గేమ్ చేంజర్‌గా మారనుంది.
- ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం వేరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆటంకపరచడం వేరు. ఇది పూర్తిగా తప్పుడు చర్య. పార్లమెంటు సజావుగా సాగినప్పుడే ప్రజా సమస్యలపై ఆరోగ్యకరమైన చర్చలు సాధ్యమని అన్ని పార్టీలూ గుర్తుంచుకోవాలి.
- కశ్మీర్ లోయలో ఈసారి రికార్డు స్థాయి పోలింగ్ జరిగింది. తద్వారా శత్రు దేశాలకు కశ్మీరీ ప్రజలు దిమ్మతిరిగే జవాబిచ్చారు. ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత కశ్మీర్లో పరిస్థితులు ఎంతగానో మెరుగుపడుతున్నాయి.
- మౌలికాభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోంది. దేశ ఉత్తర, దక్షిణ, తూర్పు దిశల్లో బులెట్ ట్రైన్ కారిడార్ల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తోంది.
- తప్పుడు సమాచార వ్యాప్తి ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య. దేశ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు విభజన శక్తులు దీన్ని ఆయుధంగా వాడుతున్నాయి. ఈ బెడద నివారణకు కొత్త మార్గాలు వెదకాల్సిన అవసరం చాలా ఉంది.
- దేశ విభజనతో సర్వం కోల్పోయిన వారు గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు పౌరసత్వ సవరణ చట్టం దోహదపడుతుంది.
- శిక్షించడమే ప్రధానోద్దేశంగా రూపొందిన బ్రిటిష్ వలస పాలన నాటి శిక్షా స్మృతులు స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఏడు దశాబ్దాల పాటు కొనసాగడం దారుణం. న్యాయం శిక్షగా మారకూడదన్నదే లక్ష్యంగా, భారతీయతే మూలమంత్రంగా నూతన నేర న్యాయ చట్టాల రూపకల్పన జరిగింది. జూలై 1 నుంచి అవి ప్రజలకు సరైన న్యాయాన్ని సత్వరంగా అందించనున్నాయి.
- అభివృద్ధితో పాటు దేశ ఘన వారసత్వానికీ మోదీ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇవ్వనుంది. మహిళల సారథ్యంలో అభివృద్ధికి కట్టుబడి ఉంది. చట్టసభల్లో వారికి 33 శాతం రిజర్వేషన్ల వంటి నిర్ణయాలు ఈ దిశగా ముందడుగులు.
- రక్షణ రంగంలో భారీ సంస్కరణలు మరింత వేగంతో కొనసాగుతాయి. పదేళ్లలో రక్షణ ఎగుమతులు 18 రెట్లు పెరిగాయి. అదే సమయంలో గతేడాది మన రక్షణ కొనుగోళ్లలో 70 శాతం స్వదేశీ సంస్థల నుంచే జరిగింది! ఈ రంగంలో మేకిన్ ఇండియాకు ప్రాధాన్యం పెరగనుంది.
- సుపరిపాలనకు ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. పలు ప్రభుత్వోద్యోగాల నియామక ప్రక్రియలో ఇంటర్వ్యూల రద్దు, స్వీయ ధ్రువీకరణ వంటి నిర్ణయాలు ఇందుకు ఉదాహరణలు.
- సంస్కరణల పథాన్ని వేగవంతం చేసే దిశగా వచ్చే బడ్జెట్‌లో చరిత్రాత్మక చర్యలుంటాయి.

ప్రభుత్వ స్క్రిప్టు.. తప్పుల తడక

రాష్ట్రపతి ప్రసంగంపై విపక్షాల ఫైర్ ● నిరాకరణ ధోరణిలో మోదీ: ఖర్గే

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం పూర్తిగా అబద్ధాలమయమని విపక్షాలు విమర్శించాయి. ''అది పూర్తిగా ప్రభుత్వ స్క్రిప్టు. తప్పుల తడక. చివరికి ఇందులో కూడా ఎమర్జెన్సీ ప్రస్తావన తేవడం సిగ్గుచేటు! నిజానికి మోదీ హయాంలో పదేళ్లుగా దేశమంతటా అప్రకటిత ఎమర్జెన్సీ సాగుతోంది'' అంటూ దుయ్యబట్టాయి. ప్రసంగం పాత చింతకాయ పచ్చడంటూ కాంగ్రెస్ పెదవి విరిచింది. ''బీజేపీకి మెజారిటీ ఇవ్వకపోవడం ద్వారా మోదీని ప్రజలు తిరస్కరించారు. కానీ ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు ఆయన సిద్ధంగా లేరు. నిరంతర నిరాకరణ ధోరణిలో ఉన్నారు. అందుకే అంతా బాగుందని దేశాన్ని నమ్మించేందుకు ఏకంగా రాష్ట్రపతితోనే పచ్చి అబద్ధాలు చెప్పించారు'' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ధరల పెరుగుదల, మణిపూర్ హింస, పెరుగుతున్న రైలు ప్రమాదాలు, దళితులపై దాడులు, ఉగ్రవాద దాడుల వంటి అతి ప్రధాన సమస్యల ప్రస్తావన కూడా ఆమె ప్రసంగంలో లేదంటూ ఆక్షేపించారు. విపక్ష నేతలు అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ''అభివృద్ధి గురించి ప్రసంగంలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే. 303 నుంచి 240 సీట్లకు దిగజారి మెజారిటీ కోల్పోయామన్న వాస్తవాన్ని మోదీ సర్కారు మర్చిపోయింది'' అంటూ ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆప్ బాయ్‌కాట్ చేసింది.

ఎమర్జెన్సీ ప్రస్తావన ఎందుకు?

న్యూఢిల్లీ: పార్లమెంట్ తొలి సెషన్ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'ని ప్రస్తావిస్తూ తీర్మానం చేయడాన్ని విపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు తీవ్రంగా తప్పుబట్టారు. బిర్లాను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాజకీయ అంశమైన 'ఎమర్జెన్సీ'ని ప్రస్తావించకుండా ఉండాల్సింది అన్నారు. ''రాహుల్, ఇండియా కూటమి నేతలు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేతలంతా పార్లమెంటరీ వ్యవహారాలు మాట్లాడుకున్నారు. అందులో భాగంగానే ఎమర్జెన్సీ అంశమూ ప్రస్తావనకు వచ్చింది. రాహుల్ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. రాజకీయ అంశాన్ని సభలో లేవనెత్తకుండా నివారిస్తే బాగుండేదన్నారు'' అని

స్పీకర్‌తో భేటీ సందర్భంగా రాహుల్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ వెల్లడించారు. ఈ అంశంపై కేసీ వేణుగోపాల్ విడిగా స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. 'పార్లమెంట్ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసే అంశమిది. స్పీకర్‌గా మిమ్మల్ని ఎన్నుకున్న శుభతరుణంలో అర్ధశతాబ్దకాలంనాటి ఎమర్జెన్సీ అంశాన్ని మీరు సభ ముందుకు తేవడం విపక్షాలన్నింటినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. స్పీకర్ ఎన్నిక, బాధ్యతల స్వీకరణ వేళ రాజకీయాలు మాట్లాడటం పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి. నూతన స్పీకర్‌గా ఎన్నికయ్యాక చేపట్టాల్సిన తొలి విధులకు ఇలాంటి చర్యలు తీవ్ర విఘాతం కల్గిస్తాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను అపహాస్యం చేస్తూ సాగిన ఈ ఉదంతంపై మేం ఆందోళన చెందాం'' అని వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. ''1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో 'అత్యయిక స్థితి' అమల్లోకి తెచ్చారు. చాలా మంది ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం జైళ్లలో పడేసింది. మీడియాపై ఆంక్షలు విధించింది. న్యాయ వ్యవస్థపై నియంత్రణ చట్రం బిగించింది. ఎమర్జెన్సీ విధించి 49 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సభ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించడంతోపాటు దాని విలువలకు కట్టుబడి ఉందని నేను హామీ ఇస్తున్నా'' అని నూతన స్పీకర్ బిర్లా బుధవారం పేర్కొన్నారు. స్పీకర్ ఆ తీర్మానాన్ని చదువుతున్న సందర్భంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలంతా నిలబడి తీవ్ర నిరసన వ్యక్తం చేయడం తెలిసిందే.

మంత్రులను పరిచయం చేసిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తన మంత్రివర్గ సభ్యులను ఎగువ సభ రాజ్యసభకు పరిచయం చేశారు. స్పీకర్ ఎన్నిక అనంతరం బుధవారం మోదీ తన మంత్రివర్గాన్ని లోక్‌సభకు పరిచయం చేసిన విషయం తెల్సిందే. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్..'ఆరు దశాబ్దాల విరామం తర్వాత వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీని సభకు పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది'అని పేర్కొనడంతో సభ్యులు డెస్కులపై చరుస్తూ, చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ ధన్‌ఖడ్ సూచన మేరకు ప్రధాని మోదీ మంత్రివర్గ సహచరులను సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను నియమిస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. అనంతరం సభ్యులనుద్దేశించి ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ..ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు అందరం కలిసి పనిచేద్దామంటూ పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన, నామినేట్ అయిన 61 మంది సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

జాతీయ గీతం వినిపిస్తుండగానే...

నడుస్తూ పక్కకు వెళ్లిపోయిన స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: పార్లమెంటులో గురువారం జాతీయగీతం అలపిస్తుండగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉన్నచోటనే నిలబడి పోకుండా.. నడుచుకుంటూ వెళ్లారు. పోడియంపై స్పీకర్ కుర్చీ వెనకనుండి ముందుకు నడుచుకుంటూ వచ్చి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సరసన నిలుచున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జాతీయ గీతాన్ని అవమానించడమేనని విపక్ష నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ ఈ వీడియోను ఎక్స్‌లో షేర్ చేస్తూ.. 'స్పీకర్ సార్ జాతీయ గీతం అలపిస్తుంటే మీరు ఉన్న చోటనే నిలబడిపోవాలి. మీ చర్య జాతీయ గీతాన్ని అవమానించడమే' అని పేర్కొన్నారు.

ముయిజ్జుపై చేతబడి చేశారని మంత్రుల అరెస్ట్

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై చేతబడి చేయించారనే ఆరోపణలపై అధికారులు ఇద్దరు మంత్రులను అరెస్ట్ చేశారు. పర్యావరణ శాఖ సహాయ మంత్రి షమ్నాజ్ సలీం, ఆమె మాజీ భర్త, అధ్యక్ష కార్యాలయంలో మంత్రిగా ఉన్న ఆదాం రమీజ్‌లతోపాటు మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు స్థానిక మీడియా తెలిపింది. వీరిని కోర్టు ఏడు రోజుల రిమాండ్‌కు పంపిందని పేర్కొంది. మంత్రి పదవి నుంచి షమ్నాజ్‌ను తొలగించినట్లు వెల్లడించింది. గత ఐదు నెలలుగా రమీజ్ కనిపించడం లేదని కూడా తెలిపింది.

90 నిమిషాలు.. నో నోట్స్

బైడెన్– ట్రంప్ డిబేట్ నేడే

అట్లాంటా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య శుక్రవారం తొలి చర్చ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 6:30 గంటలకు సీఎన్ఎన్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. అధ్యక్షుడు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ (81), రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ (78)ల మధ్య అట్లాంటాలోని సీఎన్ఎన్ స్టూడియోలో 90 నిమిషాలు ముఖాముఖి చర్చ జరగనుంది. వారికి ఎలాంటి నోట్స్‌ను అనుమతించరు. వయసురీత్యా తనపై నెలకొన్న సందేహాలను తొలగించి, మరో నాలుగేళ్ల అధ్యక్షుడిగా సమర్థంగా వ్యవహరిస్తానని నిరూపించుకోవడానికి బైడెన్‌కు ఇదొక అవకాశం. అలాగే ఓటర్లను మెప్పించేందుకు ట్రంప్‌కు కూడా!

ఎన్‌టీఏ ఆఫీసుకు తాళం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు గురువారం ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. నీట్, యూజీసీ-నెట్ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా ఎన్‌టీఏ కార్యాలయానికి తాళం వేశారు. ఎన్‌టీఏను మూసివేయాలంటూ నినాదాలు చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ కార్యాలయాలకు కూడా తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఎన్‌టీఏ నిర్లక్ష్యం, చేతకానితనం ఫలితంగానే దేశవ్యాప్తంగా లక్షలాదిగా విద్యార్థులు నష్టపోయారని విమర్శించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఓఎంఆర్ షీట్ల ఫిర్యాదులపై కాలపరిమితి ఉందా: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: నీట్ యూజీ ఓఎంఆర్ షీట్లకు సంబంధించి విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి ఉందా అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)ని సుప్రీంకోర్టు గురువారం ప్రశ్నించింది. అన్ని ఓఎంఆర్ షీట్లు అప్‌లోడ్ చేసి అందుబాటులో ఉంచామని ఎన్‌టీఏ తరఫు న్యాయవాది వివరించారు. కాలపరిమితి వివరాలతో కౌంటరు వేయాలని ఎన్‌టీఏను కోర్టు ఆదేశించింది.

'నీట్-యూజీ' కేసులో ఇద్దరి అరెస్ట్

నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ బృందం పట్నాలో ఇద్దరిని అదుపులోకి తీసుకుంది. వీరు ప్రశ్నాపత్రంతోపాటు జవాబుల కీను కూడా అభ్యర్థులకు సరఫరా చేసినట్లు అధికారులు అంటున్నారు.

భారత్‌పై అమెరికా అక్కసు

విద్వేషాలు పెరిగాయన్న విదేశాంగ మంత్రి

వాషింగ్టన్: భారత్‌లో మత మార్పిడి చట్టాలు పెరిగాయని, మైనారిటీలే లక్ష్యంగా నేతలు విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ గురువారం వ్యాఖ్యానించారు. ''భారత్‌లో మైనారిటీల ఇళ్లు, ప్రార్థనా స్థలాల కూల్చివేతలు పెరిగాయి. పది రాష్ట్రాల్లో మతమార్పిడిపై ఆంక్షలున్నాయి. చట్ట వ్యతిరేకంగా మత మార్పిళ్లకు పాల్పడుతున్నారంటూ క్రైస్తవులు, ముస్లింలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. భారత్‌ను హిందూదేశంగా మార్చే యత్నాల్లో భాగంగా ఉమ్మడి పౌరస్మృతికి తెర తీశారు'' అన్నారు.

బొలీవియాలో సైనిక తిరుగుబాటు విఫలం

లా పాజ్: దక్షిణ అమెరికా దేశం బొలీవియాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి, అధికారం చేజిక్కించుకునేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ జువాన్ జోస్ జునిగా యత్నించారు. వందలాది సైనికులు బుధవారం రాజధానిలో లా పాజ్‌లో యుద్ధ ట్యాంకుతో అధ్యక్ష భవనాన్ని ఢీకొట్టారు. తిరుగుబాటును ప్రతిపక్ష పార్టీలన్నీ ఖండించాయి. అధ్యక్షుడు లూయిస్ ఆర్సెకు మద్దతుగా వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. జునిగా, అతడి మద్దతుదారులను అరెస్ట్ చేయడంతో ప్రతిష్టంభనకు తెర పడింది. అధ్యక్షుడు అతన్ని పదవి నుంచి తొలగించారు. త్రివిధ దళాలకు కొత్త అధిపతులను నియమించారు.

ఐఎస్ఎస్‌ను కూల్చేయనున్న స్పేస్‌ఎక్స్

- నాసాతో మస్క్ భారీ ఒప్పందం
- 2030 తొలినాళ్లలో పని పూర్తి



వాషింగ్టన్: ప్రతి గంటన్నరకు ఒకసారి భూమి చుట్టూ తిరిగే ఫుట్‌బాల్ స్టేడియం సైజు ఉన్న ఆకాశ ప్రయోగశాల.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) త్వరలో నీలిసంద్రంలో కూలిపోనుంది. 2030 సంవత్సరంకల్లా పాతబడిపోతున్న ఐఎస్ఎస్ అంతరిక్షచెత్తగా మిగిలిపోకుండా, తదుపరి ప్రయోగశాలలకు అవరోధంగా మారకుండా చూడాలని అమెరికా నాసా నిర్ణయించుకుంది. అందుకే గడువు ముగిసేనాటికి దానిని ప్రస్తుత కక్ష్య నుంచి తప్పించనుంది. ఇప్పటికే రాకెట్ల తయారీతో అంతరిక్ష అనుభవం గడించిన కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు నాసా ఈ బాధ్యతను అప్పగించింది. ఇందుకోసం దాదాపు రూ.7,036 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను స్పేస్‌ఎక్స్‌కు ఇచ్చినట్లు నాసా బుధవారం ప్రకటించింది. కాంట్రాక్ట్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ డీఆర్బిట్ వెహికల్(యూఎస్‌డీవీ)ను స్పేస్‌ఎక్స్ నిర్మించనుంది. అది సముద్రంలో చిన్న పడవలను లాగే/నెట్టే టగ్ బోటులా ఉంటుందని భావిస్తున్నారు. ఐఎస్ఎస్ ప్రస్తుతం భూమికి 400 కి.మీ.ల ఎత్తులో తిరుగుతోంది. ఏకంగా 430 టన్నుల బరువైన ఐఎస్ఎస్‌ను యూఎస్‌డీవీతో నియంత్రిస్తూ దశల వారీగా దిగువ కక్ష్యలకు తీసుకొస్తూ ముందుగా నిర్దేశించిన పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల 'పాయింట్ నెమో' వద్ద కూల్చేయనున్నారు. ఈ 'పాయింట్ నెమో' సముద్రప్రాంతం నుంచి దగ్గర్లోని భూభాగానికి వెళ్లాలంటే కనీసం 2,500 కిలోమీటర్లు ప్రయాణించాలి. పౌరులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకూడదని సుదూర ప్రాంతాన్ని ఎంచుకున్నారు.

వేల ప్రయోగాలకు వేదిక

ఐఎస్ఎస్ నిర్మాణం కోసం తొలి భాగాలను 1998లో రాకెట్లలో తీసుకెళ్లారు. 2000 సంవత్సరందాకా దీని నిర్మాణం సాగింది. శూన్యంలో ఎన్నో భిన్న ప్రయోగాలకు ఐఎస్ఎస్ సాక్షిగా నిలిచింది. అమెరికా, రష్యా, కెనడా, జపాన్ తదితర దేశాలు దీని నిర్వహణ చూసుకుంటున్నాయి. 2028లో చేతులు దులిపేసుకుంటామని రష్యా చెప్పేసింది.

సిద్ధూ.. సీఎంగా దిగిపోండి

డీకేకు అవకాశమివ్వండి ● సీఎం సమక్షంలోనే ఒక్కళిగ స్వామీజీ వ్యాఖ్యలు

బెంగళూరు: విశ్వ ఒక్కళిగ మహాసంస్థాన మఠాధిపతి కుమార చంద్రశేఖరనాథ స్వామీజీ గురువారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టేశారు. కెంపెగౌడ జయంతి కార్యక్రమంలో స్వామీజీ, సిద్ధుతో పాటు ఒక్కళిగ నేత అయిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, ''మన డీకే ఇంకా సీఎం కాలేదు. అందుకే సీఎంగా అనుభవం గడించిన సిద్ధరామయ్య దిగిపోయి డీకేకు అవకాశమివ్వాలని కోరుతున్నా. మీరనుకుంటే అయిపోతుంది'' అన్నారు. సిద్ధూ స్పందిస్తూ, ''కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశానుసారం నడుస్తుంది. స్వామీజీ ఏదో చెప్తారు. ఆయనకు ఇవేమీ తెలీదు'' అన్నారు. స్వామీజీ తనపై ఇష్టంతో అలా అన్నారని, అవి సీరియస్‌గా తీసుకోవాల్సిన మాటలు కావని డీకే అన్నారు. ''జనం అభిమానం కొద్దీ మాట్లాడతారు. కానీ మేం పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటాం'' అని చెప్పుకొచ్చారు. స్వామీజీ చెప్పారని ఎవరైనా సీఎం పదవి వదులుకుంటారా అని సహకార మంత్రి కేఎన్ రాజన్న ప్రశ్నించారు. నాక్కూడా స్వామీజీ హోదా కావాలంటే ఆయన ఒప్పుకుని త్యాగం చేస్తారా?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

యడియూరప్పపై పోక్సో కోర్టులో చార్జిషీట్

బనశంకరి: కర్ణాటక బీజేపీ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్పపై నమోదైన పోక్సో కేసులో బెంగళూరు పోలీసులు ప్రత్యేక కోర్టులో గురువారం చార్జిషీట్ సమర్పించారు. ఈ కేసులో యడియూరప్పను అరెస్ట్ చేయరాదంటూ పోలీసులను హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. పోలీసుల విచారణకు హాజరు కావాలని కూడా యడియూరప్పకు కోర్టు స్పష్టం చేసింది. సమస్య చెప్పుకుందామని యడియూరప్ప ఇంటికి వెళ్లిన తన కూతురిని (17) ఆయన లైంగికంగా వేధించారని మార్చిలో ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెల్సిందే. దీనిపై నమోదైన కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది.

ఆస్పత్రి నుంచి అద్వాణీ డిశ్చార్జి

న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజ నేత లాల్ కృష్ణ అద్వాణీ(96) గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. వయో సంబంధ సమస్యలతో ఆయన బుధవారం రాత్రి ఎయిమ్స్‌లో చేరడం తెల్సిందే. యూరాలజీ, జీరియాట్రిక్ మెడిసిన్ తదితర నిపుణులతో కూడిన వైద్య బృందం అద్వాణీ ఆరోగ్య పరిస్థితిని పూర్తి స్థాయిలో పరిశీలించింది. అనంతరం స్వల్ప చికిత్స చేపట్టినట్లు ఎయిమ్స్ అధికారి వివరించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. అయితే అద్వాణీ ఎలాంటి సమస్యతో బాధపడుతున్నారనే విషయం వెల్లడించలేదు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం : 28 : జూన్ : 2024

తాత కాదు.. కామోన్మాది

బనశంకరి: మనవరాలిపై తాత అత్యాచారానికి పాల్పడిన నీచ ఘటన సిలికాన్ సిటీలో హుళిమావు పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వేణుగోపాలనగరలో ఈ దారుణం జరిగింది. నిందితుడు చక్రవర్తి (60), కొడుకు రంజిత్‌కుమార్‌లది ఉమ్మడి కుటుంబం. కొడుకు– కోడలికి 6 ఏళ్ల కూతురు ఉంది. బాలిక తల్లి విధులకు వెళ్లిన సమయంలో చక్రవర్తి చిన్నారిపై అత్యాచారానికి పాల్పడేవాడు. మరో ఘోరం ఏమిటంటే ఈ విషయం బాలిక తండ్రి రంజిత్ కుమార్‌కి తెలిసినా ఏమీ అనలేదు. పైగా తన తండ్రికి వత్తాసు పలికాడు. బాలిక ద్వారా తెలుసుకుని తల్లి వారిని నిలదీయగా అందరూ కలిసి బెదిరించారు. దీంతో ఆమె స్థానికుల సహాయంతో హుళిమావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గురువారం కామాంధుడు చక్రవర్తి, రంజిత్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి విచారణ చేపట్టారు. అతనికి సహకరించినందుకు వృద్ధుని భార్య, కూతుళ్లపైన కేసు నమోదు చేశారు. బాలిక వాణివిలాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

న్యూస్‌రీల్

హస్తినకు సీఎం, డీసీఎం

- నేడు, రేపు బిజీ బిజీ

సాక్షి, బెంగళూరు: సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం సాయంత్రం ఢిల్లీకి ఒకే విమానంలో వెళ్లారు. 18వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన తరుణంలో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు, కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల గురించి చర్చించి అనుమతులు పొందే నేపథ్యంలో ఢిల్లీ యాత్ర చేపట్టారు. అక్కడ రాష్ట్ర ఎంపీలతోను, అలాగే కాంగ్రెస్ పెద్దలతోనూ సమావేశం కానున్నారు. మేకెదాటు, భద్రా ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, రైల్వే, ఇతరత్రా పెండింగ్ ప్రాజెక్టుల అనుమతుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలని సూచించనున్నారు. ఎంపీలతో భేటీలో రాష్ట్రం నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు పాల్గొంటారా, లేదా అన్నది సందేహమే. శనివారం ఉదయం 8 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం సిద్దరామయ్యకు అపాయింట్‌మెంట్ ఖరారు అయింది. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తారు. కాగా, రాష్ట్రంలో సీఎం మార్పు, ముగ్గురు డిప్యూటీ సీఎంల వివాదాల గురించి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతోను చర్చించే అవకాశముంది.

బాల మందిరం నుంచి పరార్

బనశంకరి: బాల మందిరంలో ఆశ్రయం పొందుతున్న 6 మంది బాలికలు పారిపోయిన ఘటన సిద్దాపుర పోలీస్‌స్టేషన్ పరిదిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నగరంలో నిమ్హాన్స్ ఆసుపత్రి వద్ద గల బాలమందిరంలో 6 మంది బాలికలు తెల్లవారుజామున భద్రతా సిబ్బందిపై దాడిచేసి చేతులు కొరికి ఉడాయించారు. వీరు సుమారు 16 నుంచి 17 ఏళ్ల లోపు ఉంటారని, పలు రకాల నేర కార్యకలాపాలకు పాల్పడడంతో కోర్టు ఆదేశంతో బాల మందిరంలో ఉంచారు. నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలికల కోసం గాలింపు చేపట్టారు.

గుండెపోటుకు యువతి బలి


నీలిక (ఫైల్)

యశవంతపుర: ఆరోగ్యంగా ఉన్న యువతి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ఘటన కొడగు జిల్లా మడికెరి తాలూకా నెలజి గ్రామంలో జరిగింది. నీలిక పొన్నప్ప (24) అనే కొడవ అమ్మాయి గురువారం ఉదయం ఇంట్లో ఉండగా గుండెపోటు వచ్చింది. క్షణాల్లోనే మృత్యుఒడికి చేరుకుంది. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

లీకేజీ కింగ్‌కు నో బెయిల్

బనశంకరి: కేఈఏ పరీక్ష అక్రమాల కేసులో లీకేజీ కింగ్ ఆర్‌డీ పాటిల్‌కు కలబురిగి జిల్లా ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.నాగశ్రీ బెయిల్ నిరాకరించారు. గురువారం కలబురిగి ప్రత్యేక కోర్టులో కేఈఏ పరీక్ష అక్రమాల కేసులో ఆర్‌డీ. పాటిల్ బెయిల్ విచారణ చేపట్టారు. వాద ప్రతివాదనలు ఆలకించి బెయిల్ నిరాకరించారు. గతంలో సబ్ ఇన్స్‌పెక్టర్ల రాత పరీక్షలలోనూ ఆర్‌డీ పాటిల్ ప్రధాన సూత్రధారిగా ఉండడం తెలిసిందే.

కిల్లర్ చౌగలే జామీను అర్జీ తిరస్కృతి

యశవంతపుర: ఉడుపిలో ఎయిరిండియా ఎయిర్‌హోస్టెస్‌తో పాటు ఆమె తల్లి, చెల్లి, తమ్ముణ్ని కత్తితో పొడిచి చంపిన తోటి ఎయిర్‌హోస్టెస్ ప్రవీణ్ అరుణ్ చౌగలే దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఉడుపి జిల్లా మల్పె పోలీసుస్టేషన్ పరిధిలోని నేజార్‌లో 2023 నవంబర్ 12న ప్రవీణ్ ఐనాజ్, హసీనా, అఫ్నాన్, అసీమ్‌లను దారుణంగా హత్య చేశాడు. పెళ్లికి ఒప్పుకోలేదని ఈ దారుణానికి తెగబడ్డాడు. తరువాత బెళగావికి పారిపోయాడు, కొన్నిరోజుల తరువాత ఉడుపి పోలీసులు అరెస్టు చేశారు. బెయిలు ఇవ్వరాదని ప్రభుత్వ న్యాయవాది గట్టి సాక్ష్యాలతో వాదించారు. చివరకు కోర్టు బెయిలుకు తిరస్కరించింది. ఈ హత్యోదంతంపై గత ఫిబ్రవరిలో 2202 పేజీలతో పోలీసులు చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు.

కిరాతక భర్తకు జీవితఖైదు

మైసూరు: భార్యకు నిప్పుపెట్టి చంపిన భర్తకు మైసూరు నగరంలోని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదుని విధించింది. నంజనగూడు తాలూకాలోని హెమ్మరగాల గ్రామానికి చెందిన స్వామి ముద్దాయి. ఇతనికి చామరాజనగర జిల్లాలోని యలందూరుకు చెందిన సిద్దరాజమ్మ పెళ్లయింది. ఐదేళ్ల పాటు కాపురం బాగానే సాగింది, ఇద్దరు పిల్లలు పుట్టారు. తరువాత భార్యపై భర్తకు అనుమానం మొదలైంది. దీంతో రోజూ ఆమెతో గొడవ పడి కొట్టేవాడు. అతని హింసను భరించలేక భార్య పిల్లలను తీసుకుని ఏడాది పాటు పుట్టింటికి వెళ్ళింది. మళ్లీ పెద్దలు పంచాయతీ చేసి ఆమెను భర్త వెంట పంపారు. 2019 సెప్టెంబర్‌లో మళ్లీ అనుమానంతో రగడపడి ఆమెపై కిరోసిన్ పోసి నిప్పటించాడు. తీవ్రగాయాలైన సిద్దరాజమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 4 రోజుల తరువాత చనిపోయింది. కవలంద పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు శిక్ష విధించారు.

సెలబ్రిటీల చెరసాల



- పరప్పన జైలుకు సినీ, రాజకీయ ప్రముఖుల క్యూ
- బయట అభిమానుల కోలాహలం
- నెలరోజులుగా ఒకటే సందడి


ఓ సినిమాలో ఖైదీ పాత్రలో హీరో దర్శన్.. ఇప్పుడు ఇదే జైలులో ఉన్నారు




పరప్పన జైలుపాలైన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (ఫైల్)

బనశంకరి: సెలబ్రిటీల రాకతో పరప్పన అగ్రహార జైలు సందడిగా మారింది. హత్యలు, అత్యాచారాలు, చీటింగ్ తదితర కేసులతో ప్రముఖులు పరప్పన బాట పట్టడం పెరిగింది. శాండల్‌వుడ్ నటీనటులు, రాజకీయ నేతలు క్యూకట్టారు. కారాగారానికి ఒకరకమైన స్టార్‌డం ఆవహించింది.

రెండోసారి దర్శన్ జైలుకు

రేణుకాస్వామి హత్యకేసులో నిందితునిగా ఉన్న సినీ హీరో దర్శన్ పరప్పన అగ్రహార జైలులో సెలబ్రిటీగా ఉన్నారు. గతంలో 2011లో భార్యపై దాడికి పాల్పడిన కేసులో ఇదే జైలుకు తొలిసారిగా వచ్చి 20 రోజులకు పైగా ఉన్నారు. 13 ఏళ్ల తరువాత రెండోసారి మళ్లీ రేణుకాస్వామి హత్యకేసులో దర్శన్, ఆయన ప్రియురాలు, నటి పవిత్రాగౌడ సమేతంగా పరప్పనలో చేరారు. జైల్లో 3వ సెక్టార్ భాగంలో గల హై సెక్యూరిటీ గదిని దర్శన్‌కు కేటాయించారు. నిత్యం ఆయనను పలువురు కలుస్తున్నారు. మహిళలపై లైంగిక దాడి కేసులో చిక్కుకున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, యువకునిపై లైంగికదాడికి పాల్పడ్డారనే కేసులో ఆయన తమ్ముడు సూరజ్ రేవణ్ణ సైతం ఇదే జైలులో ఉన్నారు.

వీఐపీలపై ప్రత్యేక నిఘా

జైల్లో మకాం వేసిన వీఐపీలపై ఈగ వాలకుండా లోపల భద్రతా సిబ్బంది నిఘా వేయాల్సి ఉంటుంది. వారిని కలవడానికి వచ్చేవారు, అభిమానుల తాకిడితో జైలు బయట, లోపల సందడి ఏర్పడుతోంది. నటుడు దర్శన్‌తో నిత్యం పలువురు నటులు, స్నేహితులు వచ్చి ములాఖత్ అవుతున్నారు. జైలుకు వచ్చేవారిపై జైలు సిబ్బంది నిఘాపెట్టారు. ఉత్తర కర్ణాటకతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దర్శన్ కోసం వందలాది మంది అభిమానులు పరప్పన జైలు వద్దకు వస్తున్నారు. వీరిని నియంత్రించడం కోసం పోలీసులు లాఠీచార్జ్ కూడా చేశారు. జైలుకు వందమీటర్ల దూరంలో బ్యారికేడ్లను అమర్చి ఎక్కువమంది గుమిగూడకుండా చర్యలు చేపట్టారు. వీఐపీ ఖైదీల అభిమానులను నియంత్రించడం పోలీసులు తలనొప్పిగా మారింది.

గతంలో సంజన, రాగిణి...

విలాసవంతమైన జీవితాలు కటకటాలపాలు కావడం ఇదేం కొత్త కాదు. శాండల్‌వుడ్ అందాలరాశులు సంజన గల్రాని, రాగిణి ద్వివేది డ్రగ్స్ కేసులో పట్టుబడి 2020 సెప్టెంబరు నుంచి కొన్ని నెలల పాటు పరప్పన అగ్రహార జైలుజీవితం అనుభవించారు. మాజీ మంత్రి జీవరాజ్ అళ్వా కుమారుడు ఆదిత్యా ఆళ్వా కూడా డ్రగ్స్‌కేసులో జైలుకెళ్లి వచ్చారు. గతంలో తమిళనాడు మాజీ సీఎం జయలలిత, ఆమె ఆప్తురాలు శశికళ, ఇళవరసి, పలు కేసుల్లో మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప, మాజీమంత్రులు కట్టా సుబ్రమణ్యం నాయుడు, కృష్ణయ్యశెట్టి, హెచ్‌డీ.రేవణ్ణ పరప్పన అగ్రహార జైలు జీవితం గడిపారు. జైలులో శశికళ, ఇళవరసి అక్రమంగా ప్రత్యేక వసతులు పొందారు. అప్పటి జైళ్ల శాఖ డీఐజీగా ఉన్న డీ.రూపా ఈ బాగోతాన్ని రట్టు చేశారు. జైళ్ల శాఖ చీఫ్‌పైనే ఆమె కోట్లాది రూపాయల లంచం ఆరోపణలు చేయడంతో జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. ఎప్పుడైనా వచ్చే ప్రముఖులకు పరప్పనలో చోటు లేకుండా ఉండదు.


కరోనా బెడద సమస్య ఉన్న సమయంలో రాగిణి, సంజన ఈ చెరసాలకు వచ్చారు

మెట్రో మూడో దశకు రూ.26 వేల కోట్లు

బనశంకరి: నమ్మ మెట్రో రైలు మార్గం మూడో దశ పనులను 2031కి పూర్తి చేయనున్నట్లు బీఎంఆర్‌సీఎల్ తెలిపింది. సర్జాపుర నుంచి హెబ్బాళ వరకు 36.5 కిలోమీటర్ల పొడవుతో మూడోదశ మెట్రోలైన్ నిర్మాణమవుతుంది. ఇది ఆలస్యం కావడంపై బీఎంఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఈ పథకం వ్యయం రూ.16 వేల కోట్లుగా గతంలో నిర్ణయించగా ఇప్పుడు ఖర్చులు పెరిగి రూ.26,405 కోట్ల అంచనాకు చేరుకొందని తెలిపారు. ఈ మార్గంలో 28 మెట్రోస్టేషన్లు నిర్మించనున్నారు. కోరమంగల రెండోబ్లాక్ నుంచి మెడికల్ కాలేజీ వరకు 14.4 కిలోమీటర్లు సొరంగ మార్గంలో 11 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఈ మార్గం కోసం 5,400 చెట్లు తొలగించాలని తెలిపింది. వీటిలో సగం చెట్లను నరికేస్తారు, మిగతా సగం చెట్లను మరోచోటుకు తరలిస్తామని తెలిపింది.

నిండిన తుంగా జలాశయం



శివమొగ్గ: అతి తక్కువ నీటి నిల్వ ఉన్న తుంగా జలాశయంలోకి వరద నీరు భారీగా తరలివస్తుండటంతో జలాశయం పూర్తిగా నిండిపోయింది. మల్నాడులో రుతు పవన వర్షాలు కుండపోతగా కురుస్తుండటంతో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరింది. దీనికి తోడు తీర్థహళ్లి, అగుంబె, చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పెద్ద ఎత్తున వరద నీరు తుంగాలోకి చేరుతోంది. గురువారం ఉదయం అధికారులు తుంగా జలాశయం గరిష్ట నీటిమట్టం 588.24 మీటర్లకు చేరడంతో జలాశయం రెండు క్రస్ట్‌గేట్లను తెరచి దాదాపు ఆరు వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఆ జలాలు హొసపేటె టీబీ జలాశయానికి చేరుకుంటాయి.

భూమి కాజేయడానికి నకిలీ డెత్ సర్టిఫికెట్

మైసూరు: జీవించి ఉండగానే ప్రవాస భారతీయుని పేరుతో మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చిన ఉద్యోగి వైనమిది. నంజనగూడు తహసీల్దార్ ఆఫీసులో శిరస్తేదారుగా పని చేస్తున్న శ్రీనాథ్ ఈ పనికి పాల్పడ్డాడు. ముళ్లూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు కొంత భూమి ఉంది, చంద్రశేఖర్ కెనడా దేశంలో స్థిరపడ్డాడు. గ్రామంలోని అతని భూమిపై అదే ఊరికి చెందిన కృష్ణెగౌడ, శివ మల్లెగౌడ అనే ఇద్దరి కన్నుపడింది. ఇందుకోసం చంద్రశేఖర్ చనిపోయాడని శిరస్తెదారు శ్రీనాథ్‌కు డబ్బులు ముట్టజెప్పి డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించారు. తరువాత రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలన చేయగా, ఇదంతా కుట్ర అని బయటపడింది. చంద్రశేఖర్ బంధువు నాగరాజరావు అనే వ్యక్తి బిళిగెరె పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులు శిరస్తేదారు శ్రీనాథ్‌ను సస్పెండ్ చేశారు. గ్రామ లెక్కాధికారి మంజునాథ్, ఆర్ఐ ప్రకాశ్, కృష్ణెగౌడ, శివమల్లేగౌడ పైన కేసు నమోదు చేశారు.

తప్పుడు ఆరోపణలు.. 13 మందికి జైలు

యశవంతపుర: హెస్కాం అధికారిపై తప్పుడు ఆరోపణలు చేసిన కేసులో బెళగావి జిల్లా ప్రధాన కోర్టు గురువారం 13 మందిని దోషులుగా ప్రకటించి వారికి మూడేళ్ల ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 86 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. వివరాలు... హెస్కాం బెళగావి విభాగం ఇంజనీర్‌గా పని చేస్తున్న తుకారాం అదే కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సహాయక ఇంజినీర్‌ని లైంగికంగా వేధిస్తున్నాడని పలువురు సిబ్బంది ఆరోపణలు చేశారు. దీంతో తుకారాం తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని 2017లో కోర్టును ఆశ్రయించారు. ఆయన తప్పేం లేదని బాధిత మహిళ కోర్టుకు వివరించడంతో 13 మంది హెస్కాం సిబ్బందికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

కొడగు జిల్లాలో భారీ వర్షాలు


గురువారం మడికెరి వద్ద భాగమండలలో స్నానఘట్టం వద్ద ప్రవహిస్తున్న కావేరి నది

- మునిగిన త్రివేణి స్నానఘట్టం

యశవంతపుర: కొడగు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో పడుతున్న భారీ వానలతో భాగమండలలో త్రివేణి సంగమ స్నానఘట్టం మునిగిపోయింది. బ్రహ్మగిరి సమీపంలో నిరంతరం వానలు కురుస్తున్నాయి. సమీపంలో నూతనంగా నిర్మించిన ఉద్యానవనంలో భారీ ఎత్తున వరద నీరు చేరింది. జోరుగా కురుస్తున్న వానతో భగండేశ్వర ఆలయ ముందుభాగం కూడా మునిగే అవకాశం ఉంది. బ్రహ్మగిరి కొండ తలకావేరి వ్యాప్తిలో కూడా భారీ వానలు కురుస్తున్నాయి. కావేరి, కన్నికె, సుజ్యోతి నదులు నిండి జోరుగా ప్రవహిస్తున్నాయి. నీటిమట్టం గంటగంటకు పెరుగుతోంది. భాగమండల–నాపోక్లు రోడ్డుపై అడుగులోతు నీరు ప్రవహిస్తోంది. కొడగు జిల్లా పరిధిలోని మడికేరి, విరాజపేట, పోన్నంపేట తాలూకాలలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. కుక్కే సుబ్రమణ్య కుమారధార స్నానఘట్టంలోని వెళ్లొద్దని భక్తులకు అధికారులు సూచనలు చేశారు. కుమారధార కిండి అనకట్ట పూర్తిగా మునిగి ఉపనది దర్పణ తీర్థం నిండుగా ప్రవహిస్తోంది.





స్నాతకోత్సాహం

ఎన్నో ఏళ్లపాటు అహరహం చదివిన చదువులకు పట్టాలు స్వీకరించే రోజు. అందుకే ఇంత ఉత్సాహంగా వచ్చారు. గురువారం ధార్వాడలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 37వ స్నాతకోత్సవం జరిగింది. పట్టభద్రులు ముస్తాబై తరలివచ్చారు. పలువురు ప్రతిభావంతులు బంగారు పతకాలను అందుకున్న దృశ్యం

సీఎం సిద్దరామయ్యా.. కుర్చీ దిగాలి

- సీఎం పదవిని డీకేశికి ఇవ్వండి
- చంద్రశేఖరస్వామి డిమాండ్
- కెంపేగౌడ జయంతి వేదికపై రాజకీయ సెగ


వేదికపై ముభావంగా స్వాములు, సీఎం, డీసీఎం



సాక్షి, బెంగళూరు: మీకు అనుభవం ఉంది. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వండి. సిద్ధరామయ్య మనసు పెడితే ఇది సాధ్యం అవుతుంది. దయచేసి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి స్థానాన్ని అప్పగించండి' అని సిద్దరామయ్యకు విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన మఠాధిపతి చంద్రశేఖర స్వామిజీ విజ్ఞప్తి చేశారు. ఇది ఎక్కడో ఆంతరంగికంగా జరిగిన భేటీలో కాదు.. వేలాది మంది హాజరైన బహిరంగ సభలో ఇలా కోరడం పెద్ద చర్చనీయాంశమైంది.

వివరాలు.. గురువారం బెంగళూరు కంఠీరవ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నాడప్రభు కెంపేగౌడ 515వ కెంపేగౌడ జయంతి వేడుక సభ జరిగింది. ఆదిచుంచనగిరి పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ స్వామీజీ ప్రారంభించారు. ఇదే కార్యక్రమంలో డీకే శివకుమార్‌కు మద్దతుగా చంద్రశేఖర్ స్వామీజీ గళమెత్తారు. ఆయన ప్రసంగిస్తూ ఉండగా వేదికపై సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఆశీనులై ఉన్నారు. సీనియర్ నేతల్లో ఇప్పటి వరకు డీకే శివకుమార్ మాత్రమే సీఎం కాలేదని, సిద్ధరామయ్య తన పదవిని డీకేకి అప్పగించాలని కోరారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో ఆయన పాత్ర ఉందని అన్నారు. ఈ మాటలతో అందరూ సంభ్రమానికి లోనయ్యారు.

హైకమాండ్ చేతిలో ఉంది: సీఎం

సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ కెంపేగౌడ అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందించారని కొనియాడారు. బెంగళూరు అద్భుత స్థాయిలో వెలుగొందడానికి కెంపేగౌడ చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. సీఎం స్థానంపై తీర్మానం చేసే అధికారం కాంగ్రెస్ పార్టీలో హైకమాండ్‌కే ఉంటుందని అన్నారు.


కెంపేగౌడ విగ్రహానికి నివాళులు

హీరో కోసం అభిమాని ఆరాటం

- జైలు వద్ద హల్‌చల్


దర్శన్ చిత్రపటంతో సౌమ్య, తల్లిదండ్రులు


దర్శన్ సతీమణి విజయలక్ష్మి

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై పరప్పన అగ్రహార జైలులో ఉన్న హీరో దర్శన్‌ను చూడడానికి జైలు వద్దకు నిత్యం అధిక సంఖ్యలో అభిమానులు తరలి వస్తున్నారు. జైలు వద్ద పగలంతా పడిగాపులు కాస్తున్నారు. గురువారం నాడు జాలహళ్లికి చెందిన సౌమ్య అనే దివ్యాంగ యువతి, ఆమె తల్లిదండ్రులు వచ్చారు. దర్శన్‌ను చూడనిదే అక్కడి నుండి దిలేది లేదని యువతి గొడవ చేసింది. 2016లో సౌమ్య తన అభిమాని అని తెలుసుకున్న దర్శన్ ఆమె ఇంటికి వెళ్లి ఎత్తుకుని సరదాగా మాట్లాడారు. కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకుని ఆటోరిక్షాను కూడా కొనిచ్చాడు. దర్శన్‌ను చూడాల్సిందేనని ఆ కుటుంబం కొంతసేపు హల్‌చల్ చేసింది.

దర్శన్‌కు అండగా భార్య

ప్రియురాలి సహవాసం చేసి ఆమె కోసం హత్య కేసులో చిక్కి సెంట్రల్ జైల్లో ఉన్న దర్శన్‌కు భార్య విజయలక్ష్మి పెద్ద మనసుతో అండగా నిలిచింది. ఇటీవలే కుమారుడు వినీష్‌తో కలిసి జైలుకు వెళ్లి సుమారు రెండు గంటలపాటు దర్శన్‌తో మాట్లాడారు ఆమె. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ కేసులో దర్శన్‌కు న్యాయం లభిస్తుందనే నమ్మకం ఉందని, అంతవరకూ ఆయనకు అండగా ఉందామని, అభిమానులు ఓపికతో ఉండాలని పోస్ట్ చేశారు. ఇది పరీక్షా సమయమని, సహనం కోల్పోయి మాట్లాడినా, పోస్టులు పెట్టినా దర్శన్‌కు ఇబ్బంది కలుగుతుందన్నారు. అభిమానుల అంతరంగాన్ని మీ తరపున దర్శన్‌కు వివరించాను. కోర్టులపై నమ్మకం ఉంచి న్యాయ పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

శివమొగ్గ: శివమొగ్గ నగర సమీపంలో ఉన్న స్లాబైలు లేఔట్ మీదుగా వెళ్లిన జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేస్తు స్థానికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ మార్గంలో ముఖ్యంగా బైపాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రమాదాలను అరికట్టడంతో పూర్తిగా విఫలమవుతున్నారని నినాదాలు చేస్తూ జాతీయ రహదారిలో ధర్నా నిర్వహించారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, దీంతో ప్రమాదాలు పెరిగాయన్నారు. ప్రమాదాల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూరజ్‌కు ఆరోగ్య పరీక్షలు

బనశంకరి: అసహజ లైంగిక దాడి కేసులో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణకు బౌరింగ్ ఆసుపత్రిలో వైద్యులు మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కేసులో లైంగిక పటుత్వ పరీక్షలకు, వైద్య పరీక్షలకు 42వ ఏసీఎంఎం కోర్టు అనుమతిచ్చిన నేపథ్యంలో బుధవారం సీఐడీ పోలీసులు బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు సూరజ్‌కు జనరల్ చెకప్ చేసి పంపించారు. ప్రత్యేక మెడికల్ టెస్ట్‌కు వైద్యులు నిరాకరించారు.

వెళ్లి హైకమాండ్‌తో మాట్లాడండి

- నేతలపై డీకేశి ఆగ్రహం

బనశంకరి: మరిన్ని డిప్యూటీ సీఎం పదవుల గురించి మీడియా ముందు మాట్లాడే వ్యక్తులు హైకమాండ్ నేతలు వద్దకు వెళ్లి మాట్లాడాలని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ సొంత పార్టీ నేతలపై మండిపడ్డారు. గురువారం విధానసౌధ వద్ద విలేకరులు అదనపు డీసీఎం గురించి ప్రస్తావించగా డీకే స్పందిస్తూ ఎవరైనా హైకమాండ్ వద్దకు వెళ్లి పరిష్కరించుకుని రావాలని తెలిపారు. కేపీసీసీ అధ్యక్ష స్థానం మార్పును మంత్రి రాజణ్ణ లేవనెత్తారనగా, చాలా సంతోషం, సమయం వృథా చేయరాదన్నారు. కెంపేగౌడ జయంతికి దేవేగౌడ, కుమారస్వామికి ఆహ్వానం పలకలేదని చెప్పగా, ప్రోటోకాల్ ప్రకారం తుమకూరు, బెంగళూరు గ్రామాంతర, బెంగళూరు నగర పరిధిలోని ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానం పంపారని తెలిపారు. కుమారస్వామి మండ్యలో, దేవేగౌడ హాసన్‌లో ఉన్నారని, వచ్చే ఏడాది ఇలాంటి తప్పులు జరగకుండా సరిదిద్దుతామని తెలిపారు.

మైసూరులో కెంపేగౌడ జయంతి వేడుకలు



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరు నగరంలో వివిధ చోట్ల పలు సంఘాల ఆధ్వర్యంలో నాడప్రభు కెంపేగౌడ జయంతిని కోలాహలంగా నిర్వహించారు. కోటె ఆంజనేయ స్వామి ఆలయం ముందు జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో కెంపేగౌడ చిత్రపటానికి ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. కళాబృందాల ప్రదర్శనల మధ్య ఊరేగింపు సాగింది. జీవధార రక్తనిధి బృందం సభ్యులు కెంపేగౌడ జయంతి సందర్భంగా 2 వేల మందికి ఓళిగలను పంపిణీ చేశారు. రాత్రికి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

లారీ, టిప్పర్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రాయచూరు రూరల్: లారీ, టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన నగర శివార్లలోని పవర్ గ్రిడ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను లారీ అదుపు తప్పి ఢీకొనడంతో లారీ డ్రైవర్ రాజావలిసాబ్(45) కాలు విరిగింది. అతనిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

రూ.2.36 లక్షలతో గుమాస్తా పరారీ

హుబ్లీ: వ్యాపార లావాదేవీలకు సంబంధించిన నగదు రూ.2.36 లక్షలను ఫలాన వ్యక్తికి ఇచ్చి రావాలని పంపించిన అంగడి గుమాస్తా ఆ డబ్బుతో సహా పరారైన ఘటన గంటికేరి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. శీలవంతవీధి కిరాణి వ్యాపారి రవీంద్ర రాజపురోహిత్ గుమాస్తాను నమ్మి మోసపోయిన వ్యక్తి. నిందితుడు శ్యాంసుందర్ ఆ యజమాని అంగడిలో గత నాలుగైదేళ్ల నుంచి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న యజమాని రవీంద్ర అలగుండగి వీధిలో ఉన్న వ్యక్తి డబ్బులు ఇచ్చి రావాలని రూ.2,36,120లతో పాటు తన బైక్‌ను ఇచ్చి పంపాడు. అయితే సదరు గుమాస్తా బైక్‌ను అదే వీధిలో రోడ్డు పక్కన పార్క్ చేసి డబ్బుతో సహా పరారయ్యాడు.

చాపకింద నీరులా డెంగీ

- నానాటికీ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- హావేరి జిల్లాలో లక్షణాలతో ఓ మహిళ మృతి
- ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రత్యేక సమీక్ష సమావేశం



డెంగీ జ్వరం వ్యాప్తికి కారణమయ్యే దోమ కాటు



సమావేశంలో మాట్లాడుతున్న తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్

సాక్షి,బళ్లారి: వర్షాకాలం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో ఆయా జిల్లాల్లో వర్షం నీరు నిలవడంతో పాటు మురుగునీరు డ్రైనేజీల్లో దుర్వాసన వెదజల్లుతుండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో డెంగీ, మలేరియా తదితర జ్వరాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. రక్త పరీక్ష కేంద్రాలు నిండుగా జనంతో నిండిపోతూ రక్త పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరిగిపోతోంది.

ఆస్పత్రుల్లో రోగుల హాహాకారాలు

ఉత్తర కర్ణాటకలోని బళ్లారి, బీదర్, కొప్పళ, బాగల్‌కోటె, హావేరి తదితర జిల్లాల్లో డెంగీ బాధితుల సంఖ్య పెరిగిపోయి ఆయా ఆస్పత్రుల వద్ద ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. హావేరి జిల్లాలోని హానగల్ తాలూకా నరేగల్ గ్రామానికి చెందిన గౌసియా(30) అనే మహిళ డెంగీ జ్వరంతో బాధపడుతూ మృతి చెందడం కలకలం రేపింది. మూడు రోజులుగా హావేరి నగరంలోని మల్లాడద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందడంతో అధికారులతో పాటు పాలకులు అప్రమత్తమయ్యారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా డెంగీ జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన తర్వాత సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక చర్యలకు ఆదేశం

రాష్ట్రంలో డెంగీ, మలేరియా జ్వర పీడితులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డెంగీ జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన చికిత్స అందించేందుకు వైద్యులు చొరవ తీసుకుంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాలు, నగరాలు, పట్టణాల్లో అపరిశుభ్రతతో డెంగీ జ్వరం వచ్చేందుకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే స్వచ్ఛభారత్ కాని ఆచరణలో మాత్రం చూపకపోవడంతో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయి జ్వరాలకు కారణం అవుతున్నాయని చెప్పవచ్చు.

డెంగీ కట్టడికి సహకరించండి

రాయచూరు రూరల్: తాలుకా వ్యాప్తంగా ప్రబలుతున్న డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్ సూచించారు. గురువారం నగరంలోని మడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలను జాగ్రత్తపరచాలన్నారు. వానాకాలంలో ఇంటి ముందు శుభ్రతను పాటించాలని తెలపాలన్నారు. దోమల నియంత్రణకు గ్రామ స్థాయిలో ఫాగింగ్, బ్లీచింగ్ వంటివి చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారిణి సుష్మా పాటిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కెంపేగౌడ జయంతిలో వివాదం లేదు: సీఎం

బనశంకరి: నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి సందర్భంగా గురువారం విధానసౌధ ఆవరణలో విగ్రహానికి సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రధాని హెచ్‌డీ.దేవేగౌడ, కేంద్రమంత్రి హెచ్‌డీ.కుమారస్వామిలను పిలవలేదనే వివాదంపై సీఎం మాట్లాడుతూ ఇందులో డిప్యూటీ సీఎం రాజకీయం చేయలేదని, అధికారులు ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమం రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కృష్ణబైరేగౌడ, శివరాజ తంగడగి, కేహెచ్.మునియప్ప, ఎమ్మెల్సీ నాగరాజయాదవ్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరులో గురువారం తెల్లవారుజామున కరెంట్ వైర్ తగిలి ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి చెందిన ఘటన నగరంలోని రోసారియోలో జరిగింది. మృతులను సకలేశపురకు చెందిన దేవరాజ్ (51), ఉప్పినంగడి రామకుంజకు చెందిన రాజు (41)లుగా గుర్తించారు. ఆటోను కడగడానికి వెళ్లిన దేవరాజ్‌కు కరెంట్ వైర్ తగిలింది. ప్రమాదాన్ని గుర్తించిన అతని స్నేహితుడు రాజు కాపాడబోయి అతను కూడా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. భారీగా వర్షం వస్తుండటంతో ఎవరూ బయటకు రాకపోవడంతో గురువారం ఉదయం విషయం వెలుగు చూసింది. మృతులిద్దరూ రోసారియోలో అద్దె ఇంటిలో ఉంటున్నారు.

బస్సును ఢీకొన్న కారు

రోడ్డు పక్కన నిలిపి ఉన్న బస్సును కారు ఢీకొన్న ఘటన ఉడుపి నిట్టూరు జాతీయ రహదారిలో గురువారం ఉదయం జరిగింది. కారును డ్రైవర్ కుందాపుర షోరూం నుంచి మంగళూరు షోరూంకు తీసుకెళ్తుండగా ప్రైవేట్ బస్సును ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఉడుపి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మండ్యలో మరొకరు..

మండ్య: వ్యవసాయ పొలంలో కరెంట్ వైరు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండ్య జిల్లా పాండవపుర తాలూకా అమృతి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమార్ (40) మృతుడు. ఉదయం పొలం పనుల్లో ఉండగా కింద పడి ఉన్న కరెంట్ వైర్ తొక్కడంతో షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి జల సంరక్షణ మేళా



వాటర్ ఎక్స్‌పో మేళాలో నీటి సంరక్షణపై వివరిస్తున్న నిర్వాహకుడు రాజేశ్

బనశంకరి: కలుషితనీటిని సంస్కరణ, పునః వినియోగం గురించి ప్రజలను, వ్యాపారవేత్తలను జాగృతం చేయడం కోసం వాటర్ ఇండియా కంపెనీ మూడురోజుల పాటు జాతీయస్థాయి జలసంరక్షణ మేళా ఏర్పాటు చేసింది. గురువారం నగరంలో మాన్యతా టెక్‌పార్కు వద్ద వాటర్ ఇండియా కంపెనీ మ్యాన్‌పో కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు నిర్వహించే వాటర్ ఎక్స్‌ను నిర్వాహకుడు రాజేశ్ ప్రారంభించారు. వాటర్ ఎక్స్‌పో వేలాది మంది ప్రజలు, వ్యాపారవేత్తలు పాల్గొని వీక్షించారు. మనం నిత్యం వాడే నీటి సేకరణ, సంస్కరణ చేయడం, భూగర్భ జలాలు పెంపు గురించి మేళాలో తెలుసుకున్నారు. కలుషిత నీటిని పునఃవినియోగం, శుద్ధీకరణ గురించి సుమారు 100కు పైగా నీటి శుద్ధీకరణ చేసే దేశ విదేశాలకు చెందిన కంపెనీలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఎక్స్‌పో 29 తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకుడు రాజేశ్ తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థులు దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మణప్పురం కర్ణాటక సేల్స్ మార్కెటింగ్ ప్రముఖుడు పెరుమాళ్ తెలిపారు. గురువారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థినులకు బ్యాగులు, స్యానిటరీ ప్యాడ్స్, ప్యాడ్ బర్నింగ్ మిషన్‌ను అందించి మాట్లాడారు. దేశంలోని మహానుభావులందరూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివినవారేనని తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరశురామ, ఉపన్యాసకులు నరసాపుర మంజునాథ్, మణప్పురం రితి జ్యువెల్లర్స్ పవన్, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కెంపేగౌడ జయంతి



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

శ్రీనివాసపురం : పట్టణంలోని కెంపేగౌడ 514వ జయంతి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి కెంపేగౌడ పల్లకీల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కెంపేగౌడ ఎంతో దూరదృష్టితో అన్ని సముదాయాలను దృష్టిలో ఉంచుకుని బెంగళూరు నగరాన్ని నిర్మించారన్నారు. చెరువులను తవ్వించి నీటి సమస్య రాకుండా చూశారన్నారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఎంపీ మల్లేష్‌బాబు సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తానన్నారు. యువతకు ఉద్యోగాలిప్పిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీంద్ర, ఈఓ ఏఎస్ రవి, బీఈఓ బీసీ మునిలక్ష్మయ్య, పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్టణ ఉప ఎన్నిక..

- బరిలో డీసీఎం కుమార్తె ?



తండ్రి, చిన్నాన్నలతో ఐశ్వర్య

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ ఉప ఎన్నికలో కాంగ్రెస్, కూటమి నుంచి అభ్యర్థులు ఎవరనేది రోజురోజుకీ కుతూహలం పెరిగిపోతోంది. అయితే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగి తననే అభ్యర్థిగా భావించి అభ్యర్థి ఎవరైనా గెలిపించాలని కోరుతుండడంతో అభ్యర్థి ఎవరనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే శివకుమార్ గారాలపట్టి ఐశ్వర్యను బరిలో దించుతారనే వార్త వినిపిస్తోంది. చెన్నపట్టణకు ఎప్పుడోకాని వెళ్లని డీకే శివకుమార్ సొంత నియోజకవర్గంలో పర్యటించినట్టు జనస్పందన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వందల కోట్ల తాయిలాలు ప్రకటిస్తున్నారు. అప్పుడే అనేకమందికి అనుమానం కలిగింది. ఈసారి ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థి కచ్చితంగా డీకే శివకుమార్‌కు బాగా కావాల్సిన వారే అవుతారని. ఇన్నాళ్లు డీకే శివకుమార్‌కు సంబంధించిన వ్యాపార వ్యవహారాలు చూసుకుంటున్న ఐశ్వర్యను తండ్రి రాజకీయాల్లోకి తీసుకువస్తారా? తీసుకువస్తే ఆమె ఎంతవరకూ సక్సెస్ కాగలదు అనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

వారం వడ్డీ కట్టలేక ఆత్మహత్య



పర్వీజ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: వారం వడ్డీ కట్టలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన దొడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వినాయక నగర్ నివాసి పర్వీజ్ (45) ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి. బైక్ సర్వీస్ గ్యారేజ్ నడుపుకుంటూ జీవిస్తున్న పర్వీజ్ కుటుంబ అవసరాలకు వారం వడ్డీ కింద అప్పు తీసుకున్నాడు. సంపాదించినదంతా వడ్డీలు కట్టడానికే సరిపోకపోవడంతో కలత చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.దొడ్డబళ్లాపుర పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలులోని డస్ట్‌బిన్‌లో శిశువు మృతదేహం

దొడ్డబళ్లాపురం: రైలులోని డస్ట్‌బిన్‌లో నవజాత మగ శిశువు లభించిన సంఘటన బెంగళూరులో వెలుగు చూసింది. భువనేశ్వర్ నుండి బెంగళూరుకు వచ్చిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న డస్ట్‌బిన్‌లో నవజాత శిశువు లభించింది. రైలు యలహంక రైల్వేస్టేషన్‌లో ఆగి ఉండగా రైల్వే స్వచ్ఛతా సిబ్బంది శుభ్రం చేస్తుండగా డస్ట్‌బిన్‌లో నవజాత మగ శిశువు కనిపించింది. పురిటిబిడ్డను గుడ్డతో చుట్టి డస్ట్‌బిన్‌లో వదిలి వెళ్లారు. ఊపిరి ఆడక శిశువు మృతి చెందింది. యశ్వంతపూర్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కోలారు వార్తలు...

టెన్త్ టాపర్‌కు రూ.లక్ష బహుమతి



విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : ఈసారి టెన్త్ పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచే విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి అందిస్తామని ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు, సమాజ సేవకుడు వి.మోహన కృష్ణ తెలిపారు. గురువారం నగరంలోని వాణి పాఠశాల విద్యార్థులకు తమ ఫౌండేషన్ నుంచి ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా తాలూకా టాపర్‌గా నిలిచే విద్యార్థికి రూ.25 వేల నగదు బహుమతిని అందజేస్తామన్నారు. తాలూకాలో ఉన్న సుమారు 160కి పైగా ప్రభుత్వ పాఠశాలలు, 60కి పైగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందిస్తామన్నారు. తాలూకాలో ఏ ఒక్క పేద విద్యార్థి విద్యావంచితుడు కారాదనే ఉద్దేశంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను తమ ఫౌండేషన్ నుంచి అందిస్తున్నామన్నారు.

లబ్ధిదారులకు బీమా పంపిణీ



బీమా పరిహారం సొమ్మును అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణంలోని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సంస్థ కార్యాలయంలో తాలూకాలోని 15 మంది లబ్ధిదారులకు రూ.1.08 లక్షల ఆరోగ్య రక్షా బీమా మొత్తాన్ని పంపిణీ చేశారు. తాలూకా ప్రణాళికాధికారి ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ వ్యక్తి అనారోగ్యం పాలైనప్పుడు మానసికంగా, ఆర్థికంగా ఎంతో దెబ్బ తినాల్సి వస్తుందన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యం అనే నానుడికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సంస్థ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. సంస్థ అధికారులు ఆనంద్, మనీషా, తాలూకా నోడల్ అధికారి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కెంపేగౌడ



ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే రూపా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



ప్రతిమ ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులు

మాలూరు: నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి వేడుకలను గురువారం వేడుకగా నిర్వహించారు. పట్టణంలోని బాలాజీ సర్కిల్ ప్రాంగణంలో జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా ఒక్కలిగుల సంఘం ఆధ్వర్యంలో నాడప్రభు కెంపేగౌడ జయంతిని ప్రారంభించి ఎమ్మెల్యే కేవై నంజేగౌడ మాట్లాడుతూ కెంపేగౌడ ఏదో ఒక సముదాయానికి పరిమితమైన వ్యక్తి కాదన్నారు. రాష్ట్రంలోని అన్ని సముదాయాలు కెంపేగౌడ జయంతిని ఆచరించడం ద్వారా ఆయనను గౌరవిస్తున్నారన్నారు. తాలూకాలో అన్ని సముదాయాల వారు పార్టీలకతీతంగా జయంతిని ఆచరిస్తున్నారన్నారు. తాలూకాలోని 28 గ్రామ పంచాయతీలు, ఒక్కలిగ సముదాయం ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన పల్లకీలో ప్రతిమను పట్టణంలో ఊరేగించారు. తహసీల్దార్ కె.రమేష్, టీపీ ఈఓ కృష్ణప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మునేగౌడ, పురసభ ముఖ్యాధికారి ప్రదీప్‌కుమార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్‌లో...

కేజీఎఫ్ : నాడప్రభు కెంపేగౌడ 515 వ జయంతిని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొని ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ కెంపేగౌడ ఆదర్శాలు, సిద్ధాంతాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయంగా ఉన్నాయన్నారు. కెంపేగౌడ దూరదృష్టితో నిర్మించిన బెంగళూరు నేడు విశ్వ వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిందన్నారు. కెంపేగౌడ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో రైతులు సుభిక్షంగా ఉండాలని 25 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఎంసీ మార్కెట్ యార్డును నిర్మిస్తున్నామన్నారు. 873 ఎకరాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామికవాడను నిర్మిస్తున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన, ఉత్తమ రైతులను సన్మానించారు. తహసీల్దార్ నాగవేణి, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు ఆ ము లక్ష్మీనారాయణ, ప్రదీప్‌గౌడ పాల్గొన్నారు.

వైభవంగా కెంపేగౌడ జయంతి

కోలారు: నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహం వద్ద నుంచి తాలూకాలోని వివిధ పంచాయతీల నుంచి వచ్చిన కెంపేగౌడ చిత్రపటాలు కలిగిన పల్లకీల ఊరేగింపును ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ ప్రారంభించారు. దాదాపు 100కు పైగా పల్లకీలు నగరంలోని ప్రధాన వీధుల గుండా సంచరించి చెన్నయ్య రంగమందిరం వద్దకు చేరాయి. రంగమందిరంలో సాయంత్రం 5 గంటలకు వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాధికారి అక్రం పాషా మాట్లాడుతూ కెంపేగౌడ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయేలా బెంగళూరును నిర్మించారన్నారు. సమాజానికి కెంపేగౌడ అందించిన సేవలు అపారమన్నారు. కెంపేగౌడ అన్ని సముదాయాల వారు ఒకటే భావించి సామాజిక సేవలు అందించిన మహనీయుడన్నారు. అన్ని సముదాయాల వారికి వారి వృత్తులకు అనుగుణంగా బజారులను నిర్మించి తన దూరదృష్టిని చాటారన్నారు. టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్, ఒక్కలిగ సంఘం నాయకుడు కేవీ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

దళపతులను ఆహ్వానించలేదని ఘర్షణ

కోలారు: నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ప్రధాని దేవేగౌడలకు ఆహ్వానం పంపలేదని జేడీఎస్ కార్యకర్తలు గురువారం నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరం వద్ద కెంపేగౌడ చిత్రపటాల ఊరేగింపు సమయంలో ఘర్షణకు దిగారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా జేడీఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్‌ల ఎదుటే కాంగ్రెస్, జేడీఎస్ కార్యకర్తలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వేదిక కార్యక్రమంలో కూడా కుమారస్వామి, దేవేగౌడల పేర్లు చెప్పాలని జేడీఎస్ కార్యకర్తలు పట్టుబట్టారు. వేదికపై ఉన్న ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ కిందికి దిగి వచ్చి మీరిక్కడకు రాజకీయాలు చేయడానికి వచ్చారా? నాకు కూడా రాజకీయాలు చేయడం తెలుసు, చూస్తారా? అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్, జేడీఎస్ కార్యకర్తల మధ్య గొడవ పెద్దదై పరస్పరం తోసుకున్నారు. మధ్యలో కలుగజేసుకున్న ఆదిచుంచనగిరి చిక్కబళ్లాపుర మఠం మంగళానంద స్వామీజీ మీరిలా పరస్పరం గొడవ పడితే అది కెంపేగౌడను అవమానించినట్లు అవుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్రానికి దేవేగౌడ, కుమారస్వామి అందించిన సేవలు అపారమన్నారు. ఇరు వర్గాలు శాంతించడంతో ఎట్టకేలకు వివాదం సద్దుమణిగింది.

అవకాశాల లబ్ధి పొందాలి



చెక్కును అందిస్తున్న సాహితీవేత్త నరసింహమూర్తి

మాలూరు: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాహితీవేత్త, హాస్య కళాకారుడు ఎంఎస్ నరసింహమూర్తి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెన్త్, కన్నడ సబ్జెక్ట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించడం కోసం తన తల్లిదండ్రుల పేరిట రూ.లక్ష చెక్కును అందించి మాట్లాడారు. సమాజం నుంచి పొందిన దాన్ని తిరిగి సమాజానికే అందించినప్పుడే జీవితం సార్థకమవుతుందన్నారు. వ్యక్తి జీవితంలో ముందడుగు వేయడానికి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్ధ, ఆసక్తి, కఠిన శ్రమ ద్వారా విద్యార్థులు ఉత్తమ సాధన చేయవచ్చన్నారు. విద్యాలయాల్లో లభించే తృప్తి మరెక్కడా లభించదన్నారు. పురసభ మాజీ అధ్యక్షుడు సి.లక్ష్మీనారాయణ, పురసభ సభ్యుడు ఎంవి వేమన, మారికాంబ ఆలయ ట్రస్టు అధ్యక్షుడు సి.వెంకటేష్, రంగ విజయ అధ్యక్షుడు మాలూరు విజి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మారమ్మకు ప్రత్యేక అలంకరణ



బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ పరంగిపాళ్య గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారమ్మదేవికి గురువారం ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు వినయ్‌కుమార్ అమ్మవారికి తెల్లవారుజామునే అభిషేకం, విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బార్‌లో యువకుడు హత్య

బనశంకరి: బార్‌లో కూర్చుని మద్యం సేవిస్తుండగా గొడవ జరిగి యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బన్నేరుఘట్ట హర్షవర్ధన్ (35) హతుడు. కల్కెరే నైట్‌సఫారి బార్‌లో మద్యం తాగుతుండగా, పక్కనున్న వారిని చూశాడు. వారు కూడా గుర్రుగా చూడడంతో పాటు తమవైపు ఎందుకు చూస్తున్నావు అంటూ గొడవపడ్డారు. గొడవ తీవ్రస్థాయికి చేరడంతో మద్యం బాటిల్‌తో హర్షవర్ధన్ తలపై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బన్నేరుఘట్ట పోలీసులు చేరుకుని ఒకరిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారయ్యాడు.

వాహనాలపై రాళ్లు రువ్విన ఆకతాయి



ధ్వంసమైన కారు అద్దాలు

దొడ్డబళ్లాపురం: ఇంటి బయట రోడ్డుపక్కన నిలిపి ఉన్న వాహనాలపై ఆకతాయి రాళ్లు రువ్వడంతో పలు వాహనాలు ధ్వంసమైన సంఘటన బ్యాటరాయనపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మైసూరు రోడ్డులో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఆకతాయి రోడ్డుపక్కన నిలిపి ఉన్న బైక్‌లు, కార్లపై పెద్దపెద్ద రాళ్లు తీసుకుని విసరడంతో అద్దాలు, లైట్లు ధ్వంసమయ్యాయి. ఖరీదైన 8 కార్లు, పలు బైక్‌లు ధ్వంసమయ్యాయి. తాగిన మైకంలో ఆకతాయి ఇలా చేసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ట్యానీ రోడ్డులో కుంగిన భూమి



కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని నాగవార ట్యానీ రోడ్డులో భూమి ఒక్కసారిగా కుంగిపోయిన ఘటన చోటుచేసుకుంది. అక్కడి సమీపంలో మెట్రో పనులు జరుగుతుండటంతో నీరు మొత్తం రోడ్డుపై నిలిచిపోవడంతో రోడ్డు మధ్యలో కుంగిపోయింది. విషయం తెలుసుకున్న బీఎంఆర్‌సీఎల్ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

పైప్‌లైన్ పనులు షురూ




ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్ళి నియోజకవర్గం పరిధిలోని జరగనహళ్ళి వార్డు మంజునాథ్ గార్డెన్ లేఔట్ ప్రజలకు త్వరలో కావేరి నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం కావేరి పైప్‌లైన్ అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే బొమ్మనహళ్ళి నియోజకవర్గంలో 98 శాతం మందికి తాగునీటిని అందిస్తున్నట్లు చెప్పారు. మరి కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తయి కావేరి నీరు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ శోభా, మునిరాము, వెంకటస్వామి, అధికారులు పాల్గొన్నారు.


యువకుడిపై పోక్సో కేసు

మైసూరు: ప్రేమ పేరుతో బాలికను మోసగించిన యువకుడిపై పోలీసులు పోక్సో నమోదు చేశారు. వివరాలు.. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బీ నూరలకొప్ప గ్రామానికి చెందిన సుదీప్ (25), హెచ్‌కోటె తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి వశం చేసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లాడు. తల్లిదండ్రులు అంతరసంత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి నిందితుడిని గుర్తించి అతడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి బాధిత బాలికను బాలల మందిరంకు తరలించారు.

ప్రకృతి సోయగం బైందూరు బీచ్



బైందూరు తీరంలో పర్యాటకుల సందడి



బెలకతీర్థ జలపాతం



బైందూరు బీచ్‌లో అలల జోరు

- సూర్యోదయం, సూర్యాస్తమయాల వీక్షణకు ప్రసిద్ధి
- ఉడుపి జిల్లా కుందాపురలో ఆకట్టుకునే సాగర తీరం

బనశంకరి: బైందూరు బీచ్ అద్భుత సూర్యోదయ సూర్యాస్తమయ ప్రదేశాలకు ప్రసిద్ధి. బైందూరు ప్రదేశం కర్ణాటకలోని ఉడుపి జిల్లా కుందాపురలో కలదు. ఈ గ్రామంలో సోమేశ్వర దేవస్థానం ప్రసిద్ధి. దేవస్థానం సముద్రం ఒడ్డున ఒక అందమైన సెట్టింగ్ నిర్మాణ తరహాలో ఉంటుంది. బైందూరు అనేక పర్యాటక ఆకర్షణలు కలవు. బైందూరు బీచ్, బలక తీర్థ జలపాతాలు, క్షితిజ నేసరధామ, శనీశ్వరదేవస్థానం, మహాకాళి, శ్రీరామచంద్ర మందిరం. పర్యాటకులు సాధారణంగా ఈ బీచ్‌లో పూర్తిగా విశ్రాంతి పొందాలని, అద్భుత సూర్యాస్తమయాలు వీక్షించడానికి విచ్చేస్తారు. బైందూరు బీచ్ ఒక ప్రధాన ఆకర్షణ అందమైన సూర్యోదయ, సూర్యాస్తమ దృశ్యాలకు ప్రసిద్ధి.

బెలక తీర్థ జలపాతాలు

బెలక తీర్థ జలపాతాలు బైందూరు సమీపంలో కలవు. ఇది అందమైన ప్రాంతం కావడంతో అనేక మంది పర్యాటకులు తరలివస్తారు. జలపాతాలు కనువిందు చేస్తే చెవులు సైతం ఆ జలపాతాల హోరు ధ్వనికి పరవశిస్తాయి. ప్రకృతి ప్రియులకు ఫొటోగ్రాఫర్లకు స్వర్గధామం.

క్షితిజ నేసరధామ

క్షితిజ నేసరధామ ప్రదేశం సహజ ప్రకృతి అందాలతో తాటి, కొబ్బరిచెట్ల వరుసలతో హుందాగా సముద్రపు ప్రాంతాలను చూస్తూ ఒక చిన్న కొండపై ఉంటుంది. ఇక్కడ కొంత సమయం గడిపితే చాలు ఎంతో హాయిగా ఆహ్లాదకరంగా ఉంటుంది.

శనీశ్వర టెంపుల్

శనీశ్వరదేవస్థానం శనీశ్వరుడిని దర్శించుకునే నిమిత్తం అనేక మంది భక్తులు విచ్చేస్తారు. ఈ ప్రాంతంలో శనీశ్వర దేవస్థానం ప్రసిద్ధిచెందిన దేవాలయాల్లో ఒకటి.

మహాకాళి టెంపుల్

బైందూరులో మహాకాళి టెంపుల్ అతి పురాతనమైనది. మాతా కాళికాదేవి విగ్రహం అందంగా ఉంటూ భక్తులను ఆశీర్వదిస్తుంది.

సోమేశ్వర దేవస్థానం

సోమేశ్వర దేవస్థానం ఇది లింగాకృతి గల శివుడి ఆలయం. బైందూరు బీచ్ సమీపంలో కలదు. ఇక్కడ భక్తులు, పూలు, పాలు, పెరుగు, నెయ్యి వంటి వాటితో లింగానికి అభిషేకం చేస్తారు.

శ్రీరామచంద్ర మందిర్

శ్రీరాముడి విగ్రహం గల శ్రీరామచంద్ర మందిర్ బయన్దూర్‌లో ఒక ప్రసిద్ధ ఆలయం. ఇక్కడకు పర్యాటకులు ఏడాదంతా తరలివస్తారు బైందూరుకు సమీపంలో మంగళూరు విమానాశ్రయం కలదు. ఇది సుమారు 121 కిలోమీటర్లు దూరం. విమానాశ్రయం నుంచి దేశవిదేశాలకు సైతం విమానాలు నడుస్తాయి. బైందూరు రైల్వేస్టేషన్ ఉండగా ఇక్కడ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరచుగా రైళ్లు నడుస్తాయి.



సంధ్యా సమయాన ఇసుక తెన్నెల్లో పర్యాటకులు



ఆహ్లాద పరిచే సాగర ఘోష



సోమేశ్వరం బీచ్‌లో ఉషోదయ అందాలు

బీబీఎంపీలో కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తుషార్ తదితరులు



కెంపేగౌడ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ తదితరులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ

బనశంకరి: నాడప్రభు కెంపేగౌడ జయంతి సందర్భంగా గురువారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయం ముందుభాగంలో కెంపేగౌడ విగ్రహం, కెంపేగౌడ కోడలు లక్ష్మీదేవి విగ్రహాలకు పాలనాధికారి ఎస్ఆర్. ఉమాశంకర్, కమిషనర్ తుషార్ గిరినాథ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక కమిషనర్లు మునీశ్‌మౌద్గిల్, సూరళ్కర్ వికాస్‌కిశోర్, శివానంద్ కల్కెరె, మంజునాథస్వామి, ప్రతిభ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మండ్యలో..

మండ్య: నాడప్రభు కెంపేగౌడను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మండ్య నగర సభ కమిషనర్ మంజునాథ్ అన్నారు. గురువారం మండ్య నగరసభ కార్యాలయంలో నిర్వహించిన కెంపేగౌడ జయంతి వేడుకల్లో పాల్గొని కెంపేగౌడ చిత్రపటానికి నివాళులర్పించారు.

యలహంకలో...

బనశంకరి: బెంగళూరు నగర నిర్మాత నాడప్రభు కెంపేగౌడ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం యలహంకలోని మినీ విధానసౌధ కెంపేగౌడ విగ్రహానికి యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్, యువనేత అలోక్ విశ్వనాథ్ ఘనంగా నివాళులు అర్పించారు. కెంపేగౌడ నిర్మించిన బెంగళూరు నగరం నేడు ఐటీబీటీ సిలికాన్ సిటీగా ఖ్యాతిఘడించిందని ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా కెంపేగౌడ వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది.

బాగేపల్లిలో ..

బాగేపల్లి: నాడప్రభు కెంపేగౌడ ముందు చూపు వల్ల బెంగళూరు నగరం నేడు ఎంతో అభివృద్ధి సాధించిందని బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల పాఠశాలలో కెంపేగౌడ జయంతి వేడుకలో ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు నగర నిర్మాతగా పేరు పొందిన కెంపేగౌడ వందలాది చెరువులు అభివృద్ధి చేశారని అన్నారు.

చింతామణిలో:

నాడప్రభు కెంపేగౌడను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి సుధాకర్ అన్నారు. కెంపేగౌడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లలో కెంపేగౌడ చిత్రపటాలను ఊరేగించారు. అంతకు ముందు వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్, ఈఓ ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.

కేఆర్ పురంలో...:

కృష్ణరాజపురం: నాడప్రభు కెంపేగౌడ జయంతి వేడుకలను హోసకోటె పట్టణంలో ఘనంగా నిర్వహించారు. హోసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొని పట్టణంలోని కేఈబీ సర్కిల్‌లో ఉన్న కెంపేగౌడ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం పట్టణంలో కళాబృందాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది.

29 నుంచి సలాన్ ఛాయాచిత్ర ప్రదర్శన



బనశంకరి: యూత్ ఫొటోగ్రాఫిక్ బెంగళూరు, అంతర్జాతీయ సలాన్ -2024 ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను కనువిందు చేయనుంది. ఈ ప్రదర్శన శనివారం నుంచి రెండు రోజుల పాటు చిత్రకళా పరిషత్‌లో నిర్వహిస్తారు. అంతర్జాతీయ సలాన్ 2024 ఇటీవల నిర్వహించిన ఛాయాచిత్రాలు పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 206 మంది పోటీలో పాల్గొనగా సుమారు 2753 చిత్రాలు పంపించారు. అందులో 563 చిత్రాలను స్వీకరించి వాటిలో 60 ఛాయాచిత్రాలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. కలర్, మోనోక్రోమ్, నేచర్, ట్రావెల్ ప్రతి విభాగంలో ముగ్గురు విజేతలుగా నిలిచారు. ఉత్తమ ఛాయాచిత్రాలను శనివారం నుంచి చిత్రకళా పరిషత్‌లో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ఆదివారం ఉదయం 11 గంటలకు విజేతలకు పురస్కారాలు ప్రదానం చేస్తామని గురువారం సలాన్ అధ్యక్షురాలు అనితా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్నడనటి సుధాబెళవాడి, గౌరవ అతిథి డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ కమిషనర్ శశికుమార్ పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై 801 కేసులు

బనశంకరి: పశ్చిమ విభాగ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 801 కేసులు నమోదు చేశారు. వన్‌వేలో 332 కేసులు, నో పార్కింగ్‌లో 128, ఫుట్‌పాత్ పార్కింగ్ 16, నిర్లక్ష్య డ్రైవింగ్ 7, నిబంధనల ఉల్లంఘన 269, ఇలా మొత్తం 801 కేసులు నమోదు చేసి 2.41 లక్షల జరిమానా వసూలు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన దొడ్డ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

దొడ్డ పట్టణ నివాసి అయిన మారప్ప (45) రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి. దొడ్డ పట్టణ శివారులోని ముత్సంద్ర వద్ద రైల్వే పట్టాలపై మారప్ప మృతదేహం ఛిద్రమై లభించింది. అయితే మారప్ప ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసారా?అనే అనుమానాలు కలుగుతున్నాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి

బనశంకరి: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉద్దేశంతో జయనగరలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించామని మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి తెలిపారు. గురువారం జయనగర 9వ బ్లాక్ ఈస్ట్‌ఎండ్ రోడ్డులో పార్టీ నూతన కార్యాలయాన్ని బీబీఎంపీ మాజీ పాలనా విభాగంనేత ఎస్.నాగరాజుతో కలిసి సౌమ్యారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు, కార్యకర్తల సహకారంతో లోక్‌సభ ఎన్నికల్లో జయనగరలో అత్యధిక ఓట్లు సాధించామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలు జయనగరలో ప్రతి కుటుంబానికి అందించామన్నారు. ఎస్.నాగరాజు మాట్లాడుతూ... జయనగర కాంగ్రెస్ కంచుకోట గత ఎన్నికల్లో బీజేపీ కుట్రతో కాంగ్రెస్ ఓటమిపాలైందన్నారు. బీబీఎంపీ ఎన్నికల్లో జయనగర పరిధిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేస్తుందన్నారు.

కూతురు ప్రేమపెళ్లి.. తండ్రి ఆత్మహత్య

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో కూతురు ప్రేమ పెళ్లి చేసుకోవడంతో తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన గురువారం వెలుగు చూసింది. వివరాల మేరకు క్రిష్ణేగౌండపల్లి గ్రామానికి చెందిన పిల్లేగౌడ (45), డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి కూతురు అదే ప్రాంతానికి చెందిన ఓ యువకున్ని ప్రేమించి పెళ్లి చేసుకొంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన పిల్లేగౌడ పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఈ ఘటనపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

నష్టపరిహారం అందజేయాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న బాధిత బంధువులు

హోసూరు: సెప్టిక్ ట్యాంకర్ లారీపై చెట్టుకూలి మృతి చెందిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి ముందు బాధిత బంధువులు ఆందోళన చేపట్టారు. హోసూరు తాలూకా మత్తిగిరి సమీపంలోని యడేనల్లూరు వద్ద బుధవారం మధ్యాహ్నం సెప్టిక్ ట్యాంకర్ లారీపై మర్రిచెట్టు కూలడంతో ఏర్పడిన ప్రమాదంలో డ్రైవర్ మారప్ప, క్లీనర్ వెంకటేష్‌లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మర్రిచెట్టు కూలిపోయే స్థితిలో ఉందని, గత 15 రోజుల క్రితమే స్థానిక ప్రజలు రెవెన్యూ అధికార్లకు ఫిర్యాదు చేశారని, అధికార్ల నిర్లక్ష్యంతోనే రెండు ప్రాణాలు బలైపోయాయని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ హోసూరు ప్రభుత్వ ఆస్పత్రి ముందు పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకొన్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు.

వేడుకగా కెంపేగౌడ జయంతి



బొమ్మనహళ్లి: నాడప్రభు కెంపేగౌడ జయంతి వేడుకలను నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో ఉన్న కూల్ జాయింట్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. బొమ్మనహళ్లి కాంగ్రెస్ నాయకుడు ఉమాపతి శ్రీనివాస్‌గౌడ, ఎంఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం.ఆర్. రాఘవేంద్ర కెంపేగౌడ విగ్రహానికి పూలుహారం వేసి చిత్రపటానికి పూజలు చేశారు. శ్రీనివాస్ గౌడ మాట్లాడుతూ... హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో కెంపేగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, అదే సమయంలో ఈ లేఔట్‌కు కెంపేగౌడ పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీంద్రగౌడ, చిక్కన్న, వెంకటరమణప్ప, విజయలక్ష్మీ, ఆనంద్, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో నవజాత శిశువు మృతదేహం



తుమకూరు: తుమకూరు నగరంలోని రైల్వే స్టేషన్‌లో నవజాత శిశువు మృతదేహం లభించడం కలకలం రేపింది. రెండు రోజుల పసిబిడ్డను గుడ్డలో చుట్టి ఒకచోట ఉంచారు. ప్రయాణికులు విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పిల్లలను విక్రయించే ముఠానే ఇలా పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శిశువు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొబ్బరి మొక్కల పంపిణీ

మైసూరు: విశ్వవిద్యాలయం సీనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో సుమారు వెయ్యి రైతు కుటుంబాలకు టెంకాయ మొక్కలను అందజేశారు. రావెమదూరు మఠానికి చెందిన మోక్షపతి మహాస్వామి పాల్గొని మాట్లాడుతూ కొందమంది పుట్టిన రోజు వేడుకలను లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఘనంగా జరుపుకొంటారు, కానీ పరిసరాల సంరక్షణపై కనీస శ్రద్ధ చూపరని అన్నారు. పరిసర స్నేహి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో రూ. 71 లక్షలు స్వాహా

మైసూరు: సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. తాజాగా మైసూరుకు చెందిన ఇద్దరు బాధితులు రూ. 71 లక్షలు పోగొట్టుకున్నారు. వివరాలు...నగరంలోని కేఆర్ మోహల్లాకు చెందిన సంతోశ్‌కు షేర్ మార్కెట్‌కు సంబంధించి మెసేజ్‌ను పరిశీలించి వారి మొబైల్‌ను కాంటాక్ట్ చేశాడు. ఓ వ్యక్తి పరిచయం చేసుకుని షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో అతని మాటలు నమ్మిన సంతోశ్ రూ.7 లక్షల నగదు పంపించాడు. మరో కేసులో కెశరె ప్రాంతంలో ఉంటున్న యూసఫ్ బాధితుడు కూడా ఇదే విధంగా నమ్మి ఏకంగా రూ. 64 లక్షలు వారి ఖాతాలకు జమ చేశాడు. అనంతరం మోసపోయినట్లు గుర్తించి బాధితులు ఇద్దరు సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

హోసూరు వార్తలు..

హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం

- ముఖ్యమంత్రి హామీ



తీర్మానం నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

హోసూరు: పారిశ్రామికంగా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు గురువారం చెన్నైలో జరిగిన శాసనసభ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే స్టాలిన్ ప్రకటించారు. డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాలు హోసూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున పెట్టుబడి చేసి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని, ప్రధానంగా హోసూరు, క్రిష్ణగిరి, ధర్మపురి ప్రాంతాల్లో వాహన ఉత్పత్తులు ఎక్కువగా వెలిశాయని, ఈ ప్రాంతంలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు చేపడతామని, దీని వల్ల ఏడాదికి సుమారు 3 కోట్ల మంది ప్రయాణికులు లబ్ధిపొందడంతో పాటు హోసూరు, క్రిష్ణగిరి, ధర్మపురి ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. హోసూరు ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటును ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శరయు

హోసూరు: జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే దుష్ప్రయోజనాలపై చైతన్యం కల్పించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ శరయు అధ్యక్షత వహించి మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న పాఠశాలల్లో 8 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రతివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై చైతన్యం కల్పించాలని, ప్రతి పాఠశాలలోను 20 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని, పీటీఏ, ఎస్ఎంసీ సభ్యులతో కలిసి, ప్రత్యేక ఉపాధ్యాయున్ని నియమించి చైతన్య కార్యక్రమాలు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ప్రజలు ఎదుర్కొనే సమస్యలను వివరించాలని, క్రిష్ణగిరి జిల్లాను సంపూర్ణ మాదక ద్రవ్యాల నిర్మూలన జిల్లాగా తీర్చి దిద్దేందుకు సహకరించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 10581కు తెలియజేయాలని, లేకుంటే 6374000754 నంబర్‌కు వాట్సాప్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ తంగదురై, జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారిణి మహేశ్వరి, విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జమాబందీలో వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కార్యాలయంలో డీఆర్‌వో సాధనకురల్ అధ్యక్షతన జరిగిన జమాబందీ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తహసీల్దార్ పరిమేల్ అళగన్ నేతృత్వంలో తాలూకాలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని ఇళ్లపట్టాలు, పటాట్విభజన, కుల ధ్రువీకరణ పత్రాలు, వృద్ధాప్య పెన్షన్, పట్టామారిడి, వారిసు సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ కోరుతూ వినతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌దాస్, కెలమంగలం రెవెన్యూ అధికారి మునియప్ప, గ్రామాధికారి మంజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పై చదువులు ఇష్టం లేక..

క్రిష్ణగిరి: ప్లస్‌టూ పాసైన కొడుకు పైచదువులు చదవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేయగా అతడు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొన్న ఘటన సింగారపేట వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా సింగారపేట సమీపంలోని పావకల్ గ్రామానికి చెందిన ధర్మలింగం కొడుకు శశికుమార్ (18) ప్లస్టూ పూర్తి చేశాడు. ఇంక చదువులు చాలనుకున్నాడు. కానీ పై చదువులు చదవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శశికుమార్ గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సింగారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇళ్ల కోసం గ్రామసభలు

కెలమంగలం: కరుణానిధి గృహవసతి పథకం ద్వారా ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించేందుకు నేడు గురువారం అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ప్రత్యేక గ్రామసభ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, స్థానిక ప్రజలు పాల్గొని దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కెలమంగలం సమితిలోని అన్ని గ్రామపంచాయతీల్లోనూ గ్రామసభ సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

క్లుప్తంగా...

రాళ్లతో కొట్టి.. ప్రాణం తీసిన టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాష్టీకం


ఎరికలయ్య (ఫైల్)

పుట్లూరు: దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పాపానికి టీడీపీ నాయకులు బండరాళ్లతో కొట్టి వైఎస్సార్‌సీపీ నాయకుడి ప్రాణం తీసిన ఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కోమటిగుంట్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 18న కోమటికుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మనోహర్, విశ్వనాథ్, శేఖర్ తదితరులపై టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన యాదవ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్య (55) టీడీపీ నాయకుల్ని అడ్డుకున్నారు. 'ఇళ్ల వద్దకు వచ్చి దౌర్జన్యం చేయడం ఏమిటి.. ఎందుకయ్యా మీకు ఇంత దౌర్జన్యం' అని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన టీడీపీ నాయకులు 'మాకే అడ్డు చెబుతావా' అంటూ బండరాళ్లతో అతడిని తీవ్రంగా కొట్టారు. ఎరికలయ్య తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబీకులు అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయించారు. తీవ్ర గాయాల నుంచి కోలుకోలేక ఎరికలయ్య గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుల్లమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా.. ఈ ఘటనపై పుట్లూరు పోలీసులు టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన 16 మందిపై కేసు నమోదు చేశారు.

రెచ్చిపోయిన టీడీపీ మూకలు

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి

ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విజయోత్సవ ర్యాలీలో టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో ఉన్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు నివాసంపై బుధవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. రాజరాజేశ్వరి కథనం ప్రకారం.. ఎమ్మెల్యే సత్యప్రభ విజయోత్సవ ర్యాలీ మెయిన్ రోడ్డులో సాగుతుండగా కొందరు టీడీపీ కార్యకర్తలు రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి ప్రధాన గేటు గ్రిల్ నుంచి పొగబాంబు విసిరారు. బాంబుల దండ గేటుకు కట్టి పేల్చారు. ఇంటి లోపలకు కోడిగుడ్లు, రాళ్లు, కొబ్బరి కాయలు, గాజు సీసాలు విసిరారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ మూకలను అడ్డుకున్నారు. ఈ ఘటనపై జెడ్పీటీసీ రాజరాజేశ్వరి, బెహరా అన్నపూర్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేత వెలుగుల నాని ఆధ్వర్యంలో అల్లరి మూకలు తమను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా చంపుతామని బెదిరించి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెలుగుల గోపి, వెలుగుల నాని, దూలి, వాల్లన్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్ జగన్ సీఎం కాలేదని ఆవేదనతో మృతి


సుధాకర్‌రెడ్డి (ఫైల్)

లింగాల: వైఎస్సార్ జిల్లా లింగాల మండలం దిగువపల్లెకి చెందిన సుధాకర్‌రెడ్డి (55) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు..సుధాకర్‌రెడ్డి పులివెందులలో వైఎస్ జగన్‌ను ఇటీవల కలిశాడు. వైఎస్ జగన్ సీఎం కాలేదని తీవ్ర మనోవేదనకు గురయ్యారని, ఈ క్రమంలో బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడని తెలిపారు. సుధాకర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్‌గా, వైఎస్సార్‌సీపీ నేతగా వ్యవహరించారు.

కూటమి డ్రామాలిక కట్టిపెట్టండి

సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): స్టీల్‌ప్లాంట్ విషయంలో డ్రామాలు పక్కన పెట్టి ప్రైవేటీకరణ జరగకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సిటూ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరీ స్టీల్‌ప్లాంట్ విషయంలో స్టీల్ శాఖ మంత్రికి రిప్రజెంటేషన్ ఇచ్చి చేతులు దులుపుకుని.. ప్రధానమంత్రికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వలేదని పేరు చెప్పి, ముడిసరుకు కొనుగోలుకు ఇవ్వడం లేదని తప్పుడు మాటలు చెప్పడం దారుణమన్నారు. విశాఖలోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ రూ.250 కోట్లకు అమ్మకానికి పెట్టారని, ఇది స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా అమ్మాలనే నిర్ణయంలో భాగమేనని చెప్పారు. నూతన ప్రభుత్వ వైఖరిలో ఏ మాత్రం మార్పు లేదని, సెయిల్‌లో కలపాలని కేంద్ర ప్రభుత్వం తక్షణమే కేబినెట్‌లో నిర్ణయం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

ఆగని అరాచకం

తిరుపతిలో రహదారి శిలాఫలకం ధ్వంసం

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఇరువాడలోనూ ఇదే తంతు
- వైఎస్సార్ జిల్లా నల్లచెరువులో జగన్ ఫొటోపై టీడీపీ ప్రతాపం

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయి ఘర్షణల్ని కొనసాగిస్తున్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది దౌర్జన్యం చేయడానికే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లడై 20 రోజులు దాటినా టీడీపీ నేతలు, కార్యకర్తలు విధ్వంసకాండ ఆపకపోవడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. బుధవారం రాత్రి, గురువారం సైతం శిలాఫలకాల ధ్వంసం వంటి ఘటనలు కొనసాగాయి.

తిరుపతిలో ఆగని విధ్వంసం

తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్డు శిలాఫలకాన్ని బుధవారం రాత్రి టీడీపీ నేతలు ధ్వంసం చేశారు.


తిరుపతి సత్యనారాయణపురం సర్కిల్ వద్ద టీడీపీ నేతలు ధ్వంసం చేస్తున్న విరజా మార్గం శిలాఫలకం


ఇరువాడ సచివాలయం శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తిరుపతి అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 22 రోడ్లను నిర్మించారు. ప్రతి మాస్టర్ ప్లాన్ రోడ్డుకు కవులు, మహనీయుల పేర్లు పెట్టారు. అందులో భాగంగానే తిరుపతి జీవకోన ప్రధాన మార్గంలోని సత్యనారాయణపురం మాస్టర్ ప్లాన్ రోడ్డుకు 'విరజా మార్గం'గా నామకరణం చేసి అక్కడ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు రెచ్చిపోయి అభివృద్ధి శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన టీడీపీ నేతలు ఇలా కక్ష సాధింపులకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ చర్యతో ఇరువాడలో ఉద్రిక్తత

సచివాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలను ఎందుకు పెట్టలేదంటూ సచివాలయ సిబ్బందిపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేసి శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ఘటన అచ్యుతాపురం మండలం ఇరువాడలో గురువారం చోటుచేసుకొంది. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గునపాలతో శిలాఫలకాలు ధ్వంసం చేసి పెకలించడంతో సచివాలయ సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయి. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఈ ఘటనకు పాల్పడంతో వీడియోల ఆధారంగా సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో అల్లర్లు చెలరేగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ జగన్ ఫొటో ధ్వంసం

వైఎస్సార్ జిల్లా నల్లచెరువుపల్లె రైతు భరోసా కేంద్రం భవనంపై నవరత్నాలు పేరుతో ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఫొటోను రాళ్లతో పగులగొట్టారు. కావాలనే టీడీపీ కార్యకర్తలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



రైతు భరోసా కేంద్రంపై వైఎస్ జగన్ ఫొటోను పగులగొట్టిన టీడీపీ కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ యువనేతపై హత్యాయత్నం

- బీరు సీసాలు, మారణాయుధాలతో దాడి
- పాకాలలో చిత్తూరు రౌడీ గ్యాంగ్ బీభత్సం
- చంద్రగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ అరాచకాలు


గాయపడ్డ పాకాల మండలం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యుగంధర్ నాయుడు (చంటి)

పాకాల: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో చిత్తూరు నుంచి దిగుమతి అయిన రౌడీమూకల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం రాత్రి పాకాల మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యుగంధర్ నాయుడు (చంటి)పై చిత్తూరు నుంచి బైకులపై వచ్చిన ఐదుగురు సభ్యుల రౌడీ గ్యాంగ్ బీరు సీసాలు, మారణాయుధాలతో దాడిచేసి అతడిని హతమార్చేందుకు యత్నించారు. యుగంధర్ తలను బీరు బాటిల్‌తో పగులగొట్టారు. మారణాయుధాలతో ఒళ్లంతా గాయాలు చేశారు. 'మా అన్న పులివర్తి నానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీకి పనిచేస్తావా.. నిన్ను చంపితే దిక్కెవరు' అంటూ ఇష్టారాజ్యంగా దాడి చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో చెన్నుగారిపల్లి సమీపంలోని తన మామిడి తోటలో ఉండగా.. గుర్తు తెలియని ఐదుగురు యువకులు ద్విచక్ర వాహనాలపై తోటలోకి చొరబడి హతాయత్నం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామిడి తోటలోని తన గెస్ట్‌హౌస్‌లో ఉన్న గృహోపకరణాలను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో కొనసాగితే ప్రాణాలతో ఉంచబోమని బెదిరించారని తెలిపారు. చిత్తూరు నుంచి కిరాయి మూకలను రప్పించి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయించి ఓ నేత పైశాచిక ఆనందం పొందుతున్నాడని బాధితుడు మండిపడ్డాడు.

వైఎస్సార్ సీపీ కార్యాలయానికి నోటీసులు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా మచిలీపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందున పార్టీ అధ్యక్షునికి నోటీసులు జారీ చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయ భవనం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఇది ప్రజాస్వామ్యమా .. అరాచకమా?

- దాడులపై హ్యూమన్‌రైట్స్ కమిషన్ స్పందించాలి
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి,అమరావతి/ రైల్వేకోడూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత 25 రోజులుగా కొనసాగిస్తున్న అరాచకాలు, విధ్వంసాలు, దాడులు, దాష్టీకాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక అరాచక రాజ్యంలో ఉన్నామా? అన్న సందేహం కలుగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. తమకు ఊహ వచ్చినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు ఎన్నడూ చూడలేదని తెలిపారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఇలా ప్రజలపై జరుగుతున్న దాడులపై హ్యూమన్‌రైట్స్ కమిషన్ తక్షణమే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని కోరారు.

పేదల ఇళ్లు కూల్చివేత దుర్మార్గం..

ఎస్టీ కాలనీ వాసుల ఇళ్లను రెవెన్యూ, ఏపీఎండీసీ అధికారులు దౌర్జన్యంగా కూల్చివేయడం దుర్మార్గమని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓబులవారిపల్లె మండలం మంగంపేటకాపుపల్లె ఎస్టీ కాలనీ వాసుల గృహాలను బుధవారం జేసీబీతో అధికారులు కూల్చి వేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్లల్లో బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలున్నారని చూడకుండా తెల్లవారుజామున జేసీబీలతో నేలమట్టం చేయడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు

కక్షసాధింపు చర్యలను ప్రజలు హర్షించరు

- మూడు పార్టీలు జతకట్టడం నైతికంగా ఓడిపోవడమే
- ప్రజలకిచ్చే హామీలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా జతకట్టాయని, ఇది నైతికంగా ఓడిపోవడమేనని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను ప్రజలు హర్షించరని చెప్పారు. తాము ఓటమిని గౌరవంగా స్వీకరిస్తామని, వైఎస్ జగన్ నాయకత్వంలో మళ్లీ కచ్చితంగా అధికారంలోకి వస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ 'డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కక్షసాధింపు చర్యలుండవు, ప్రజాపాలన వైపే దృష్టి సారిస్తామని చెబుతున్నారు. కానీ



ఎక్కడా అలాంటి పరిస్థితులు లేవు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్ని కూల్చివేస్తున్నారు. కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సీఎం చంద్రబాబు గతంలో చాలా హామీలిచ్చి విస్మరించిన విషయం తెలిసినా... మనిషి ఆశాజీవి కాబట్టి మరోమారు ఆయన ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లువేశారు. టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీకే ఓట్లు ఎక్కువగా వచ్చాయి. ఓటింగ్ శాతంలో వైఎస్సార్ సీపీకి దేశంలోనే 5వ స్థానం వచ్చింది. కూటమిగా ఏర్పడటం వల్లే వారు గెలిచారు. గతంలో కాంగ్రెస్ సహా ఇతర పార్టీలన్నీ ఒక్కటైనా వైఎస్ జగన్ ఒక్కడే ప్రజల్లోకి వెళ్లి నిలబడ్డారు. దేనినైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తి ఆయనకు ఉంది. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ధైర్యంగా ఉండాలి. అందరికీ మళ్లీ మంచి రోజులు వస్తాయి.' అని కృష్ణదాస్ అన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటే ఈ నెలలో ఐదు పథకాలు ఇచ్చేది: పేరాడ తిలక్

వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో ఉండగా ప్రజలకు ప్రతి సంవత్సరం జూన్ నెలలో ఐదు సంక్షేమ పథకాల లబ్ధి అందేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ప్రజలకు ఇవ్వలేదన్నారు. 'టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే అధికారులు టీ ఇచ్చి గౌరవించాలని, లేకుంటే నేనేమి చేస్తానో చెప్పను' అని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, సీనియర్ నాయకులు సూర శ్రీనివాసరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంటు భూమి ఆక్రమించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

- ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు
- బాబు తీరు చూస్తే సూపర్ సిక్స్ పథకాలను ఎగ్గొట్టేట్టు ఉన్నారు
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో ఎక్కడైనా తాను సెంటు భూమి ఆక్రమించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సవాలు విసిరారు. ఆయన గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. టీడీపీ వారు గతంలో తనపై ఐదు ఎఫ్ఐఆర్‌లు వేశారని, ఈ పదిహేను రోజుల్లో ఒక ఎఫ్ఐఆర్ నమోదుచేశారని చెప్పారు. అధికారం ఉంది కదా అని తప్పుడు కేసులతో భయపెట్టాలని చూస్తే బెదిరిపోనని చెప్పారు. చివరి శ్వాస వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని, ఆయన్ని మళ్లీ సీఎంను చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు వారాలైనా ఇప్పటివరకు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని అన్నారు. చంద్రబాబు మాటలు చూస్తుంటే ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోందన్నారు.



ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకోకపోతే ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. పథకాల అమలుకు జగన్ అప్పులు చేశారని ప్రభుత్వంలో కీలక వ్యక్తులు మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.50 వేల కోట్లు అప్పులు చేస్తే టీడీపీ హయాంలో పథకాల అమలుకి రూ.లక్షన్నర కోట్లు అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం వెనుజులా, శ్రీలంక అయిపోతుందన్నవారే సూపర్ సిక్స్ పథకాలు ఎలా ఇస్తామంటున్నారని ప్రశ్నించారు. సంపద సృష్టించి ప్రజలకు పథకాలు ఇస్తానన్న మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. అప్పులపై శ్వేత పత్రం విడుదల చేస్తామని అంటున్నారని, విడుదల చేయాలని కోరారు.

రైతు భరోసా డబ్బులు ఎప్పుడు వేస్తారు?

వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ సీజన్‌లో మే నాటికే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమయ్యేవని, చంద్రబాబు ప్రభుత్వంలో ఇప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదని, ఇవెప్పుడు వేస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల శిలాఫలకాలు ధ్వంసం చేయడం మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. స్కూల్స్ ప్రారంభమైనా అమ్మ ఒడి 30 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వలేదని తెలిపారు. కాలేజీ విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన డబ్బులు వేయాలన్నారు. విద్యా దీవెనపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడకపోవడం దారుణమన్నారు. మత్స్యకారుల కష్టాలు తెలుసునని చెబుతున్న మంత్రి అచ్చెన్నాయుడు వారి డబ్బులు వారి ఖాతాల్లో వేయాలన్నారు.

చేయూత సొమ్ముపై పవన్ చొరవ తీసుకోవాలి

మహిళలకు వైఎస్సార్ చేయూత సొమ్ము తమ ప్రభుత్వంలో సుమారు రూ.5,065 కోట్లు డిపాజిట్ చేస్తే రూ.2,900 కోట్లు మహిళల ఖాతాల్లోకి వెళ్లాయన్నారు. ఇంకా సుమారు రూ.2,100 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, సెర్ప్‌ను వేరే మంత్రికి ఇచ్చారన్నారు. ఇప్పుడు చేయూత పెండింగ్ నిధులపై ఎవరు దృష్టి పెడతారని ప్రశ్నించారు. మహిళలకు జమ కావాల్సిన నిధులను వెంటనే వారి ఖాతాల్లో వేసేలా పవన్ చొరవ తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ ఇంటిపై దాడి

అర్ధరాత్రి 12 నుంచి 4 గంటల వరకు టీడీపీ గూండాల విధ్వంసం

తెనాలి అర్బన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా కో-కన్వీనర్ నీలి అజయ్‌కుమార్ ఇంటిపై బుధవారం అర్ధరాత్రి టీడీపీ గూండాలు దాడి చేశారు. నాలుగు గంటలపాటు విధ్వంసానికి పాల్పడ్డారు. ఇంట్లో వస్తువులు, కిటికీల అద్దాలు, పూల కుండీలు ధ్వంసం చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి నందులపేటకు చెందిన నీలి అజయ్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్. ప్రతిపక్ష పార్టీల విమర్శలను సోషల్ మీడియా ద్వారా తిప్పికొట్టేవాడు. అతనిపై కక్ష పెంచుకున్న కొందరు టీడీపీ గూండాలు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే బెదిరింపులు ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం అజయ్ విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొందరు టీడీపీ గూండాలు కారులో అతని ఇంటికి వచ్చారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో కర్రలు, రోకలి బండలతో కిటికీ అద్దాలు పగలకొట్టారు. కిటికీల నుంచి కర్రలు, రాడ్లతో లోపల అందిన వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటి ఆవరణలోని వాషింగ్ మిషన్, పూల కుండీలు, వస్తువులను పగులగొట్టారు. దీనిని గమనించిన స్థానికులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై దౌర్జన్యానికి దిగారు. వారిపై దుర్భాషలాడి, బెదిరించారు. తెల్లవారుజామున 4 గంటల వరకు నాలుగు గంటల పాటు విధ్వంసం కొనసాగినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.


అజయ్ ఇంట్లో చెల్లాచెదురుగా పడిన సామాన్లు

కూల్చివేతలపై ముగిసిన వాదనలు

- నిర్ణయం వాయిదా.. అప్పటివరకూ స్టేటస్ కో: హైకోర్టు
- ఉత్తర్వులు జారీచేసిన జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- ప్రభుత్వ పెద్దలు చెప్పడంతో అప్పటికప్పుడు నోటీసులిచ్చారు
- అనుమతులు కోసం మేం దరఖాస్తు చేసుకున్నా నోటీసులిచ్చారు
- ఉల్లంఘనలు ఏమిటో చెప్పరు
- అలాంటప్పుడు వాటికి మేమెలా జవాబివ్వాలి?
- కూల్చివేతలపై ముందుకెళ్లకుండా అధికారులను నియంత్రించండి
- హైకోర్టుకు నివేదించిన వైఎస్సార్‌సీపీ న్యాయవాదులు

సాక్షి, అమరావతి : తమ పార్టీ కార్యాలయాల కూల్చివేతల నిమిత్తం ఇచ్చిన నోటీసులకు అనుగుణంగా తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులను నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలన్న అభ్యర్థనలతో వైఎస్సార్ సీపీ, ఆ పార్టీ నేతలు వేర్వేరుగా దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలపై హైకోర్టులో వాదనలు ముగిశాయి.



వాదనలు విన్న న్యాయస్థానం అనుబంధ వ్యాజ్యాలపై నిర్ణయాన్ని వాయిదా వేసింది. కూల్చివేతల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలంటూ బుధవారం ఇచ్చిన ఉత్తర్వులను నిర్ణయం వెలువరించేంత వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

కూల్చివేతలపై అధికారులను నియంత్రించాలంటూ పిటిషన్లు..

అన్ని జిల్లాల్లోని తమ పార్టీ కార్యాలయాల కూల్చివేతలకు పురపాలక శాఖాధికారులు జారీచేసిన షోకాజ్ నోటీసులను, ప్రాథమిక ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ నేతలు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కూల్చివేతకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు. అలాగే, కూల్చివేతలకు పాల్పడకుండా అధికారులను నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలంటూ అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే, గురువారం మరిన్ని వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ గురువారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, పి. వీరారెడ్డి, న్యాయవాదులు వీఆర్ఎన్ ప్రశాంత్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, వీఆర్ రెడ్డి, వి. సురేందర్‌రెడ్డి, ఉగ్రనరసింహ, రాసినేని హరీష్, వివేకానంద విరూపాక్ష తదితరులు సుదీర్ఘ వాదనలు వినిపించగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

డీమ్డ్ నిబంధన కింద నిర్మాణాలు చేపట్టాం..

ఇక అనుమతుల కోసం తాము పెట్టుకున్న దరఖాస్తులపై అధికారులు నిర్ణీత కాల వ్యవధిలోపు నిర్ణయం వెలువరించలేదని, దీంతో చట్టంలో ఉన్న విధంగా తమకు అనుమతి వచ్చినట్లుగానే భావించి (డీమ్డ్ నిబంధన) నిర్మాణాలను పూర్తిచేశామన్నారు. చట్ట ప్రకారం నడుచుకుంటామని ఒకవైపు కోర్టుకు చెబుతూ, మరోవైపు కూల్చివేతలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇందుకే జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల విషయంలో తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. అడ్వొకేట్ కమిషన్‌ను నియమించి రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యాలయాలకు అనుమతులు తీసుకున్నాయో లేదో తేల్చాలన్నారు. అగ్నిమాపక పరికరాలు ఏర్పాటుచేయలేదని, అందువల్ల కూల్చేస్తామంటూ కూడా నోటీసులు ఇచ్చారని, వాస్తవానికి బహుళ అంతస్తుల భవనాలకే అగ్నిమాపక పరికరాల ఏర్పాటు నిబంధన వర్తిస్తుందని తెలిపారు.

రాజకీయ పార్టీని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరంలేదు..

అంతకుముందు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, కూల్చివేతల విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటామన్నారు. రాజకీయ పార్టీ అయినంత మాత్రాన ప్రత్యేకంగా చూడాల్సిన అవసరంలేదన్నారు. అనుమతులు లేకుండానే పార్టీ కార్యాలయాలను నిర్మించారని, అనుమతులు ఉంటే చూపాలన్నారు. తుది ఉత్తర్వులు జారీ చేయకముందే దాఖలు చేసిన ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవన్నారు.

డీమ్డ్ నిబంధన సంగతి ఏంటి?

ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. డీమ్డ్ నిబంధన సంగతి ఏమిటని ప్రశ్నించారు. డీమ్డ్ నిబంధన కింద అనుమతి వచ్చినట్లు భావించి నిర్మాణాలు చేసే ముందు ఆ విషయాన్ని నోటీసు ద్వారా సంబంధిత అధికారికి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అయితే, ప్రస్తుత కేసులో వైఎస్సార్‌సీపీ అలాంటి నోటీసు ఇవ్వలేదని దమ్మాలపాటి తెలిపారు. ఈ దశలో సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి జోక్యం చేసుకుంటూ.. తాము నోటీసు ద్వారా తెలియజేశామన్నారు. తిరిగి దమ్మాలపాటి వాదనలు వినిపిస్తూ, షోకాజ్ నోటీసులకు ఇచ్చే వివరణను పరిగణనలోకి తీసుకుని తుది ఉత్తర్వులు జారీచేస్తామని, అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాల్సిన అవసరంలేదన్నారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ వ్యాజ్యాలపై నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. నిర్ణయం వెలువరించేంత వరకు గతంలో ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు చెప్పారు.

ఉల్లంఘనలంటారు.. అవేంటో చెప్పరు..

ఇన్నేళ్లుగా పార్టీ కార్యాలయాల నిర్మాణాలు చేస్తుంటే మౌనంగా ఉన్న పురపాలక శాఖాధికారులు ఒక్కసారిగా మేల్కొన్నారని వైఎస్సార్‌సీపీ న్యాయవాదులు తెలిపారు. ఈనెల 22న అన్నీ జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల కూల్చివేతకు నోటీసులిచ్చారన్నారు. నిజానికి.. అనుమతుల కోసం సమర్పించిన దరఖాస్తులు వారి వద్ద ఉన్నప్పటికీ, వాటి గురించి ప్రస్తావించకుండా నోటీసులిచ్చారని తెలిపారు. ఉల్లంఘనలు ఉన్నాయన్న అధికారులు అవి ఏ రకమైన ఉల్లంఘనలో చెప్పడంలేదన్నారు. అలాంటప్పుడు వారిచ్చిన నోటీసులకు తాము వివరణ ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అధికారులు ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటున్నార అన్నారు. వాస్తవాలేంటో తేల్చకుండా భవనాలను కూల్చేస్తే తమకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రేపు అధికారుల చర్యలు సరికాదని తేలితే, కూల్చివేసిన భవనాలు తిరిగి రావని తెలిపారు. కూల్చివేతల విషయంలో యథాతథస్థితి కొనసాగిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీలేదని వారు వివరించారు.

ఫ్యాషన్

ఇండియన్ కుర్తీ వెస్ట్రన్ కట్స్

అమ్మాయిలు కోరుకునే సౌకర్యవంతమైన డ్రెస్ కుర్తీ ఎప్పుడూ ఒకే స్టైల్‌లో కాకుండా భిన్నమైన వెస్ట్రన్ కట్స్‌తో లేయర్డ్ టాప్స్‌గా పేరు మార్చుకొని మరీ ట్రెండ్‌లో ఉంటున్నాయి. అసమానంగా ఉండటమే ప్రత్యేకతగా ఇండో-వెస్ట్రన్ స్టైల్‌లో ఆకట్టుకునే ఈ డ్రెస్ డిజైన్స్ యువతను మరింత మోడరన్‌గా మార్చేస్తాయి. అటు క్యాజువల్ వేర్‌గానూ, ఇటు పార్టీవేర్‌గానూ కూడా యువతను ఆకట్టుకుంటున్నాయి.





టు లేయర్స్‌గా ఉండే ఖఫ్తాన్ స్టైల్ కుర్తీ సెట్ కలర్ కాంబినేషన్‌తో సరైన ఎంపిక అవ్వాలి.

నెటెడ్, చందేరీ ఫ్యాబ్రిక్ లేయర్స్‌తో ఉండే అసిమెట్రిక్ కుర్తీ ప్రత్యేక సందర్భాలలోనూ స్టైల్‌గా కనిపిస్తుంది.

ధోతీ ప్యాంట్‌కు అసిమెట్రికల్ కట్‌తో ఉండే కుర్తీ, దానిపైకి ఎంబ్రాయిడరీ చేసిన వెస్ట్రన్ టాప్ ఇండోవెస్ట్రన్ స్టైల్‌తో ఆకట్టుకుంటుంది.







జెండర్ స్పృహ



ఈ పాఠాలు అవసరం


'అ' అంటే 'అమ్మ'.. 'ఆ' అంటే 'ఆవు' పాఠాలు కాదు కావలసినవి. అమ్మకు సాయం చేసే ఇంటి సభ్యుల పాఠాలే కావాలని కేరళ ప్రభుత్వం పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది. అమ్మ వంట చేస్తుంటే నాన్న ఆఫీసుకు వెళ్లే చిత్రాలతో ఉండే గత పాఠాలకు బదులు అమ్మకు వంటలో సాయం చేసే నాన్నలను ప్రవేశ పెట్టింది. ఆడపిల్లలను ఒక విధంగా, మగ పిల్లలను ఒక విధంగా కాకుండా అందరూ అన్ని పనుల్లో సమానమే అని చెప్పే పాఠాలు ఇప్పుడు అవసరం.

అంకుర స్థాయిలో విద్యాబోధన వేసే ప్రభావాలు చాలా గట్టివి. గతంలో ఇవి తెలియకుండా లింగ వివక్షను ప్రతిపాదించేవి. లేదా పరిమితులను నిర్ధారించేవి. లేదా ఎవరి పనులు ఏమిటో, ఎవరి స్థాయి ఏమిటో స్టీరియో టైప్ చేస్తూ ముద్ర వేసేవి. టెక్స్ట్‌బుక్స్‌లో ఎప్పుడూ అమ్మ ఎప్పుడూ వంట చేస్తూ. అక్కకు జడ వేస్తూ. ముగ్గు వేస్తూ, పొలం గట్ల మీద నాన్నకు క్యారేజీ తీసుకువెళుతూ, రోలు దంచుతూ, వెన్న చిలుకుతూ కనిపించేది. నాన్న పడక్కుర్చీలో పేపర్ చదువుతూ ఉంటాడు. లేదా ఆఫీసుకు వెళుతూ లేదా ఆఫీస్‌లో పని చేస్తూ కనిపిస్తాడు. అంటే అబ్బాయిలు ఉద్యోగాలకి, అమ్మాయిలు ఇంటి పనికి పరిమితం కావాలని తెలియకనే మనసుల్లోకి ఎక్కేది. ఇప్పటికీ ఇలాంటి పాఠాలు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నాయి. కాని కేరళ రాష్ట్రం ఈ పద్ధతిని వదిలి 'జెండర్ న్యూట్రల్' పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది.

ముందే నేర్పించండి

'టీచ్ దెమ్ అర్లీ' అని కేరళ ప్రభుత్వం కొత్త ధోరణిని ఎంచుకుంది. చిన్న వయసులోనే స్త్రీ, పురుష అస్తిత్వాల మధ్య వివక్షను చెరిపేసే పాఠాలు చెప్పాలని నిర్దేశించింది. మూడవ తరగతి మలయాళం, ఇంగ్లిష్ టెక్స్ట్‌బుక్కుల్లో ఇంటి పనుల పాఠం ఉంది. మూడవ తరగతి టెక్స్ట్‌బుక్‌లో కొబ్బరి తురుము తీస్తున్న నాన్న వంటగదిలో కనిపిస్తే ఇంగ్లిష్ టెక్స్ట్ బుక్‌లో పాపకు ఇష్టమైన చిరుతిండిని సిద్ధం చేస్తున్న తండ్రి కనిపిస్తాడు. ఈ పాఠాలను ప్రస్తుతం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు. 'అయితే పాఠాల కంటే ముందు లింగ వివక్ష విషయంలో ఉపాధ్యాయులకు కూడా దృష్టి కోణంలో మార్పు తేవాలనే అవగాహనతో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించాం' అని తెలిపాడు కేరళ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ జయప్రకాష్. ఇది మాత్రమే కాదు సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అన్ని రకాల జెండర్ల, వారి జీవన హక్కుల గురించి అవగాహన కలిగించే పాఠాలను కాలక్రమంలో స్కూల్ టెక్స్ట్‌బుక్కులు చేరుస్తామని కేరళ విద్యాశాఖ తెలిపింది.





ఐదవ తరగతి లోపు 200 రోజులు


ఈ విద్యా సంవత్సరం కేరళ విద్యాశాఖ తీసుకున్న మరో కీలక నిర్ణయం 1 నుంచి 5 వ తరగతి లోపు పిల్లలకు 200 పని దినాలు చాలని నిబంధన విధించడం. ప్రాథమిక విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 5వ తరగతి లోపు పిల్లలకు 200 పని దినాల్లో 800 గంటల చదువు చాలు. అంతకు మించి చదివించడం వల్ల ఏం ప్రయోజనం ఉండటం లేదని ఉపాధ్యాయ సంఘం చేసిన సూచన మేరకు అక్కడి విద్యాశాఖ కొత్త నియమాన్ని అమలులోకి తెచ్చింది. దీని వల్ల అన్ని స్కూళ్లు ఐదవ తరగతి లోపు పిల్లలకు వారానికి ఐదు రోజులే పని చేస్తాయి. ఉపాధ్యాయ సంఘం మరో సూచన కూడా చేసింది. బడి గంటలు పెంచి హైస్కూల్ తరగతులకు కూడా 200 రోజుల పని దినాలు చేయాలని. హైస్కూల్ సిలబస్‌లు పూర్తి కావాలంటే సంవత్సరంలో 1000 గంటలు పాఠాలు సాగాలని అందుకు వారానికి ఐదు రోజులు ఎక్కువ పీరియడ్లు చెప్పి శని, ఆదివారాలు సెలవు ఇవ్వొచ్చని సంఘం సూచించింది. దీనికి విద్యాశాఖ అనుమతించలేదు గాని పరిశీలనకు తీసుకుంది.

వంటిల్లు

గ్రీన్ కర్రీస్

వాతావరణం మారింది... వర్షాలు మొదలయ్యాయి. సీజనల్ కోల్డ్... ఇంకా అనుబంధ సమస్యలు కూడా. ఇమ్యూనిటీ పుష్కలంగా ఉండడమే అన్నింటికీ పరిష్కారం. ఆహారంలో రుచికి తోడుగా ఆరోగ్యాన్ని జోడించాలి. రోజూ ఏదో ఒక ఆకు కూర తింటే ఆరోగ్యం పరిపూర్ణం. రోజూ ఆకు కూరలేనా... అని పిల్లలు ముఖం చిట్లిస్తే... పిల్లలు ఇష్టపడే కాంబినేషన్‌లతో వండి పెట్టండి.

ఆలూ మేథీ



కావలసినవి: బంగాళదుంప – 200 గ్రా; మెంతి ఆకు – మీడియం సైజు కట్ట ఒకటి; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; వెల్లుల్లి తరుగు – టీ స్పూన్; అల్లం తరుగు – టీ స్పూన్; పచ్చిమిర్చి తరుగు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; పసుపు – అర టీ స్పూన్; ధనియాల పొడి – 2 టేబుల్ స్పూన్‌లు

తయారీ: • బంగాళదుంప ఉడికించి తొక్క తీసి ముక్కలు చేయాలి. • మెంతి ఆకులు వలిచి శుభ్రంగా కడిగి, నీరంతా పోయిన తర్వాత తరిగి పక్కన పెట్టుకోవాలి. • బాణలిలో నూనె వేడి చేసి ఎండుమిర్చి, జీలకర్ర వేయాలి. ఆ తర్వాత అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఇంగువ వేసి సన్నమంట మీద వేయించాలి. • పసుపు, బంగాళాదుంప ముక్కలు వేయాలి. మసాలా దినుసులు ముక్కలకు పట్టేటట్లు మధ్య మధ్య కలియబెడుతూ ఐదు నిమిషాల పాటు వేగనివ్వాలి. ఇప్పుడు ధనియాల పొడి, మెంతి ఆకు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి సన్నమంట మీద మగ్గనిచ్చి దించేయాలి. పిల్లల లంచ్ బాక్సుకు ఇది మంచి పోషకాహారం.

క్యారట్ మొరింగా కర్రీ



కావలసినవి: క్యారట్ – పావు కేజీ; మునగ ఆకు – వంద గ్రాములు; జీలకర్ర – అర టీ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; పచ్చిమిర్చి – 4 (తరగాలి); వెల్లుల్లి రేకలు – 3 (తరగాలి); అల్లం తరుగు – టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; ధనియాల పొడి – 2 టీ స్పూన్‌లు; నూనె – 2 టీ స్పూన్‌లు.

తయారీ: • క్యారట్‌ని శుభ్రం చేసి తరగాలి. మునగ ఆకును కడిగి నీరు పోయేటట్లు చిల్లుల గిన్నెలో వేసి పక్కన పెట్టాలి. • బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి, వేగిన తర్వాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి వేసి మీడియం మంట మీద రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. మునగాకు కలిపి రెండు నిమిషాలు (పచ్చివాసన పోయే వరకు) వేగిన తర్వాత క్యారట్ ముక్కలు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి వేసి కలపాలి. అరకప్పు నీరు పోసి కలిపి మూత పెట్టాలి. రెండు నిమిషాల్లో క్యారట్ ముక్కలు ఉడుకుతాయి. మూత తీసి నీరు ఆవిరయ్యే వరకు కలిపి దించేయాలి. ఇష్టమైతే కూరలో చివరగా కొబ్బరి పొడి చల్లుకోవచ్చు.

గమనిక: మునగ ఆకు లేకపోతే మెంతి ఆకుతో చేసుకోవచ్చు.

యువర్స్



• అనుష్క జగ్

• మ్యూజిక్ వరల్డ్

హ్యాపీ హ్యాపీగా హాయి హాయిగా

'రీబర్త్' 'టాబూ' 'హరికేన్'లాంటి పాటలతో ఆకట్టుకున్న ఇంటర్నేషనల్ మ్యూజిక్ ఆర్టిస్ట్ అనుష్క జగ్ లేటెస్ట్ సింగిల్ 'ఖుషీ ఖుషీ' వైబ్రెంట్ యానిమేటెడ్ వీడియోతో విడుదల అయింది. తన యూనిక్ వాయిస్‌తో శ్రోతలను ఆకట్టుకుంటున్న అనుష్క తాజాగా 'ఖుషీ ఖుషీ'తో స్వరసందడి చేస్తోంది. 'ఖుషీ ఖుషీ అనేది స్పిరిచ్యువల్ పాప్' అంటుంది అనుష్క.

కాలేజీ రోజుల నుంచి అనుష్కకు ఫిలాసఫీ అంటే ఇష్టం. తాజా పాటలో ఫిలాసఫీ కనిపిస్తుంది. అయితే భారంగా, సంక్లిష్టంగా కాకుండా యూత్‌ఫుల్ స్టైల్‌లో లిరిక్స్ ఉంటాయి. టైటిల్ హిందీలో ఉన్నప్పటికీ లిరిక్స్ మాత్రం ఇంగ్లీష్‌లో ఉంటాయి.

'హ్యాపీ ఈజ్ ఏ ఫీలింగ్ ఐ హ్యావ్ గాట్ హ్యాపీ ఈజ్ ఏ స్విచ్ ఇన్ మై హార్ట్'లాంటి లిరిక్స్‌తో 'ఖుషీ ఖుషీ' దూసుకుపోతోంది. తనను తాను 'మ్యూజికల్ టూరిస్ట్'గా చెప్పుకునే అనుష్క ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలలో కచేరీలు ఇచ్చింది. జెన్నిఫర్ ఓనీల్, జాన్ జోన్స్, డడ్డీ బ్రౌన్, దానీ పాపిట్, కైల్ కెల్సో లాంటి సంగీతకారులతో కలిసి పనిచేసింది. ప్రతి కొత్త ప్రాజెక్ట్‌లో తనదైన ప్రతిభ చూపుతుంది అనుష్క. ఇండియన్ మెలోడీలు, రిథమ్‌లతో ప్రవాసభారతీయులనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని ఆకట్టుకుంది అనుష్క జగ్.

కుకింగ్

• సక్సెస్ స్టోరీ



ఆకాష్ మురళీధరన్‌కు చిన్న వయసులోనే వంటలపై ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ పోయి ప్రపంచ వంటకాల గురించి కూడా తెలుసుకునేలా చేసింది. ప్రపంచ వంటకాల గురించి కాచి వడబోసిన చెన్నైకి చెందిన ఆకాష్ దక్షిణ భారతీయ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి నడుం కట్టాడు. 'మాస్టర్ చెఫ్ ఇండియా' టైటిల్ గెలుచుకున్నాడు. 'కుకింగ్ ఈజ్ థెరపిటిక్' అంటున్న ఆకాష్‌కు వంటలు చేయడం పాషన్ మాత్రమే కాదు. ప్రాణవాయువు కూడా...

వంటగదిలో బామ్మ స్వీట్ తయారుచేస్తుంటే చిన్నప్పుడెప్పుడో చూశాడు ఆకాష్. 'ఇక్కడ నీకు ఏం పని?' అని గద్దించలేదు బామ్మ. 'ఈ స్వీటును ఇలా తయారు చేయాలి నాయనా' అంటూ వివరించింది. ఇక అప్పటి నుంచి రకరకాల వంటలు. స్వీట్‌ల తయారీపై ఆకాష్‌కు ఆసక్తి పెరిగింది.



• వంటల్లోనే ఆనందం...

ఆ ఆసక్తి, నేర్చుకున్న విద్య ఊరకే పోలేదు. బెంగళూరులో ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో బాగా ఉపయోగపడింది. తనకు ఇష్టమైన వంటలు చేసి ఆ రుచులను ఆస్వాదించడంతో పాటు వంటల్లో రకరకాల ప్రయోగాలు చేసేవాడు. రుచుల ఆస్వాదనలో ఆనందమే కాదు వంట చేస్తున్న సమయంలో ఏకాగ్రత పెరగడం, మనసు ప్రశాంతంగా, ఉత్సాహంగా ఉండడం గమనించాడు ఆకాష్. ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేసిన ఆకాష్ ఒక ఆర్కిటెక్చర్ ఫర్మ్‌లో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. యానిమేషన్‌లో డిప్లొమా కూడా చేసిన ఆకాష్ ఆ తరువాత వంటలపై తన పాషన్‌ను సీరియస్‌గా తీసుకున్నాడు. కొత్త కొత్త వంటకాల గురించి మరింత ఆసక్తిగా తెలుసుకోవడం మొదలుపెట్టాడు.

ఇటలీలోని మిలాన్‌లో ఫుడ్ డిజైన్‌లో మాస్టర్స్ చేశాడు. పాత వంటకాలకు కొత్త ఫ్లేవర్ జోడించడాన్ని తన ప్రత్యేకతగా చేసుకున్నాడు.

యూరప్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లడం వల్ల ఎన్నో వంటకాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. ఇది తన భవిష్యత్ బాటకు బాగా ఉపయోగపడింది. 'ఇండియాకు అవల ఫుడ్‌ను ఎలా చూస్తారు?' అనే విషయాన్ని లోతుగా తెలుసుకోవడానికి కూడా తన ప్రయాణాలు ఉపయోగపడ్డాయి.

నెదర్‌లాండ్స్‌లో ఒక ఫుడ్ డిజైనర్‌తో కలిసి పనిచేశాడు. 'ప్రపంచంలోని ఎన్నో వంటకాల గురించి తెలుసుకున్న నాకు దక్షిణ భారత వంటకాల రుచులను ప్రపంచానికి పరిచయం చేయాలని గట్టిగా అనిపించింది' అంటాడు ఆకాష్. మనం ఆస్వాదించే వంటకాలకు సంబంధించిన ఆసక్తికరమైన కథలను ఆధునిక పద్ధతులలో చెప్పడానికి 'విజా మెడై' పేరుతో మల్టీడిసిప్లినరి స్టూడియోను మొదలు పెట్టాడు. ఈవెంట్ డిజైన్, డెకర్, మెనూ క్యురేషన్, ఔట్‌ఫిట్ డిజైన్, స్టైలింగ్, క్రియేటివ్ డైరెక్షన్‌లు ఈ స్టూడియో ప్రత్యేకత. తన '100–డే కుకింగ్ ప్రాజెక్ట్'లో భాగంగా మనం మరచిపోయిన ఎన్నో కూరగాయలను వెలుగులోకి తెచ్చాడు. సౌత్ ఇండియన్ ఫుడ్ రుచుల గురించి వివరంగా చెప్పడానికి 'మాస్టర్‌చెఫ్ ఇండియా–తమిళ్' షోలో పాల్గొన్నాడు. ఆకాష్ వంటనైపుణ్యానికి ఫిదా అయిన జడ్జీలు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. 'మాస్టర్‌చెఫ్ ఇండియా–తమిళ్' టైటిల్ గెలుచుకున్నాడు ఆకాష్.

చిన్నప్పుడు అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్(ఏడీహెచ్‌డీ)తో బాధ పడిన ఆకాష్‌కు వంట చేయడం అనేది చికిత్సలా ఉపయోగపడింది. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

లెనోవా ట్యాబ్ ప్లస్



సైజ్:	11.5 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	90 హెచ్‌జడ్
రిజల్యూషన్:	2000×1200 పిక్సెల్స్
వోఎస్:	ఆండ్రాయిడ్: 14
మెమోరీ:	8+128జీబి 8+256జీబి
బ్యాటరీ:	8,600 ఎంఏహెచ్
బరువు:	650 గ్రా.

షావోమీ రెడ్‌మీ 13



డిస్‌ప్లే:	6.79 అంగుళాలు
బ్యాటరీ:	5030 ఎంఏహెచ్
మెమోరీ:	128జీబి/6జీబి ర్యామ్ 128జీబి/8జీబి ర్యామ్ 256జీబి/ 8జీబి ర్యామ్
రిజల్యూషన్:	1080×2460 పిక్సెల్స్
వోఎస్:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా:	13 ఎంపీ

• టెక్.. టాక్

• అవును... ఇది నిజమే!



- 'మెటాసీజియోఫొబియా' అంటే మార్పు, కొత్త పరిస్థితుల గురించి భయపడడం.
- 'కాఫీ' అనేది యూరప్‌కు పరిచయం అయిన కొత్తలో 'అరేబియన్ వైన్' అని పిలిచేవారు.
- వినడం, నిశ్శబ్దం రెండూ ఒకటే. ఎలా అంటారా? listen లోని లెటర్‌లు silent లోనివి ఒక్కటే!
- డిప్రెషన్‌లో ఉన్న వాళ్లకు లేని వాళ్లతో పోల్చితే మూడు రెట్లు ఎక్కువగా కలలు వస్తుంటాయట!
- was it a car or a cat i saw ఈ వాక్యాన్ని తిరిగేసి చదివినా ఒకేలా ఉంటుంది.



స్పేస్‌టాప్ జీ1

ఇజ్రాయెలీ కంపెనీ సైట్‌ఫుల్ 'స్పేస్‌టాప్ జీ1' ల్యాప్ టాప్ ఆగ్యుమెంటేడ్ రియాలిటీ (ఏఆర్) గ్లాస్‌తో ముందుకు వచ్చింది. స్క్రీన్‌కు బదులుగా ఏఆర్ గ్లాస్‌తో వచ్చిన ఈ ల్యాప్‌టాప్‌ను 'ఏఆర్ ల్యాప్‌టాప్ ఫర్ వర్క్'గా పిలుస్తారు. 'స్పేస్‌టాప్ జీ1' కనెక్టెడ్ గ్లాసెస్‌తో పనిచేస్తుంది. ఈ గ్లాసెస్ 100 అంగుళాల స్క్రీన్‌ను ప్రాజెక్ట్ చేస్తాయి. మానిటర్‌లాంటి బాహ్య పరికరాలను కనెక్ట్ చేయడానికి లాప్‌టాప్‌లో యుఎస్‌బీ–సి పోర్టులు కూడా ఉన్నాయి. ఏఆర్ గ్లాసెస్ రెండు ఓఎల్‌ఈడీ స్క్రీన్‌లను కలిగి ఉంటాయి. వీటి రిజల్యూషన్: 1080 పిక్సెల్స్ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్ ఇంటర్నల్ స్టోరేజ్: 16జీబి ర్యామ్/128 జీ

మోటోరొలా రేజర్ 50 అల్ట్రా

డిస్‌ప్లే:	6.9 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్:	165 హెచ్‌జడ్
రిజల్యూషన్:	1080×2640 పిక్సెల్స్
వోఎస్:	ఆండ్రాయిడ్ 14
మెమోరీ:	256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి
బ్యాటరీ:	4000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా:	32 ఎంపీ



గూగుల్ వి2ఏ



గూగుల్ ఏఐ రిసెర్చ్ ల్యాబ్ డీప్‌మైండ్ కొత్త ఏఐ మోడల్‌పై పని చేస్తోంది. వి2ఏ (వీడియో–టు–ఆడియో) అనే ఈ మోడల్ వీడియోలకు సంబంధించి సౌండ్ ట్రాక్స్, డైలాగులను జనరేట్ చేస్తుంది. టెక్స్ట్ ప్రాంప్ట్స్‌తో వీడియోలను జనరేట్ చేయవచ్చు. దృశ్య, శబ్దపరంగా వీడియోలను మెరుగు పరుచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. సైలెంట్ ఫిల్మ్స్, ఆర్కైవ్ మెటీరియల్‌కు కూడా వి2ఏ ఉపయోగపడుతుంది.

మంకీ సీ మంకీ డూ

ఏమాత్రం ఆలోచించకుండా ఇతరులను గుడ్డిగా అనుసరించే సందర్భంలో వాడే మాట... మంకీ సీ మంకీ డూ. ఉదా: ది కిడ్స్ కాపీడ్ ది టీచర్స్ మూవ్స్, లైక్ మంకీ సీ మంకీ డూ డూరింగ్ ది డ్యాన్స్.

ఈ ఇడియమ్‌కు సంబంధించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ఒకటి భారత్, ఈజిప్ట్, సుడాన్, ఇంగ్లాండ్‌లలో ప్రాచుర్యంలో ఉన్న జానపద కథల్లోని టోపీ వర్తకుడి కథ. చెట్టు కింద నిద్రపోతున్న వర్తకుడి టోపీలను కోతులు ఎత్తుకెళ్లే కథ మనకు తెలిసిందే.

మల్ వోవర్

బాగా ఆలోచించి, ఎక్కువ సమయం వెచ్చించి ఒక నిర్ణయం తీసుకునే సందర్భంలో వాడే మాట....మల్ వోవర్. ఉదా: మై ఫ్రెండ్ ఈజ్ మల్లింగ్ వోవర్ ది ఐడియా ఆఫ్ అడాప్టింగ్ ఏ బేబీ.



> సెమీఫైనల్లో ఏదీ మాకు కలిసి రాలేదు. జట్టుగా మేం కలిసికట్టుగా రాణించాల్సింది. కానీ ఏం చేస్తాం ఇక్కడి పరిస్థితులు ఏమాత్రం మాకు అనుకూలించలేదు. ఏదేమైనా ఇలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనపుడు మానసికంగానూ సిద్ధమై ఉండాలి. మేం బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాం. ఈ టోర్నీలో పటిష్ట ప్రత్యర్థులపై బాగా ఆడాం. అది ఇకపై ఏ జట్టునైనా ఓడించగలమనే ధీమా ఇచ్చింది. ఇకపై పెద్ద పెద్ద టోర్నీల్లో ఆడేటపుడు ఒత్తిడిని అధిగమించడంపై దృష్టిపెడతాం. బాగా ఆడతాం.
>
> –అఫ్గానిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్

1 మూడు ఫార్మాట్‌లలో (వన్డే, టి20, టెస్టు) కలిపి దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి ఓ ప్రపంచకప్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. 1998లో ఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన నాకౌట్ ట్రోఫీ టోర్నీలో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది.

8 టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా వరుసగా సాధించిన విజయాలు. ఈ ఫార్మాట్‌లో తొలిసారి దక్షిణాఫ్రికా వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో గెలిచింది.

56 అంతర్జాతీయ టి20ల్లో అఫ్గానిస్తాన్ జట్టుకిదే అత్యల్ప స్కోరు. 2014 టి20 ప్రపంచకప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 72 పరుగులకు ఆలౌటైంది.

56 టి20 ప్రపంచకప్ చరిత్రలోని నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యల్ప స్కోరు చేసిన జట్టుగా అఫ్గానిస్తాన్ నిలిచింది. 2009 ప్రపంచకప్ సెమీఫైనల్లో శ్రీలంకపై వెస్టిండీస్ 101 పరుగులకు... 2012 ప్రపంచకప్ ఫైనల్లో వెస్టిండీస్‌పై శ్రీలంక 101 పరుగులకు ఆలౌటైంది.

67 మిగిలిన బంతుల పరంగా అంతర్జాతీయ టి20ల్లో దక్షిణాఫ్రికాకిదే అతిపెద్ద విజయం.

2 టి20 ప్రపంచకప్‌లో ముగిసిన ఇన్నింగ్స్‌లో ఎక్స్‌ట్రాలు టాప్ స్కోర్‌గా ఉండటం ఇది రెండోసారి మాత్రమే. 2010 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 69 పరుగులకు ఆలౌటైంది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో 19 ఎక్స్‌ట్రాలవే టాప్ స్కోర్.

రోహిత్, సూర్య మెరుపులు

- భారత్ 20 ఓవర్లలో 171/7
- ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్
- జోర్డాన్‌కు 3 వికెట్లు


సూర్య


రోహిత్

ప్రొవిడెన్స్ (గయానా): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్ పోరులో భారత్ మెరుగైన స్కోరుతో తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (39 బంతుల్లో 57; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ జోర్డాన్‌కు 3 వికెట్లు దక్కాయి.

కీలక భాగస్వామ్యం...

విరాట్ కోహ్లి (9) ఈ వరల్డ్ కప్‌లో తన వైఫల్యాన్ని కొనసాగించగా... గత మ్యాచ్ తరహాలోనే రోహిత్ తన దూకుడైన ఆటతో భారత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లందరినీ సమర్థంగా ఎదుర్కొని అతను బౌండరీలు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 46 పరుగులకు చేరింది. పంత్ (4) వెనుదిరిగిన తర్వాత రోహిత్‌తో సూర్య జత కలిశాడు. వీరిద్దరు చక్కటి సమన్వయంతో పరుగులు రాబట్టారు. 10 ఓవర్లలో భారత్ 77 పరుగులు చేసింది. కరన్ వేసిన ఓవర్లో భారత్ 2 సిక్స్‌లు, ఫోర్‌తో మొత్తం 19 పరుగులు సాధించింది. ఈ క్రమంలో 36 బంతుల్లో రోహిత్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ తర్వాత ఇంగ్లండ్ కాస్త పట్టు బిగించింది. 11 పరుగుల వ్యవధిలో రోహిత్, సూర్య వెనుదిరిగారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 50 బంతుల్లో 73 పరుగులు జోడించారు. జోర్డాన్ ఓవర్లో 2 భారీ సిక్స్‌లు బాది అదే జోరులో తర్వాతి బంతికి హార్దిక్ పాండ్యా (13 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అవుట్ కాగా, శివమ్ దూబే (0) డకౌటయ్యాడు. జడేజా (17 నాటౌట్), అక్షర్ పటేల్ (10) కలిసి చివరి 2 ఓవర్లలో 24 పరుగులు రాబట్టారు.

వర్షంతో అంతరాయం

సెమీస్ మ్యాచ్‌కు వర్షం దెబ్బ పడింది. వాన తగ్గినా మైదానం సిద్ధంగా లేకపోవడంతో ఆట ఆరంభం ఆలస్యం కాగా, 8 ఓవర్ల తర్వాత కూడా వానతో అంతరాయం కలిగింది. మొత్తంగా మ్యాచ్ ఆరంభానికి ముందు 1 గంటా 15 నిమిషాలు, మధ్యలో 1 గంటా 15 నిమిషాలు కలిపి రెండున్నర గంటల ఆట ఆలస్యమైంది.


జోర్డాన్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) రషీద్ 57; కోహ్లి (బి) టాప్లీ 9; పంత్ (సి) బెయిర్‌స్టో (బి) స్యామ్ కరన్ 4; సూర్యకుమార్ (సి) జోర్డాన్ (బి) ఆర్చర్ 47; పాండ్యా (సి) స్యామ్ కరన్ (బి) జోర్డాన్ 23; జడేజా (నాటౌట్) 17; దూబే (సి) బట్లర్ (బి) జోర్డాన్ 0; అక్షర్ (సి) సాల్ట్ (బి) జోర్డాన్ 10; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–19, 2–40, 3–113, 4–124, 5–146, 6–146, 7–170. **బౌలింగ్:** టాప్లీ 3–0–25–1, ఆర్చర్ 4–0–33–1, కరన్ 2–0–25–1, రషీద్ 4–0–25–1, జోర్డాన్ 3–0–37–3, లివింగ్‌స్టోన్ 4–0–24–0.



దక్షిణాఫ్రికా ధమాకా

తొలిసారిగా వరల్డ్‌కప్ ఫైనల్లోకి

సెమీస్‌లో అఫ్గానిస్తాన్‌పై 9 వికెట్లతో ఘనవిజయం

56 పరుగులకే అఫ్గాన్ ఆలౌట్ • హడలెత్తించిన జాన్సెన్, రబడ • 8.5 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా లక్ష్యఛేదన

తొలి సెమీఫైనల్... దక్షిణాఫ్రికా బరిలో నిలిచిన ఈ పోరులో అందరి కళ్లు సఫారీ కంటే అఫ్గానిస్తాన్ జట్టుపైనే ఉన్నాయి. ఈ మెగా టోర్నీలోనే సంచలన కెరటంలా, గట్టి జట్లకు కంటగింపుగా రషీద్ బృందం మారింది. సెమీఫైనల్ దాకా చేరింది. మరోవైపు దక్షిణాఫ్రికా లీగ్, సూపర్–8లో టాపర్‌గా నిలిచినప్పటికీ ఏ ఒక్క మ్యాచ్ కూడా సాధికారికంగా, కనీసం చెప్పుకోదగ్గ స్థాయిలో కూడా ఆడలేదు. పైగా చెరగని 'చోకర్స్' ముద్ర! ఏ ఫార్మాట్ ప్రపంచకప్‌లోనూ ఫైనల్ చేరని వైనం. దీంతో క్రికెట్ ప్రేక్షకులు అఫ్గాన్ తమ సంచలన ప్రదర్శనకు 'సీక్వెల్' చూపిస్తుందనుకున్నారు. కానీ అనూహ్యం... అఫ్గాన్ అతలాకుతలం... అసలు ఈ టోర్నీలోనే ఆడని విధంగా దక్షిణాఫ్రికా దుమ్మురేపింది. 20–20 ఓవర్ల మ్యాచ్‌ను కాస్తా రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 20 ఓవర్లకే పరిమితం చేసి తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది.



తరూబా (ట్రినిడాడ్): అయ్యారే దక్షిణాఫ్రికా... ప్రపంచకప్ గెలవలేదు. కానీ గెలిచినంత సంబరంలో మునిగితేలుతోంది. అదేంటి అనే ఆశ్చర్యం అక్కర్లేదు! ఎందుకంటే ఒకటా... రెండా... ఎన్నని సెమీఫైనల్స్ వారి కథను... ప్రపంచకప్ కలను... ముగించాయో తెలుసా? ఏకంగా 11 సెమీఫైనల్స్‌లలో (వన్డే, టి20 ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీ) ఓటమి సఫారీని చోకర్స్ అనే ముద్ర వేసింది. కానీ ఇప్పుడు పడుతూ... లేస్తూ... అగచాట్లెన్నో పడినా... చిన్న జట్లతోనే కష్టంగా గట్టెక్కిన దక్షిణాఫ్రికాకు మరో సెమీస్ గండం తప్పదని వారి ప్రదర్శన చూసిన విశ్లేషకులు భావించారు. కానీ అసలైన నాకౌట్ పోరులో సఫారీలు సిసలైన ఆట చూపెట్టారు. అంతే సంచలనాల అఫ్గానిస్తాన్‌కు సెమీస్ చాలన్నట్లుగా చెడుగుడు ఆడేశారు. దీంతో గురువారం హోరాహోరీ తప్పదనుకున్న తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా బౌలింగ్ దళం దెబ్బకు వార్ వన్‌సైడ్ అయ్యింది. సూపర్–8 దశదాకా ఔరా అఫ్గాన్ అనిపించిన జట్టు చివరకు చిత్తుగా ఓడింది. 11.1 ఓవర్లు మిగిలుండగానే సఫారీ 9 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. కీలకమైన వికెట్లు తీసిన జాన్సెన్ (3–0–16–3)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఎక్స్‌ట్రాలే టాప్ స్కోర్!

టాస్ నెగ్గిన అఫ్గాన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 11.5 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. చిత్రంగా ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్ ఎవరంటే బ్యాటర్ కాదు! ఎక్స్‌ట్రాలే 13. ఇదే అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో పెద్ద స్కోరు. ఒక్కడు... ఒకే ఒక్కడు అజ్మతుల్లా ఒమర్జాయ్ (12 బంతుల్లో 10; 2 ఫోర్లు) పది పరుగులు చేసిన బ్యాటర్. గుర్బాజ్ (0), ఇబ్రహీమ్ (2), గుల్బదిన్ (9) టాపార్డర్ తీరిది. అలాగని మిడిలార్డర్ తక్కువేం తినలేదు. 'టాప్'నే అనుసరించింది. నబీ (0), నంగేయలియా (2), కరీమ్ (8), కెప్టెన్ రషీద్ ఖాన్ (8) మూకుమ్మడిగా బ్యాట్‌లు ఎత్తేశారు. 23 పరుగులకే సగం (5) వికెట్లు కోల్పోయిన అఫ్గాన్ 50 మైలురాయిని కష్టంగా దాటింది. కానీ అదే స్కోరుపై 3 వికెట్లను కోల్పోయింది. ఇంకో 6 పరుగులు జతయ్యాక ఆలౌటైంది. మార్కో జాన్సెన్ (3/16), రబడ (2/14), నోర్జే (2/7) టాప్, మిడిలార్డర్లను దెబ్బకొడితే... ఎడంచేతి వాటం స్పిన్నర్ షమ్సీ (1.5–0–6–3) టెయిలెండర్ల పని పట్టాడు. అనంతరం సులువైన లక్ష్యాన్ని లీగ్, సూపర్–8 దశలా కష్టపడకుండా దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో వికెట్ మాత్రమే నష్టపోయి 60 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ డికాక్ (5) అవుటయ్యాక, హెండ్రిక్స్ (25 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ మార్క్‌రమ్ (21 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు) చకచకా ముగించారు. అబేధ్యమైన రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) హెండ్రిక్స్ (బి) జాన్సెన్ 0; ఇబ్రహీమ్ (బి) రబడ 2; గుల్బదిన్ (బి) జాన్సెన్ 9; అజ్మతుల్లా (సి) స్టబ్స్ (బి) నోర్జే 10; నబీ (బి) రబడ 0; నంగేయలియా (సి) డికాక్ (బి) జాన్సెన్ 2; కరీమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 8; రషీద్ ఖాన్ (బి) నోర్జే 8; నూర్ అహ్మద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 0; నవీనుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 2, ఫజల్‌హక్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (11.5 ఓవర్లలో ఆలౌట్) 56. వికెట్ల పతనం:** 1–4, 2–16, 3–20, 4–20, 5–23, 6–28, 7–50, 8–50, 9–50, 10–56. **బౌలింగ్:** జాన్సెన్ 3–0–16–3, కేశవ్ మహరాజ్ 1–0–6–0, రబడ 3–1–14–2, నోర్జే 3–0–7–2, షమ్సీ 1.5–0–6–3.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) ఫజల్‌హక్ 5; హెండ్రిక్స్ (నాటౌట్) 29; మార్క్‌రమ్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (8.5 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 60. వికెట్ల పతనం:** 1–5. **బౌలింగ్:** నవీనుల్ 3–0–15–0, ఫజల్‌హక్ 2–0–11–1, రషీద్‌ఖాన్ 1–0–8–0, అజ్మతుల్లా 1.5–0–18–0, గుల్బదిన్ 1–0–8–0.


ఆసియా అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు అదరగొట్టారు. జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత రెజ్లర్లు ఎనిమిది స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సొంతం చేసుకున్నారు. 220 పాయింట్లతో ఓవరాల్ టీమ్ టైటిల్‌ను కూడా దక్కించుకున్నారు.

ప్రియాన్షు శుభారంభం



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రియాన్షు 21–16, 21–18తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో మాళవిక 21–14, 21–15తో క్రిస్టిన్ కుబా (ఎస్తోనియా)పై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జోడీ 15–21, 21–18, 13–21తో అలెగ్జాండర్ డన్–జూలీ మాక్‌ఫెర్సన్ (స్కాట్లాండ్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ ఓటమి



న్యూఢిల్లీ: మలోర్కా చాంపియన్‌షిప్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్) –అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ పోరాటం ముగిసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–7 (21/23), 4–6తో టాప్ సీడ్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–ఒలివెట్టి 11 ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. యూకీ–ఒలివెట్టిలకు 8,630 యూరోల (రూ. 7 లక్షల 71 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఎనిమిదేళ్ల తర్వాత...



లాస్ వేగస్: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఈక్వెడార్ జట్టు ఎనిమిదేళ్ల తర్వాత తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్ 'బి'లో భాగంగా జమైకాతో జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ 3–1తో నెగ్గింది. 13వ నిమిషంలో జమైకా ప్లేయర్ కేసీ పాల్మెర్ సెల్ఫ్ గోల్‌తో ఈక్వెడార్ ఖాతా తెరిచింది. కెంద్రీ పెజ్ (45+4వ ని.లో) గోల్‌తో ఈక్వెడార్ ఆధిక్యం 2–0కు పెరిగింది. 54వ నిమిషంలో ఆంటోనియో జమైకాకు తొలి గోల్ అందించాడు. అలాన్ మిండా (90+1వ ని.లో) గోల్‌తో ఈక్వెడార్ విజయాన్ని ఖాయం చేసుకుంది. మరో మ్యాచ్‌లో వెనిజులా 1–0తో మెక్సికోను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

అక్టోబర్‌లో గ్లోబల్ చెస్ లీగ్

లండన్: అంతర్జాతీయ చెస్ సమాఖ్య, టెక్ మహీంద్రా సంయుక్త ఆధ్వర్యంలో రెండో ఎడిషన్ గ్లోబల్ చెస్ లీగ్‌కు లండన్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఈ లీగ్‌ను నిర్వహిస్తారు. పది రోజులపాటు ఆరు జట్ల మధ్య జరిగే ఈ లీగ్‌లో మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడతారు. గత ఏడాది దుబాయ్‌లో జరిగిన తొలి ఎడిషన్‌లో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది.

జయహో జార్జియా

పోర్చుగల్‌పై సంచలన విజయం

గెల్‌సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొంటున్న తొలిసారే జార్జియా జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎఫ్'లో భాగంగా జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జార్జియా 2–0 గోల్స్ తేడాతో 2016 చాంపియన్ పోర్చుగల్ జట్టుపై సంచలన విజయం నమోదు చేసింది. రెండో నిమిషంలోనే క్వరాత్‌స్కెలియా గోల్‌తో జార్జియా 1–0తో ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత 57వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను మికాట్జె లక్ష్యాన్ని చేర్చడంతో జార్జియా ఆధిక్యం 2–0కు పెరిగింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న జార్జియా విజయాన్ని ఖాయం చేసుకుంది. పోర్చుగల్ దిగ్గజ ప్లేయర్, కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో 66 నిమిషాలపాటు ఆడి ఆ తర్వాత మైదానం వీడాడు. రొనాల్డోను పక్కా ప్రణాళికతో కట్టడి చేయడంలో జార్జియా డిఫెండర్లు సఫలమయ్యారు. జార్జియా చేతిలో ఓడినప్పటికీ ఇదే గ్రూప్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన పోర్చుగల్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'ఎఫ్'లోని మరో మ్యాచ్‌లో టర్కీ 2–1తో చెక్ రిపబ్లిక్‌ను ఓడించి నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గురువారంతో యూరో టోర్నీ లీగ్ దశ మ్యాచ్‌లన్నీ పూర్తయ్యాయి. ఈనెల 29 నుంచి ప్రిక్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో స్విట్జర్లాండ్‌తో ఇటలీ; ఇంగ్లండ్‌తో స్లొవేకియా; డెన్మార్క్‌తో జర్మనీ; స్పెయిన్‌తో జార్జియా; బెల్జియంతో ఫ్రాన్స్; స్లొవేనియాతో పోర్చుగల్; రొమేనియాతో నెదర్లాండ్స్; ఆస్ట్రియాతో టర్కీ తలపడతాయి.



'పారిస్ నుంచి పతకాలతో తిరిగి రండి'

భారత రాష్ట్రపతి ఆకాంక్ష



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న భారత క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 'బెస్ట్ విషెస్' చెప్పారు. పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో ఆమె మన ఆటగాళ్లు ఎక్కువ పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. 'ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో భారత యువ ఆటగాళ్లకు ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు పోటీల్లో రికార్డు సంఖ్యలో పతకాలు గెలుస్తున్నారు. కొద్ది రోజుల్లో పారిస్‌లో ఒలింపిక్స్‌లో ప్రారంభం కానున్నాయి. అందులో పాల్గొనే ప్రతీ భారత అథ్లెట్‌లను చూసి మేం గర్విస్తున్నాం. వారికి నా అభినందనలు' అని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. మరోవైపు 2036 ఒలింపిక్స్ కోసం భారత్ బిడ్ వేసే అంశాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. మన ఘనతలను మరింత ముందుకు తీసుకెళ్లే ఆలోచనతో భారత ఒలింపిక్ సంఘం 2036 ఒలింపిక్స్ కోసం బిడ్ వేసేందుకు సిద్ధమవుతోందని ముర్ము అన్నారు. ఒలింపిక్స్ నిర్వహణ కోసం జరిగే బిడ్‌లో ఖతర్, సౌదీ అరేబియా, ఇండోనేసియా లాంటి దేశాలతో భారత్ పోటీ పడే అవకాశం ఉంది.

అథ్లెటిక్స్‌లో భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్



పంచ్‌కుల: జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో తొలి రోజు భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్ దక్కింది. మహిళల 400 మీటర్ల విభాగంలో హరియాణాకు చెందిన 23 ఏళ్ల కిరణ్ పహల్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 400 మీటర్ల సెమీఫైనల్ రేసును కిరణ్ 50.92 సెకన్లలో ముగించి ఒలింపిక్ అర్హత ప్రమాణ సమయాన్ని (50.95 సెకన్లు) అధిగమించింది. ఇప్పటి వరకు అథ్లెటిక్స్‌లో భారత్ నుంచి 14 ఈవెంట్స్‌లో ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి.

పదేళ్ల తర్వాత టెస్టు సమరం

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత మహిళల ఏకైక టెస్టు

- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వాల్‌వార్ట్


టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి, కెప్టెన్ హర్మన్‌ప్రీత్

చెన్నై: దశాబ్ద కాలం తర్వాత భారత్, దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్లు టెస్టు మ్యాచ్‌లో తలపడనున్నాయి. నేటి నుంచి జరిగే ఏకైక టెస్టులో సఫారీ టీమ్‌ను సొంతగడ్డపై భారత్ ఎదుర్కోనుంది. దక్షిణాఫ్రికాపై 3–0తో వన్డే సిరీస్ గెలిచిన భారత్ జోరు మీదుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత్ నుంచి కనీసం ఐదుగురు కొత్త ప్లేయర్లు టెస్టుల్లో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. ఉమా చెత్రి, ప్రియా పూనియా, సైకా ఇషాక్, అరుంధతి రెడ్డి, షబ్నమ్ షకీల్ తమ తొలి టెస్టు బరిలోకి దిగవచ్చని అంచనా. వన్డేలు, టి20లతో పోలిస్తే భారత మహిళల జట్టు చాలా తక్కువ సంఖ్యలో టెస్టులు ఆడుతోంది. రెండేళ్ల విరామం తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో భారత్ టెస్టు ఆడింది. వరుసగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో పోటీ పడిన మన టీమ్ రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది. అయితే ఆ తర్వాత జట్టు మళ్లీ బరిలోకి దిగలేదు. దక్షిణాఫ్రికాతో ఆఖరిసారిగా 2014లో మైసూరు టెస్టులో తలపడిన జట్టు 34 పరుగులతో గెలుపొందింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. బౌలింగ్‌కు సంబంధించి పూజ వస్త్రకర్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా ప్రభావం చూపించగలరు. చెపాక్ మైదానంలో సాధారణంగా స్పిన్‌ను బాగా అనుకూలిస్తుంది కాబట్టి భారత్ కోణంలో ఇది సానుకూలాంశం. మరోవైపు గత రెండేళ్లలో దక్షిణాఫ్రికా కూడా ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడింది. కెప్టెన్ లారా వాల్‌వార్ట్, స్యూన్ లూస్, డెల్మీ టకర్, తజ్‌మీన్ బ్రిట్స్, అనెక్ బాష్‌లపై జట్టు ఆధారపడుతోంది. పిచ్ అనుకూలిస్తే స్పిన్నర్ ఎంలాబా భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలదు.

సాక్షి
శుక్రవారం
28-6-2024

బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
569	176
79,243	24,044

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,873	▲	63
డోజోన్స్	39,235	▲	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,180	▼	46
డాక్స్	18,211	▲	55
షాంఘై	2,946	▼	27
నికాయ్	39,342	▲	326

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,391	▲	124
బంగారం (99.5 స్వచ్ఛత)	71,105	▲	123
వెండి (కేజీ)	87,043	▲	99

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.01
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.84	107.40
€	యూరో	ఎస్‌బీఐ	88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.88	53.01
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా!

దమానీల నుంచి 23 శాతం వాటా కొనుగోలు • డీల్ విలువ రూ. 1,889 కోట్లు • ప్రస్తుతం ప్రమోటర్ల వాటా 28.42 శాతం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా చెన్నైకు చెందిన ఇండియా సిమెంట్స్‌లో భారీ వాటాను దక్కించుకుంది. ఇండియా సిమెంట్స్‌లో దమానీలకు ఉన్న 23 శాతం వాటాను సొంతం చేసుకుంది. బీఎస్‌ఈ గణాంకాల ప్రకారం ఇందుకు రూ. 1,889 కోట్లు వెచ్చించింది. తద్వారా ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్ల తదుపరి రెండో పెద్ద వాటాదారుగా అవతరించింది. రెండు బ్లాక్ డీల్స్ ద్వారా షేరుకి రూ. 265–283 ధరల శ్రేణిలో మొత్తం 7,05,64,656 షేర్లను కొనుగోలు చేసింది. ఇది 22.77 శాతం వాటాకు సమానం కాగా.. ప్రస్తుతం ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్లు 28.42 శాతం వాటాను కలిగి ఉన్నారు. వాటాను విక్రయించిన వారిలో దమానీలు.. గోపీకిషన్ శివకిషన్, కిరణ్ దేవి, రాధాకిషన్ శివకిషన్, శ్రీకాంత దేవి ఉన్నారు. ఆర్‌కే దమానీకి చెందిన డిరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్, డిరైవ్ ట్రేడింగ్ అండ్ రిసార్ట్స్ సైతం షేర్లను విక్రయించాయి. గురువారం సమావేశమైన బోర్డు ఇండియా సిమెంట్స్‌లో దాదాపు 7.06 కోట్ల షేర్ల కొనుగోలుకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అల్ట్రాటెక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఇండియా సిమెంట్స్‌లో 23% నియంత్రేతర వాటా కొనుగోలుని ఫైనాన్షియల్ పెట్టుబడిగా అల్ట్రాటెక్ పేర్కొంది.

ఇండియా సిమెంట్స్ తీరిదీ...

2024 మార్చి31 కల్లా ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్ల వాటా 28.42 శాతంగా నమోదైంది. కంపెనీ వైస్‌చైర్మన్, ఎండీ ఎన్. శ్రీనివాసన్ 0.36



శాతం వాటాను కలిగి ఉన్నారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఈడబ్ల్యూఎస్ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 21.56 శాతం వాటా ఉంది. కంపెనీ మొత్తం 16 ఎంటీపీఏ సిమెంట్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిలో అనుబంధ కంపెనీ త్రినేత్ర సిమెంట్‌కుగల 1.5 ఎంటీపీఏ సామర్థ్యం కలసి ఉంది. గతేడాది (2023-24) ఇండియా సిమెంట్స్ రూ. 5,112 కోట్ల ఆదాయం, రూ. 227 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది (2022-23)లో నమోదైన రూ. 127 కోట్లతో పోలిస్తే నష్టం పెరిగింది. 2023 సెప్టెంబర్‌లో ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లాలోని కంటకాపల్లె, చిన్నిపాలెంలోగల 73.75 ఎకరాల భూమిని విక్రయించింది. వీటిని రూ. 70 కోట్లకు అల్ట్రాటెక్ సొంతం చేసుకుంది. 2022 అక్టోబర్‌లో స్ప్రింగ్‌వే మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు రూ. 477 కోట్లకు విక్రయించింది.

అల్ట్రాటెక్ స్పీడ్..

అల్ట్రాటెక్ సిమెంట్ స్థాపిత సామర్థ్యం వార్షికంగా 152.7 మిలియన్ టన్నులు (ఎంటీపీఏ)కాగా.. విస్తరణ బాటలో సాగుతోంది. మహారాష్ట్రలోని ఇండియా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ. 315 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఏప్రిల్ 20న ప్రకటించింది. వైట్ సిమెంట్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ తయారీ కోసం యూఏఈ సంస్థ రాక్ సిమెంట్‌లో 25 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు ఈ వారం మొదట్లో ఆఫర్ ధరను సవరించింది. విస్తరణ నేపథ్యంలో గ్రే సిమెంట్ సామర్థ్యం 198.2 ఎంటీపీఏను తాకనుంది.

ఈ వార్తలతో అల్ట్రాటెక్ షేరు 5 శాతం జంప్‌చేసి రూ. 11,715కు చేరగా.. ఇండియా సిమెంట్స్ 11%పైగా దూసుకెళ్లి రూ. 293 వద్ద స్థిరపడింది.

'టాటా' బ్రాండ్ టాప్

తర్వాతి స్థానాల్లో ఇన్ఫీ, హెచ్‌డీఎఫ్‌సీ

న్యూఢిల్లీ: భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా మళ్లీ 'టాటా' గ్రూప్ నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ తాజా నివేదికలో టాటాలకు మొదటిస్థానం దక్కింది. ఐటీ రంగ కంపెనీ ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి. టాటా గ్రూప్ విలువ 9 శాతం పెరిగి 28.6 బిలియన్ డాలర్లకు చేరినట్టు బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది. 'తొలిసారి ఒక భారత బ్రాండ్ 30 బిలియన్ డాలర్లకు చేరువ అవుతున్నట్టు టాటా గ్రూప్ బ్రాండ్ విలువ తెలియజేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలోని ఆశాభావాన్ని ఇది ప్రతిఫలిస్తోంది' అని బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక పేర్కొంది.



జియో చార్జీలు పెరుగుతున్నాయ్

- జూలై 3 నుంచి కొత్త రేట్లు
- అపరిమిత 5జీ డేటాకు పరిమితి

న్యూఢిల్లీ: టెలికం కంపెనీ రిలయన్స్ జియో చార్జీలను 12–27 శాతం పెంచుతోంది. జూలై 3 నుంచి కొత్త రేట్లు అమలులోకి రానున్నాయని కంపెనీ వెల్లడించింది. రెండేళ్ల తర్వాత టారిఫ్‌లను సవరించింది. ప్రస్తుతం ఆఫర్ చేస్తున్న అపరిమిత 5జీ డేటా సేవలకు పరిమితులు విధించనుంది. రోజుకు 2 జీబీ, అంతకంటే ఎక్కువ డేటా ఆఫర్ చేసే ప్లాన్స్‌కు మాత్రమే అపరిమిత 5జీ డేటా లభిస్తుంది. కంపెనీ తాజా నిర్ణయం 47 కోట్లపైచిలుకు రిలయన్స్ జియో మొబైల్ కస్టమర్లపై ప్రభావం పడనుంది. రూ.15 విలువగల 1 జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ రూ.19 కానుంది. రూ.399 ఖరీదు చేసే 75 జీబీ పోస్ట్‌పెయిడ్ డేటా ప్లాన్ కోసం రూ.449 చెల్లించాల్సి ఉంటుంది. 84 రోజుల వ్యాలిడిటీగల రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ ఇక నుంచి రూ.799కి లభిస్తుంది. కొత్తగా కమ్యూనికేషన్, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్ కోసం జియో సేఫ్, అలాగే వాయిస్ కాల్స్, మెసేజెస్, టెక్స్ట్ ట్రాన్స్‌లేషన్ కోసం జియో ట్రాన్స్‌లేట్ యాప్స్‌ను పరిచయం చేసింది.





ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను

- ఐటీ, ఇంధన షేర్లకు భారీ డిమాండ్

ముంబై: ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. తొలిసారి సెన్సెక్స్ 79 వేలు, నిఫ్టీ 24 వేల పాయింట్ల మార్కును దాటాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1%, టీసీఎస్, ఇన్ఫోసిస్ 2%, అల్ట్రాటెక్ సిమెంట్ 5%, ఎన్‌టీపీసీ 3% పెరిగి సూచీల రికార్డుల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు, కాసేపటికే పుంజుకొని తాజా రికార్డులు నమోదు చేశాయి. మిడ్‌సెషన్ నుంచి కొనుగోళ్లు మరింత ఊపందుకోవడంతో ఇరు సూచీలు సరికొత్త రికార్డుల ఎగువనే ముగిశాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 721 పాయింట్లు ఎగసి 79,396 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 569 పాయింట్ల లాభంతో 79,243 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 219 పాయింట్లు బలపడి 24,087 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 176 పాయింట్లు బలపడి 24,044 వద్ద నిలిచింది. రికార్డుల ర్యాలీలోనూ ఫైనాన్స్, పారిశ్రామిక, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 % లాభపడగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ అరశాతానికి పైగా నష్టపోయింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు బలపడి 83.45 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. యూరప్ సూచీలు బలహీనంగా ముగిశాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాలతో ట్రేడవుతున్నాయి.

''జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ జరగడంతో సెన్సెక్స్ 79 వేలు, నిఫ్టీ 24 వేల స్థాయిలను అధిగమించాయి. అధిక వెయిటేజీ షేర్లు రాణించడం, రాజకీయ స్థిరత్వం, విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమన అంశాలు సూచీలను సరికొత్త శిఖరాలపైకి చేర్చాయి. అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి'' రిలిగేర్ బ్రోకింగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

స్టాక్ మార్కెట్ రికార్డు ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరింది. సెన్సెక్స్ 4 రోజుల్లో 2,033 పాయింట్లు(2.63%) పెరగడంతో రూ.3.93 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆల్‌టైం రికార్డు రూ.438.41 లక్షల కోట్లకు చేరింది.



ర్యాలీ ఇలా

నిఫ్టీ	చేరేందుకు పట్టిన కాలం
20,000	51 రోజులు
21,000	60 రోజులు
22,000	25 రోజులు
23,000	88 రోజులు
24,000	25 రోజులు



ఫార్మా ఎగుమతులు 29 బిలియన్ డాలర్లు!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 29 బిలియన్ డాలర్లను మించనున్నాయని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. 2023–24లో ఫార్మా ఎగుమతులు 27.85 బిలియన్ డాలర్లు నమోదయ్యాయని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ తెలిపారు. సీనియర్ డైరెక్టర్ సీహెచ్.లక్ష్మీ ప్రసన్నతో కలిసి గురువారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. '2024 ఏప్రిల్–మే నెలలో భారత్ నుంచి విదేశాలకు చేరిన ఔషధాల విలువ 8.85 శాతం వృద్ధితో 4.73 బిలియన్ డాలర్లు ఉంది. ఎగుమతుల్లో 31.35 శాతం వాటా కైవసం చేసుకున్న యూఎస్ మార్కెట్ గత ఆర్థిక సంవత్సరంలో 15.66 శాతం దూసుకెళ్లడం భారతీయ కంపెనీలకు కలిసి వచ్చే అంశం. యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ప్లాంట్లు దేశవ్యాప్తంగా 748 ఉన్నాయి. యూఎస్ వెలుపల ఇలాంటి తయారీ కేంద్రాలు అత్యధికంగా ఉన్నది భారత్‌లోనే. 2030 నాటికి దేశం నుంచి ఫార్మా ఎక్స్‌పోర్ట్స్ 55 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా. 2023–29 మధ్య 112 బిలియన్ డాలర్ల విలువైన 15 ఉత్పత్తులకు పేటెంట్ ముగియనుంది. వీటి ద్వారా భారత్‌కు అదనంగా 10 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనుంది. అరబిందో ఫార్మా కొత్త ప్లాంటుతో పెన్సిలిన్–జి కోసం చైనాపై ఆధారపడడం తగ్గుతుంది' అని వివరించారు.

జీఆర్‌టీ 'డైమండ్ ఫెస్టివల్'

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ 'డైమండ్ ఫెస్టివల్' పేరుతో గొప్ప ఆఫర్‌ను ప్రకటించింది. ప్రత్యేకంగా చేతితో తీర్చిదిద్దిన అద్భుతమైన వజ్రాలు, అన్‌కట్ డైమండ్ ఆభరణాలపై 25% తగ్గింపు అందిస్తుంది. ప్లాటినం ఆభరణాల తయారీ చార్జీలపై 30% డిస్కౌంట్ పొందవచ్చు. ఈ ప్రత్యేక ఆఫర్లు ఒరియానా లైట్ వెయిట్ డైమండ్ ఆభరణాలకూ వర్తిస్తాయి. 'కస్టమర్ల వజ్రాభరణాల కలలను సాకారం చేసుకునేందుకు అవకాశం కల్పించడమే ఈ డైమండ్ ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశం. కావున ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము' అని జీఆర్‌టీ జ్యువెలర్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

తనిష్క్ నుంచి 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్

హైదరాబాద్: టాటా గ్రూప్ జ్యువెలరీ బ్రాండ్ తనిష్క్ తన 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్‌ను పారిస్ హాట్ కోచర్ వీక్ – 2024లో విడుదల చేసింది. ప్రఖ్యాత మహిళా డిజైనర్ వైశాలి షడంగులే భాగస్వామ్యంలో ఈ సరికొత్త కలెక్షన్ రూపొందించారు. ''అసాధారణ కళాత్మకత, మెరుగైన అభిరుచుల మేళి కలయిక ఈ 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్. ప్రకృతిలోని సామరస్యం, సమతుల్యతను ప్రతిబింబించే డిజైన్లు ఇందులో ఉన్నాయి'' అని కంపెనీ చీఫ్ డిజైనర్ రేవతి కాంత్ తెలిపారు. ప్రకృతి, లగ్జరీ అనే భావనలను 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్ మరింత శక్తివంతం చేస్తుందని షడంగులే అన్నారు.

సినిమా


• వెంకటేశ్

ముహూర్తం కుదిరింది

'ఎఫ్ 2, ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, ఆ పోలీసాఫీసర్ మాజీ ప్రేయసి... ఈ మూడు ప్రధాన పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను అధికారికంగా వెల్లడించి, వచ్చే సంక్రాంతికి విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే తాజాగా ఈ సినిమా స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేశారట దర్శకుడు అనిల్ రావిపూడి. మరోవైపు 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌లో తన వంతు షూటింగ్‌ను పూర్తి చేశారట వెంకటేశ్. దీంతో వెంకటేశ్–అనిల్‌ల కాంబినేషన్‌లోని సినిమా ప్రారంభోత్సవానికి జూలై మొదటివారంలో ముహూర్తం కుదిరిందని తెలిసింది. అదే నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్లాన్ చేశారని టాక్. అలాగే ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి ఓ హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.


• రామ్‌చరణ్

పది రోజులతో ఆట పూర్తి

'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'వినయ విధేయ రామ' మూవీ తర్వాత రామ్‌చరణ్, కియారా అద్వానీ మరోసారి 'గేమ్ చేంజర్'లో జోడీగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రం గురించి దర్శకుడు శంకర్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. 'భారతీయుడు 2' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో శంకర్ మాట్లాడుతూ– ''గేమ్ చేంజర్' చిత్రీకరణ క్లైమాక్స్‌కు చేరుకుంది. కేవలం పది రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. ప్రస్తుతం 'భారతీయుడు 2' (కమల్‌హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రం జూలై 12న రిలీజ్ కానుంది) సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాను. ఆ సినిమా విడుదలయిన తర్వాత 'గేమ్ చేంజర్' షూటింగ్ పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెడతాం. వీలైనంత త్వరగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా'' అన్నారు. శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి, ఎస్‌జె సూర్య, సముద్రఖని ముఖ్య పాత్రల్లో నటిస్తున్న 'గేమ్ చేంజర్' రాజకీయ నేపథ్యంలో రూపొందుతోంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని టాక్.


• సూర్య

దసరాకి కంగువ

దసరా పండక్కి థియేటర్స్‌కు వస్తున్నాడు 'కంగువ'. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ అండ్ టైమ్ ట్రావెల్ మూవీ 'కంగువ'. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న సినిమా ఇది. తాజాగా 'కంగువ' సినిమాను ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల చేస్తున్నట్లుగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు సూర్య. రిలీజ్ డేట్‌ని బట్టి 'కంగువ' దసరా పండగ సందర్భంగా విడుదల అవుతుందని తెలుస్తోంది. ఇక 'కంగువ' సినిమా డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో ఉంటుందని, సూర్య ఐదారు గెటప్స్‌లో కనిపిస్తారని, ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


• రష్మికా మందన్నా

ఈసారి సెట్?

తమిళ హీరో శివ కార్తికేయన్, హీరోయిన్ రష్మికా మందన్నా జంటగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. హీరో శివ కార్తికేయన్, దర్శకుడు సిబీ చక్రవర్తి కాంబినేషన్‌లో వచ్చిన కాలేజ్ క్యాంపస్ డ్రామా 'డాన్' (2022) హిట్ మూవీగా నిలిచింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా రానుందనే టాక్ తెరపైకి వచ్చింది. అంతేకాదు... ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా నటించనున్నారనే ప్రచారం కూడా కోలీవుడ్‌లో జరుగుతోంది. ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత రష్మికా మందన్నా పేరు వినిపించింది. ఆ తర్వాత కియారా అద్వానీ పేరు కూడా తెరపైకి రాగా.. ఫైనల్‌గా కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారు. మరి... ప్రచారంలో ఉన్నట్లుగా ఈసారైనా శివ కార్తికేయన్, రష్మికల జోడీ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.

గ్యాంగ్‌స్టర్ రెడీ

చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్‌గా నటించారు. రవి, నరసింహ సమర్పణలో వైల్డ్ వారియర్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన 'గ్యాంగ్‌స్టర్' ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమానికి నిర్మాతలు మిర్యాల రవీందర్ రెడ్డి, సెవెన్ హిల్స్ సతీష్ కుమార్, 'రజాకార్' మూవీ డైరెక్టర్ యాట సత్యనారాయణ అతిథులుగా హాజరై, 'గ్యాంగ్‌స్టర్' విజయం సాధించాలని ఆకాంక్షించారు. చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ– ''కొన్ని షార్ట్ ఫిలింస్ చేసిన తర్వాత నాలుగేళ్ల కిందట 'గ్యాంగ్‌స్టర్' కథ రాశాను. సినిమా టైటిల్స్‌లో నాలుగైదు పేర్లు నావే ఉండాలని నేను అనుకోలేదు. డబ్బులు లేక ఫైట్స్, ఎడిటింగ్, కొరియోగ్రఫీ కూడా నేనే చేసుకున్నా. మా సినిమా టీజర్ విజయేంద్రప్రసాద్‌గారికి నచ్చడంతో 'దిల్' రాజుగారికి ఫోన్ చేసి చెప్పారు. రాజుగారికి కూడా మా టీజర్ నచ్చింది. వారి సంస్థలో మా సినిమా రిలీజ్ కావాల్సి ఉంది'' అన్నారు.


• కాశ్వీ, చంద్రశేఖర్ రాథోడ్



• అజిత్

అజిత్ హీరోగా నటిస్తున్న ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా సెకండ్ లుక్‌ను గురువారం విడుదల చేశారు మేకర్స్. ఫుల్ మాస్ లుక్‌లో కనిపించారు అజిత్. 2025 సంక్రాంతికి విడుదల కానున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


• మాళవికా మీనన్

కథ డిమాండ్ చేస్తే...

''నేను మలయాళం, తెలుగు, తమిళ చిత్రాల్లో నటించాను. అయితే ఇప్పటివరకు ముద్దు సన్నివేశాలు చేయలేదు. కథ డిమాండ్ చేస్తే గ్లామర్ పాత్రలు, ముద్దు సన్నివేశాలు చేసేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదు'' అంటున్నారు హీరోయిన్ మాళవికా మీనన్. అందం, అభినయంతో దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు ఈ మలయాళ బ్యూటీ. తెలుగులో మాళవికా మీనన్ 'లవ్ కే రన్' (2016), 'అమ్మాయిలు అంతే అదో టైపు' (2018) వంటి చిత్రాల్లో నటించారు. అయితే పలు కారణాల వల్ల ఆ సినిమాలు ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. తాజాగా ఆమె నటించిన మలయాళ సినిమాలు 'తంగమణి, వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ కొచ్చి' ఇటీవల విడుదలై ప్రేక్షకాదరణ పొందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''నేను మొదటిసారి నటించిన మలయాళ చిత్రం 'నిద్ర' (2011). అందులో హీరో చెల్లెలి పాత్ర చేశాను. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. '916' (2012) అనే మలయాళ మూవీ ద్వారా కథానాయికగా పరిచయమయ్యాను. మలయాళ సినిమాల్లో గ్లామర్ పాత్రలకు అవకాశం ఉండదు. అయితే తెలుగు, తమిళ భాషల్లో ఆ అవకాశాలు బాగుంటాయి... ఈ రెండు భాషల్లోనూ గ్లామరస్ హీరోయిన్‌గా నటించడానికి స్కోప్ ఉంటుంది'' అన్నారు.

క్లుప్తంగా...

ఏడీసీఎల్ సీఎండీగా లక్ష్మీ పార్థసారథి

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్‌డీఏ పరిధిలోని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీ పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యాన కేవీకేలకు తొమ్మిది అవార్డులు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకుల విభాగంలోని 4 కృషి విజ్ఞాన కేంద్రాలకు జోనల్‌స్థాయిలో 9 అవార్డులు లభించాయి. వ్యవసాయ సాంకేతిక పరిశోధన అనుప్రయోగ సంస్థ (అటరీ–హైదరాబాద్), కేంద్ర వాణిజ్య పంటల పరిశోధన సంస్థ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ సంయుక్తంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన కేవీకేల ప్రాంతీయ సదస్సులో అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు,పుదుచ్చేరి పరిధిలోని 72 కేవీకేలు ఇందులో భాగస్వాములయ్యాయి. కేవీకే వెంకటరామన్నగూడెంకు ఉత్తమ ఆర్య పథకం అమలు, ఉత్తమ చేపలు,రొయ్యల సాగు శిక్షణలు, ఉత్తమ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు విభాగాల్లో అవార్డులు దక్కాయి. పందిరమామిడి కేవీకేకి రబ్బర్ సాగులో ఉత్తమ కార్యక్రమాలు, అత్యధిక నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమల్లో అవార్డులు లభించాయి. పెరియవరం కేవీకేకు ఉత్తమ పోషణ తోటల ఏర్పాటు, ఉత్తమ ఫొటో విభాగాల్లో అవార్డులు వరించాయి. వోనిపెంట కేవీకేకు చిరుధాన్యాల సాగు ప్రోత్సాహం, ఉత్తమ బాక్స్ ఫొటో అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను అటరీ డైరెక్టర్ డా.షేక్.ఎన్.మీరా అందజేశారు.

అక్రమ మద్యం ధ్వంసం



కాకినాడ రూరల్: ఎన్నికల సమయంలో భారీగా పట్టుబడిన మద్యాన్ని కాకినాడ జిల్లా పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం ధ్వంసం చేశారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ న్యూ బీచ్ వద్ద ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న సిమెంట్ రోడ్డుపై రోడ్డు రోలర్‌తో తొక్కించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ కె.లక్ష్మి, ఎస్ఈబీ సూపరింటెండెంట్ జె.రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరంగం దొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాకు చెందిన ఎస్ఈబీ, పోలీసు అధికారులు, సిబ్బంది సుమారు 100 మంది పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

మూడు రోజులపాటు రాష్ట్రానికి మోస్తరు వర్ష సూచన

సాక్షి, విశాఖపట్నం: వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా కొనసాగుతోంది. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో నైరుతి దిశగా ఉంది. మరోవైపు.. పశ్చిమ, నైరుతి దిశగా బలమైన గాలులు వీస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు దేశమంతటా క్రమంగా విస్తరిస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు కోస్తా, రాయలసీమకు మోస్తరు వర్ష సూచన ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేడు, రేపు పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. అదేవిధంగా కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలకు ఆస్కారముంది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కేఎస్ రావుకు సృజన్ శిఖర్ పురస్కారం

సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవా న్యాస్ సమితి ప్రతి ఏటా ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తోంది. భారతీయ భాషాసాహిత్యాల అభివృద్ధికి చేస్తున్న కృషికి, జాతీయస్థాయిలో నిరంతర సాహితీసేవకు గుర్తింపుగా శ్రీనివాసరావుకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు నాందీ సేవా న్యాస్ సమితి పేర్కొంది. వారణాసిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రంతో సత్కరించింది.

ఏపీ లాసెట్ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ: రాష్ట్రవ్యాప్తంగా లా కోర్సుల్లో ప్రవేశాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జూన్ 9వ తేదీన నిర్వహించిన ఏపీ లాసెట్ –2024 ఫలితాలను గురువారం విడుదల చేశారు. లాసెట్ కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ మాట్లాడుతూ 19,224మంది హాజరు కాగా 89.04 శాతం చొప్పున 17,117 మంది అర్హత సాధించారని తెలిపారు.

పిన్నెల్లికి రిమాండ్

బుధవారం అర్ధరాత్రి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మాచర్ల మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చిన పోలీసులు



మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మాచర్ల కోర్టు నుంచి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

సాక్షి, నరసరావుపేట/నెల్లూరు (క్రైం): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మాచర్ల అదనపు జూనియర్ సివిల్ కోర్టు రెండు కేసుల్లో 14 రోజుల రిమాండ్ విధించింది. మరో రెండు కేసుల్లో బెయిల్ మంజూరు చేస్తూ మేజిస్ట్రేట్ ఎస్. శ్రీనివాస కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ రోజు, తరువాత జరిగిన ఘటనలపై తనపై అక్రమ కేసులు నమోదు చేశారంటూ పిన్నెల్లి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను బుధవారం మధ్యాహ్నం హైకోర్టు తోసిపుచ్చడం, ఆ వెంటనే పోలీసులు ఆయన్ని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి నరసరావుపేట ఏరియా వైద్యశాలలో వైద్య పరీక్షల అనంతరం ఆయన్ని మాచర్లకు తరలించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస కల్యాణ్ ముందు హాజరుపరిచారు. ఆయనపై నమోదైన నాలుగు కేసులపై విడివిడిగా ఇరుపక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. తెల్లవారుజాము నాలుగు గంటల వరకు వాదనలు కొనసాగాయి. మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం కేసు, పోలింగ్ బూత్ ముందు మహిళను బెదిరించారంటూ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కారంపూడి సీఐ నారాయణస్వామి, టీడీపీ నేత నంబూరి శేషగిరి రావుపై దాడి కేసుల్లో రిమాండ్ విధించింది. పిన్నెల్లిని నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. వెంటనే ఆయన్ని పటిష్ట భద్రత మధ్య నెల్లూరు తీసుకెళ్లారు. గురువారం ఉదయం 8.30 గంటలకు నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. ముందు జాగ్రత్తగా కేంద్ర కారాగారం వద్ద పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. ఎవరూ అక్కడికి రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

కోర్టు వద్దే పిన్నెల్లిపై దాడికి యత్నం

పిన్నెల్లిని కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకువచ్చిన సమయంలో కోర్టు వద్దే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనపై దురుసుగా వ్యవహరించారు. పిన్నెల్లికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోర్టు ముందే పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. పిన్నెల్లి కోర్టు లోపలికి వెళ్తున్న సమయంలో మాచర్లకు చెందిన టీడీపీ కార్యకర్త కొమేర శివ అడ్డంగా నిలబడి దురుసుగా మాట్లాడాడు. ఆయనపై దాడి చేయబోయాడు. పోలీసులు అడ్డుకోకపోవడంతో పిన్నెల్లి అతన్ని తోసుకొని కోర్టులోకి వెళ్లిపోయారు. కోర్టు వద్ద పోలీసులు వ్యవహరించిన తీరు అందరినీ విస్మయానికి గురి చేసింది. మాజీ ఎమ్మెల్యేని కోర్టులో హాజరుపరుస్తున్న సందర్భంలో ప్రత్యర్థి పార్టీ అయిన టీడీపీ కార్యకర్తలను అక్కడకు అనుమతించడమే కాకుండా వారు రెచ్చగొట్టేలా దుర్భాషలాడుతున్నా, బాణాసంచా కాల్చుతూ వికృత చేష్టలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. పిన్నెల్లిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసే అవకాశం ఉందని తెలిసి కూడా ఆయన్ని కోర్టుకు తీసుకువచ్చే సమయానికి వారిని చెదరగొట్టలేదు. పిన్నెల్లిని కోర్టు లోపలికి తీసుకువెళ్లే సమయంలో ఆయన ముందు పోలీసులు ఎవరూ లేరు. అందువల్లే టీడీపీ కార్యకర్త శివ కోర్టు ప్రాంగణంలోనే నేరుగా పిన్నెల్లికి ఎదురు రాగలిగాడు. వెంటనే అతన్ని నిలువరించకపోగా, అతను కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా, దాడికి యత్నించినా పట్టించుకోకపోవడం పోలీసుల ఉద్దేశపూర్వక చర్యేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. పైగా, ఉద్దేశపూర్వకంగా కోర్టు వద్దే పిన్నెల్లికి అడ్డు నిలబడి, దుర్భాషలాడిన టీడీపీ కార్యకర్త శివే తనపై పిన్నెల్లి దాడి చేశారంటూ మాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఏటయిందే గోదారమ్మ..!

ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి ఇప్పటికీ పదివేల క్యూసెక్కుల ప్రవాహమే



నీరు లేక వెలవెలబోతున్న గోదావరి నది

సాక్షి, అమరావతి :జూన్ నెలాఖరుకు చేరుకుంటున్నా గోదావరి గలగలలు విన్పించడంలేదు. డెల్టా కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడానికి అవసరమైనన్ని జలాలు ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి చేరని పరిస్థితి. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితిలేదని రైతులు వాపోతున్నారు. నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్)లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంవల్లే గోదావరిలో వరద ప్రవాహం కనిష్ఠ స్థాయిని దాటడంలేదని జలవనరుల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ప్రతియేటా సగటున 2,500 నుంచి 3 వేల టీఎంసీల జలాలు సముద్రంలో కలుస్తాయి. ఇది గోదావరి వరద ఉధృతిని చాటిచెబుతుంది. కానీ, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావంవల్ల గోదావరి బేసిన్ విస్తరించిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశాలతోపాటు రాష్ట్రంలోనూ ఓ మోస్తరు మినహా భారీ వర్షాలు కురవడంలేదు. దాంతో గోదావరిలో వరద ప్రవాహం కనిష్ఠ స్థాయిని దాటడంలేదు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి గురువారం 10,113 క్యూసెక్కులు చేరుతుండగా.. 9,550 క్యూసెక్కులను డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. సాధారణంగా జూన్ నాలుగో వారం నాటికి గోదావరిలో సగటున 20 వేల నుంచి 30 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంటుంది. కానీ, ఈ ఏడాది ఇప్పటికీ పదివేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటం గమనార్హం. జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని.. అప్పుడు వరద ప్రవాహం క్రమేణా పెరుగుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మాకు పెద్ద గది కేటాయించండి

- స్పీకర్ ఓం బిర్లాను కోరిన టీడీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో తమ పార్టీ కార్యాలయాన్ని మార్చాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను టీడీపీ ఎంపీలు కోరారు. ఈ మేరకు గురువారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి టీడీపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో ఎంపీల సంఖ్య కారణంగా టీడీపీ కార్యాలయాన్ని 5 వ నంబర్ రూమ్ నుంచి పార్లమెంట్ భవన్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌కి మార్చిన విషయం తెలిసిందే. కొంచెం విశాలంగా ఉన్న గతంలో టీడీపీకి కేటాయించిన రూం నంబర్ 5ను కార్యాలయంగా కేటాయించాలని అభ్యర్థించారు.

చంద్రబాబు పచ్చి విధ్వంసకారుడు

- పిన్నెల్లిపై అక్రమ కేసులు, వైఎస్సార్‌సీపీ ఆఫీసుల కూల్చివేత కక్ష సాధింపే
- వైఎస్ జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ బలమైన పార్టీగా ఎదిగింది
- మా ఒక్కరికే 40 శాతం ఓట్ షేర్ ఉంది.. అక్కడ ముగ్గురు కలిస్తే 60 శాతం
- చంద్రబాబు ఇచ్చిన జీవో ప్రకారమే ప్రభుత్వం స్థలాలు ఇచ్చింది
- పార్టీ భవనాన్ని కూల్చడం విధ్వంసం కాదా?
- మాపార్టీ కార్యాలయాల్లో టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఏం పని?
- పల్నాడు ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజం



మాట్లాడుతున్న మాజీమంత్రి అంబటి రాంబాబు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కాసు, గోపిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు పచ్చి విధ్వంసకారుడని పల్నాడు ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిపై అక్రమంగా కేసుల మీద కేసులు పెట్టడం, వైఎస్సార్‌సీపీ ఆఫీసుల కూల్చివేత ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యలేనని చెప్పారు. ఎన్నికలకు ముందే చంద్రబాబు భారీ ప్లాన్ వేశారని అన్నారు. ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నారని రాసి పారేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సొంత కారులో వెళ్లి సరెండరైతే బాత్రూమ్‌లో దాక్కున్నారని ఓ టీవీలో వేశారు. ఇలాంటి ఫేక్ వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరుతున్నాం. చంద్రబాబు ఇచ్చిన జీవో ప్రకారమే చట్టబద్ధంగానే తమ పార్టీ ఆఫీసులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఏం పని అని ప్రశ్నించారు. తమ పార్టీ ప్రాంగణాల్లో ప్రెస్ మీట్లు పెట్టి కూలుస్తామని చెప్పడం అరాచకం కాదా? ఇది ప్రజాస్వామ్య పాలనేనా అని నిలదీశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నవారు మంచి సంప్రదాయాలు కొనసాగించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు కూడా పాల్గొన్నారు.

పిన్నెల్లిపై ఎన్నికలకు ముందు నుంచే చంద్రబాబు కుట్ర

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రజాదరణ కలిగిన నాయకుడు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంతకు తెగించైనా ఆయన్ని ఓడించాలనే ఉద్దేశంతో ఎన్నికలకు ముందే చంద్రబాబు భారీ ప్లాన్ వేశారు. రాజకీయాలకు దూరంగా ఉన్న బ్రహ్మారెడ్డిని పోటీకి పెట్టారు. పోలింగ్ రోజు ఈవీఎంను పగులగొట్టిన వీడియో లోకేశ్ ట్విట్టర్ నుంచి వచ్చింది. పోలీసులు, ఎన్నికల కమిషన్ విడుదల చేసింది కాదు. ఇది పోలీస్ స్టేషన్లోనే బెయిల్ ఇచ్చే కేసు. కానీ పిన్నెల్లికి బెయిల్ రాకూడదనే దురుద్దేశంతో 307 కేసులు రెండు పెట్టారు. ఈ ఘటన జరిగిన 9 రోజుల తర్వాత ఒక పోలీస్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఓ కేసు పెట్టారు. కక్ష సాధించాలనే ఏకైక దురుద్దేశంతోనే ఇలా కేసులు పెట్టారు. రామకృష్ణారెడ్డి పోలీస్ స్టేషన్‌కు సొంత కారులో వెళ్లడంపైనా ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు తప్పుడు వార్తలు రాశాయి. రాత్రి 12 గంటలకు రామకృష్ణారెడ్డిని కోర్టులో హాజరుపరిచే సమయంలో ఆయనపై కొమ్మెర శివ అనే వ్యక్తి దాడికి ప్రయత్నిస్తే షేక్ హ్యాండ్ ఇవ్వడానికి వెళ్లాడంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అనేక ఫాల్స్ కేసులు మాపై పెడతుందని మాకు తెలుసు. అంతకు ముందు కూడా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్యపైనా దాడి చేశారు. మాపై కేసులు పెట్టేకొద్దీ మేము మరింతగా రాటుదేలుతాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో 12 ఏళ్ల కిందట ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ చాలా బలమైన పార్టీ. తొలిసారి 67 సీట్లు, ఆ తర్వాత ఏకంగా 151 సీట్లు గెలుచుకున్నాం. ఇప్పుడూ 40 శాతం ఓటు షేర్ ఉన్న పార్టీ మాది. అక్కడ ముగ్గురు కలిస్తే 60 శాతం వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా చట్టబద్ధంగా, ధర్మంగా ప్రభుత్వం మా పార్టీకి స్థలాలు కేటాయించింది. ఇదేమీ కొత్త కాదు. చంద్రబాబు పెట్టిన సంప్రదాయమే. ఆయనిచ్చిన జీవోను అనుసరించే కేటాయింపులు జరిగాయి. టీడీపీ ఆఫీసులన్నీ ఇలా కేటాయించుకుని కట్టుకున్నవే. మేం అధికారంలోకి ఉన్నప్పుడు వాటిని పడగొట్టడానికి ప్రయత్నించలేదు. కానీ చంద్రబాబు కూటమి ప్రభుత్వం మా పార్టీపై దుశ్చర్యలకు పాల్పడటం దారుణం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజా వేదికను కూల్చేశారని మాట్లాడిన నోర్లు తాడేపల్లిలో మా పార్టీ ఆఫీసును కూల్చేసినప్పుడు ఏమయ్యాయి? ఇది విధ్వంసం కాదా? చంద్రబాబు పచ్చి విధ్వంసకారుడు అని ఇప్పుడు అర్థమైంది కదా! జగన్ ఓడిపోయాడు కానీ చనిపోలేదని ఒకరంటారు. మీ ఉద్దేశం మమ్మల్ని చంపేయాలనా? మా పార్టీ ఆఫీసులు పడగొట్టేయాలనా? మా పార్టీ ఆఫీసులు కొన్ని చోట్ల కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. అన్ని చోట్లా నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాలు అక్రమం అని అనుమానాలుంటే నోటీసు ఇవ్వాలి. అవన్నీ చట్టబద్ధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆస్తులే. చట్టపరంగా కోర్టులో తేల్చుకుంటాం. ఇప్పుడు మీరు రూపొందిస్తున్న ఈ దుస్సంప్రదాయాలు మీకే ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి.

పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకే టీడీపీ అధికారంలోకి వచ్చినట్లుంది

- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేయడానికే టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నట్లు ప్రవర్తిస్తున్నారు. పిన్నెల్లిలాంటి సీనియర్ లీడర్ కస్టడీలో ఉంటే రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే. కానీ ఆయన్ని కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో కూడా టీడీపీ వారు ఆయనపై దాడికి ప్రయత్నించడం దారుణం. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు చూడలేదు. పైగా, రామకృష్ణారెడ్డే గుద్దారంటూ రాస్తున్నారు. పోలింగ్ తర్వాత ఊదరగొట్టిన ఈవీఎం కేసులో కోర్టు నిన్న రాత్రి బెయిల్ ఇచ్చింది. కారంపూడిలో సీఐపై ఒత్తిడి తెచ్చి పెట్టిన అక్రమ కేసు, పాల్వాయి గేట్‌లో టీడీపీ నాయకుడు పెట్టిన మరో అక్రమ కేసుల్లోనే పిన్నెల్లిని జైల్లో పెట్టారు. వీటిపై చట్టపరంగా పోరాటం చేస్తాం. పిన్నెల్లి తప్పకుండా బయటికి వస్తారు. అందరం కలిసి వైఎస్ జగన్ నాయకత్వంలో పల్నాడు ప్రాంతంలో చేసిన అభివృద్ధిని నిరూపించుకుంటాం. కార్యకర్తలకు అండగా ఉంటాం. మా కార్యాలయాల్లో టీడీపీ నేతలు ప్రెస్ మీట్లు పెట్టడం సమంజసం కాదు. ఈ రోజు మాకు జరిగింది. రేపు మీకు జరగచ్చు. ఇటువంటి చర్యలు ఎటు దారి తీస్తాయో టీడీపీ నేతలకే వదిలేస్తున్నాం.


టీడీపీ అల్లర్లను ప్రజలందరూ గమనించాలి

- నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మాచర్లలో పిన్నెల్లిని ఓడించడానికి టీడీపీ సృష్టించిన వివాదాలు, అల్లర్లను ప్రజలందరూ గమనించాలి. ఎన్నికలకు ముందు పురందేశ్వరి చెప్పినట్లు ఎస్పీలను మార్చారు. కొత్తగా వచ్చిన ఎస్పీ పల్నాడు జిల్లా మొత్తం వదిలేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు మాచర్లకే పరిమితమయ్యారు. మేం ఎవరు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. పిన్నెల్లి సొంతగ్రామం కండ్లగుంటలో ఏకంగా ఒక డీఎస్పీని కేటాయించి ఓటర్ స్లిప్పులు కూడా ఆయనతోనే ఇప్పించారు. టార్గెట్ చేసి ఎలక్షన్ పూర్తిచేశారు. రాష్ట్రంలో 13 చోట్ల ఈవీఎంలు పగలగొడితే ఏవీ బయటకు రాలేదు. కేవలం రామకృష్ణారెడ్డి వీడియో మాత్రమే, అదీ లోకేశ్ ట్విటర్ నుంచే రిలీజ్ చేశారు. ఇది కుట్ర కాదా? టీడీపీ వారు వైఎస్సార్‌సీపీ వారిని బెదిరించి బయటికి పంపి ఎన్నిక ఏకపక్షంగా చేసుకుంటున్నారనే పిన్నెల్లి అక్కడికి వెళ్లారు. అదే సందర్భంలో ఈ పరిణామం జరిగింది. ఆ తర్వాత ఆయన భార్య, కుమారుడిపైనా దాడి చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పోలీసులు వారికి ఇష్టమొచ్చినట్లు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారు. పల్నాడులో ఇది కొత్తకాదు. మేం కచ్చితంగా ఎదుర్కొంటాం, మేమంతా కలిసి పనిచేసి పల్నాడు జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తాం.

ఎడ్‌సెట్‌లో 98.05 శాతం ఉత్తీర్ణత

- టాప్–10 ర్యాంకర్లలో 8 మంది అమ్మాయిలే
- పరీక్ష ఫలితాల్ని విడుదల చేసిన ఎడ్‌సెట్ కన్వీనర్
- ప్రథమ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా



ఫలితాలు విడుదల చేస్తున్న ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొ.వెంకటకృష్ణ, కోర్ కమిటీ సభ్యులు ప్రొ. పాల్ డగ్లస్, ప్రొ. లక్ష్మీనారాయణ

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్–2024 ఫలితాలను కన్వీనర్ ప్రొ. టి.వెంకటకృష్ణ విశాఖలోని ఎడ్‌సెట్ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. పరీక్షకు 10,805 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 9,365 మంది పరీక్షకు హాజరయ్యారు. 98.05 శాతం ఉత్తీర్ణతతో 9,183 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 80 శాతం మంది యువతులే కాగా, 20 శాతం మంది మాత్రమే పురుష అభ్యర్థులు ఉన్నారు. మొదటి 10 ర్యాంకులు సాధించిన వారిలో ఎనిమిది మంది అమ్మాయిలే. మెథడాలజీ వారీగా ఫలితాలను పరిశీలిస్తే ఫిజికల్ సైన్స్‌లో అత్యధికంగా 99.59 శాతం, గణితంలో 99.46, ఇంగ్లిషులో 98.56, సోషల్ స్టడీస్‌లో 97.04, బయలాజికల్ సైన్స్‌లో 96.86 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు కన్వీనర్ వెంకటకృష్ణ తెలిపారు. అదేవిధంగా జిల్లాల వారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే 99.62 శాతంతో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, ఏలూరు జిల్లా 99.56 శాతంతో రెండో స్థానంలోనూ, గుంటూరు జిల్లా 99.12 శాతంతో మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో 52 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఎడ్‌సెట్–2024 కోర్ కమిటీ సభ్యులు ప్రొ.పాల్ డగ్లస్, ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షూలో రూ. 22 కోట్ల విలువైన కొకైన్

- చెన్నై ఎయిర్‌పోర్టులో కెన్యా యువతి అరెస్టు

సాక్షి, చెన్నై: షూలో కొకైన్ ప్యాకెట్లు తీసుకొచ్చిన కెన్యాకు చెందిన యువతిని చెన్నై విమానాశ్రయంలో డీఆర్‌ఐ అధికారులు పట్టుకున్నారు. ఆమె వద్ద రూ. 22 కోట్లు విలువైన కొకైన్‌ను సీజ్ చేశారు. ఆఫ్రికా నుంచి చెన్నైలోకి మాదక ద్రవ్యాలు విమాన మార్గంలో తరలుతున్నట్లుగా వచ్చిన సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. బుధవారం అర్ధరాత్రి ఖతార్‌లోని దోహ నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం చెన్నై వచ్చింది. ఇందులో వచ్చిన ప్రయాణికులను డీఆర్‌ఐ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కెన్యాకు చెందిన 30 ఏళ్ల యువతి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో ఆమెను విచారించారు. సోదాల్లో ఆమె ధరించిన షూస్‌లో కొకైన్ ప్యాకెట్లు కనుగొన్నారు. అంతేకాకుండా ఆమె సూట్‌కేస్‌లో ఇదే తరహాలో మరో నాలుగు షూలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా 2.2 కేజీల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ. 22 కోట్లుగా తేల్చారు. పర్యాటక వీసాపై వచ్చిన ఆమె వీటిని చెన్నైలో ఎవరికి అప్పగించనుందో, ఆమె బస చేయడానికి ముందస్తుగా చేసుకున్న ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులు విచారణను వేగవంతం చేశారు.

సీఎస్ పదవీ కాలం ఆరునెలలు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సర్వీసును కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. వాస్తవానికి ఈనెల 30వ తేదీతో ఆయన పదవీ కాలం పూర్తి కావాల్సింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని పొడిగించాలని ఈనెల 16వ తేదీన కేంద్రానికి లేఖ రాసింది. దీంతో సీఎస్ సర్వీసును డిసెంబరు 31 వరకూ పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీపీజీసెట్ ఫలితాలు విడుదల

- అర్హత సాధించిన 18,467 మంది



ఫలితాలు విడుదల చేసిన కన్వీనర్ శశిభూషణ్‌రావు తదితరులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, వాటి అనుబంధ పీజీ కాలేజీల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందు కు నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024(ఏపీపీజీసెట్) ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. ఫలితాలను కన్వీనర్ జీ.శశిభూషణ్‌రావు.. కోర్ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. పరీక్షకు 29,908 మంది హాజరయ్యారు. 61.75 శాతం ఉత్తీర్ణతతో 18,467 మంది అర్హత సాధించారు. 6,736 మంది పురుషులు, 11,731 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారని కన్వీనర్ శశిభూషణ్‌రావు తెలిపారు. ఏయూ పరిధిలో 13,108 మంది, ఎస్వీయూ పరిధిలో 4,950, ఓయూ పరిధిలో 158 మంది అర్హత సాధించగా.. నాన్‌లోకల్ కేటగిరీలో 251 మంది అర్హులయ్యారు.

ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మహేశ్ చంద్ర లడ్డా!

సాక్షి, అమరావతి: సీఆర్‌పీఎఫ్ ఐజీగా ఉన్న ఐపీఎస్ అధికారి మహేశ్‌చంద్ర లడ్డా రాష్ట్ర సర్వీసుకు తిరిగిరానున్నారు. కొన్నేళ్లుగా కేంద్ర సర్వీసులో ఉన్న ఆయన్ని రాష్ట్ర సర్వీసుకు పంపించాలని సీఎం చంద్రబాబు ఇటీవల కేంద్రానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిని ఆమోదిస్తూ మహేశ్‌చంద్ర లడ్డాను రాష్ట్ర సర్వీసుకు పంపిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే లడ్డాను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం చీఫ్‌గా నియమించే అవకాశాలున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

డీవైఈవో ప్రిలిమ్స్ ఫలితాల వెల్లడి

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో కీలకమైన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించి ప్రిలిమ్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. గత డిసెంబర్‌లో 38 పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 25న ప్రాథమిక పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.psc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని, మెయిన్స్ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే వెల్లడిస్తామని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

చాపకింద నీరులా డెంగీ

- నానాటికీ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- హావేరి జిల్లాలో లక్షణాలతో ఓ మహిళ మృతి
- ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రత్యేక సమీక్ష సమావేశం


డెంగీ జ్వరం వ్యాప్తికి కారణమయ్యే దోమ కాటు


సమావేశంలో మాట్లాడుతున్న తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్

సాక్షి,బళ్లారి: వర్షాకాలం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో ఆయా జిల్లాల్లో వర్షం నీరు నిలవడంతో పాటు మురుగునీరు డ్రైనేజీల్లో దుర్వాసన వెదజల్లుతుండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో డెంగీ, మలేరియా తదితర జ్వరాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. రక్త పరీక్ష కేంద్రాలు నిండుగా జనంతో నిండిపోతూ రక్త పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరిగిపోతోంది.

ఆస్పత్రుల్లో రోగుల హాహాకారాలు

ఉత్తర కర్ణాటకలోని బళ్లారి, బీదర్, కొప్పళ, బాగల్‌కోటె, హావేరి తదితర జిల్లాల్లో డెంగీ బాధితుల సంఖ్య పెరిగిపోయి ఆయా ఆస్పత్రుల వద్ద ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. హావేరి జిల్లాలోని హానగల్ తాలూకా నరేగల్ గ్రామానికి చెందిన గౌసియా(30) అనే మహిళ డెంగీ జ్వరంతో బాధపడుతూ మృతి చెందడం కలకలం రేపింది. మూడు రోజులుగా హావేరి నగరంలోని మల్లాడద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందడంతో అధికారులతో పాటు పాలకులు అప్రమత్తమయ్యారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా డెంగీ జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన తర్వాత సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక చర్యలకు ఆదేశం

రాష్ట్రంలో డెంగీ, మలేరియా జ్వర పీడితులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డెంగీ జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన చికిత్స అందించేందుకు వైద్యులు చొరవ తీసుకుంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాలు, నగరాలు, పట్టణాల్లో అపరిశుభ్రతతో డెంగీ జ్వరం వచ్చేందుకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే స్వచ్ఛభారత్ కాని ఆచరణలో మాత్రం చూపకపోవడంతో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయి జ్వరాలకు కారణం అవుతున్నాయని చెప్పవచ్చు.

డెంగీ కట్టడికి సహకరించండి

రాయచూరు రూరల్: తాలుకా వ్యాప్తంగా ప్రబలుతున్న డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్ సూచించారు. గురువారం నగరంలోని మడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలను జాగ్రుతపరచాలన్నారు. వానాకాలంలో ఇంటి ముందు శుభ్రతను పాటించాలని తెలపాలన్నారు. దోమల నియంత్రణకు గ్రామ స్థాయిలో ఫాగింగ్, బ్లీచింగ్ వంటివి చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారిణి సుష్మా పాటిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్


గంజాయిని చూపుతున్న పోలీసులు

సాక్షి,బళ్లారి: వాల్మీకి వీధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం పోలీసులు మెరుపు దాడి చేసి అరెస్ట్ చేశారు. పట్టుబడిన వాహీద్, చాంద్‌భాషాల వద్ద ఉన్న 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ తెలిపారు. మరో నలుగురు తప్పించుకుని పరారయ్యారని, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆరు నెలల నుంచి 13 గంజాయి అమ్మకం కేసులు నమోదు కాగా ఇటీవల నగరంలో గంజాయి అమ్మకాలు జోరందుకున్నాయనే ఫిర్యాదులతో పోలీసులు దాడి చేశారు.

వ్యవసాయ నీటి కుంటలో మొసలి ప్రత్యక్షం

రాయచూరు రూరల్: వ్యవసాయ నీటి కుంటలో మొసలి ప్రత్యక్షం కావడంతో రైతులు భయాందోళనకు గురైన ఘటన దేవదుర్గలో చోటు చేసుకుంది. గురువారం దేవదుర్గ తాలూకా చిక్కబూదూరులోని రైతు పొలంలో తవ్విన వ్యవసాయ నీటి గుంటలో మొసలి ప్రత్యక్షమైంది. అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వల వేసి మొసలిని పట్టుకుని తరలించారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. ఆల్మట్టి నుంచి నీరు వదలడంతో కృష్ణా నది సమీపంలో ఉండడంతో మొసళ్ల ప్రభావం అధికమైందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి దాడి

హుబ్లీ: నిష్కారణంగా మారణాయుధాలతో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి మహిళతో పాటు ముగ్గురిపై దాడి చేసిన ఘటన ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. అక్కడి నివాసి నజీబ్ సాబ్‌పై పాత హుబ్లీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కెంపేగౌడ ఆదర్శాలు అనుసరణీయం


కెంపేగౌడ చిత్రపటానికి నివాళి అర్పించిన అధికారులు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో కెంపేగౌడ ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ అన్నారు. గురువారం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో జిల్లా పాలనా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, సాంఘిక సంక్షేమ శాఖ, కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో జరిగిన కెంపేగౌడ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కర్ణాటకలో కుల, వర్గ, వర్ణ వ్యవస్థల నిర్మూలనకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివ కుమార్, ఏసీ మెహబూబీ, తహసీల్దార్ సురేష్, కన్నడ సంస్కృతి శాఖాధికారిణి మంగళనాయక్‌లున్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తగిన సహకారం అందించాలని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ న్యాక్ అధికారులకు సూచించారు. ఆయన గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఉన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో న్యాక్ కమిటీ సభ్యులు వీఎస్ కోడట్టి, డాక్టర్ బాళా సాహెబ్ జాధవ్, రజీబ్ బరోడలిలున్నారు.

రక్తదానంపై జాగృతి అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

రాయచూరు రూరల్: రక్తదానంపై జాగృతి అవసరమని నవోదయ కళాశాల డీన్ దేవానంద్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల శరీరానికి కలిగే మేలు గురించి వివరించారు. అత్యవసర సమయంలో యువత రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని కళాశాల విద్యార్థులు ఇంటింటికెళ్లి అవగాహన కల్గించారు. ఎలాంటి ఫలాపేక్ష లేకుండా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అనుపమ, విజయ్ కుమార్, మల్లికార్జున, నారాయణ, ఆనంద్ తదితరులున్నారు.

జనతా దర్శన్‌లో 194 దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: జిల్లాలోని కూడ్లిగి తాలూకాలో బుధవారం జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ పర్యటించి 184 ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా పాలనాధికారి, జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో కూడ్లిగి తాలూకాలోని పర్యాటక దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ సమక్షంలో నిర్వహించిన జనతా దర్శన్ కార్యక్రమంలో జిల్లాధికారి, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, డిప్యూటీ డివిజనల్ అధికారి మహమ్మద్ అలీ అక్రమ్ షా, తహసీల్దార్ రేణుకమ్మ, టీపీ ఈఓ రవికుమార్ దరఖాస్తులను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు మంజునాథ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామచంద్రప్ప, ఆహార శాఖ ఉపసంచాలకులు మల్లికార్జున, మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు శ్వేత, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సోమేసింగ్, గుడ్డప్ప, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, జిల్లా కార్మిక అధికారి సూరప్ప, ఇతర శాఖల అధికారులు హాజరై కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి కలెక్టర్‌కు నివేదించారు.

అధికారుల ఎదుటే రైతు ఆత్మహత్యాయత్నం


ప్రభుత్వ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతును అడ్డుకుంటున్న అధికారులు

సాక్షి,బళ్లారి: దేశానికి రైతు వెన్నెముక. రైతు పెట్టిన పంట నష్టపోతే పరిహారం అందిస్తామని పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలను ఇస్తుంటారే కాని ఆచరణలో చూపకపోవడంతో రైతులకు శాపంగా మారుతోంది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టిన పంటలు పూర్తిగా నష్టపోగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో రైతులకు పరిహారం అందకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. చాలా మంది రైతులు ఈ ఏడాది పంటలు పెట్టేందుకు అప్పులు పుట్టక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. గురువారం గదగ్ జిల్లాలో ఓ రైతు తనకు పంట నష్టపరిహారం అందలేదని, అధికారులు అబద్ధాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహిస్తూ ప్రభుత్వ కార్యాలయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. గదగ్ జిల్లా ముండరగి నీటిపారుదల శాఖ కార్యాలయంలో శివ అనే రైతు అధికారుల ఎదుటే ఫ్యాన్‌కు ఉరి వేసుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే అధికారులు అప్రమత్తమై సదరు రైతును రక్షించారు. పరిహారం ఇవ్వడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రైతు సంఘం నేతలు వాపోతున్నారు.

క్షేత్ర స్థాయిలో జెడ్పీ సీఈఓ పర్యటన


పౌష్టిక ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

హొసపేటె: జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు గ్రామీణ పర్యటనలో భాగంగా ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. హడగలిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సప్లిమెంటరీ పౌష్టికాహారాన్ని తయారు చేసి సరఫరా చేసే హడగలి బాలల అనుబంధ పోషక ఆహార ఉత్పత్తి, శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలోని ఆహార పదార్థాల స్టాక్ ఫైళ్లను, ఆహార పదార్థాలను పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన ఆహారం సకాలంలో అందేలా చూడాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉపసంచాలకులు శ్వేత, జిల్లా పట్టణ అధికారిణి సుభద్ర దేవి, హడగలి సీడీపీఓ రామనగౌడ, యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలలపై దౌర్జన్యాలు అరికట్టాలి


మాట్లాడుతున్న నాగనగౌడ

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో బాలలపై దౌర్జన్యాలు అరికట్టాలని బాలల హక్కుల కమిషన్ అధ్యక్షుడు నాగనగౌడ డిమాండ్ చేశారు. ఆయన గురువారం బీదర్‌లోని జిల్లాధికారి కార్యాలయంలో 11 ప్రభుత్వ శాఖల అధికారులు ఆర్టీఈ, పోక్సో, బాల న్యాయ మండలి వంటి అంశాలపై అధికారులతో జరిగిన ప్రగతి పరిశీలన సమావేశంలో మాట్లాడారు. బాలలను భిక్షాటనకు పంపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల నుంచి బయట 106 మంది పిల్లలు ఉన్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ట్యూషన్ల ద్వారా పిల్లలను హింసించడంపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. బాలల హక్కులను కాలరాయడం తగదని సభ్యుడు వెంకటేష్ అభిప్రాయపడ్డారు. సమావేశంలో మహిళా శిశు అభివృద్ధి అధికారి చేతన్ కుమార్, ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర్, పిల్లల సంరక్షణ అధ్యక్షురాలు మంజుల, సంగమేష్, ప్రజ్వల్, భారతి నాయక్, ఆరతిలున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో ముగ్గురికి రూ.1.04 కోట్ల వంచన

హుబ్లీ: క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించి ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.1.04 కోట్లను బదలాయించుకొని వంచించిన ఘటన నగరంలో గురువారం వెలుగు చూసింది. గోకుల్ రోడ్డు డీపీ శివానంద, అతడి స్నేహితులు సుజిత్, ప్రవీణ్ మోసానికి గురైనవారు. శివానంద తన ఫేస్‌బుక్ ఖాతాలో క్రిప్టో కరెన్సీ వాణిజ్య ప్రకటన చూసి అందులో ఉన్న నంబరుకు ఫోన్ చేయగా ఛాయాసింగ్ అనే ఆమె పరిచయం అయింది. ఈక్రమంలో లింక్ పంపించగా దాన్ని శివనంద తన స్నేహితులకు పంపించి డౌన్‌లోడ్ చేయించి అప్లికేషన్ ద్వారా క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేయమని సూచించారు. ఆ మేరకు శివానందకు చెందిన వివిధ ఖాతాల నుంచి రూ.68.99 లక్షలు, స్నేహితులు సుజిత్ నుంచి రూ.14.85 లక్షలు, ప్రవీణ్ నుంచి రూ.21.05 లక్షలు బదలాయించుకొని వంచించినట్లు బాధితులు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాడప్రభు పాలన ఆదర్శనీయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

హొసపేటె: విజయనగర సామ్రాజ్య పాలనకు ప్రభావితుడైన నాడప్రభు కెంపేగౌడ పరిపాలన నేటికీ ఆదర్శనీయం అని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ అన్నారు. గురువారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నాడప్రభు కెంపేగౌడ జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కెంపేగౌడ నీరు, నేల ప్రాముఖ్యతను అప్పటికే తెలుసుకుని శాస్త్రీయంగా అనేక సరస్సులు, ఆనకట్టలు నిర్మించారన్నారు. మానవాళికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.

రాయల్ నుంచి సంగం సర్కిల్ వరకు రాకపోకల నిలిపివేత

- అనంతపురం రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం


అనంతపురం రోడ్డులో అడ్డుగా ఉన్న చెట్లను నరికి తొలగిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్ : నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి సంగం సర్కిల్ వరకు అనంతపురం రోడ్డులో వాహనాల రాకపోకలను గురువారం నిలిపివేశారు. విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరికి వాటిని తొలగించే పనులు చేపట్టడంతో ఈ రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. దీంతో అనంతపురం, ఉరవకొండ, గుంతకల్లు నుంచి నగరానికి వచ్చే వాహనాలు కేసీ రోడ్డు మీదుగా కాని సత్యనారాయణపేట, పాత కోర్టు ముందు నుంచి రాయల్ సర్కిల్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డును బ్లాక్ చేయడంతో దుర్గమ్మ గుడి రోడ్డు, కేసీ రోడ్డు, బెంగళూరు డబుల్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈనేపథ్యంలో అనంతపురం రోడ్డు విస్తరణ పనులు త్వరగా ముగించాలని వాహనదారులు కోరుతున్నారు.

బయల్పడిన 18వ శతాబ్దపు రాగి గంట


పురాతన కాలం నాటి గంట ఇదే

హొసపేటె: తాలూకాలోని దేవసముద్ర గ్రామంలో లక్ష్మీనారాయణ ఆలయంలోని గంటపై 18వ శతాబ్దానికి చెందిన శాసనం వెలుగులోకి వచ్చింది. గంగావతి ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ మంజన్న ఈ శాసనాన్ని కనుగొన్నారు. ఆలయంలో అమర్చిన రాగి గంటపై మూడు పంక్తుల్లో శాసనం రాశారు. శ్రీలక్ష్మీ నారాయణ స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక సంవత్సరంగా 1717 ఆనంద నామ సంవత్సర చైత్ర శుద్ధ 1లో దేవసముద్రకు చెందిన సార దేశాయి తిమ్మయ్య మనవడు శీనజ శ్రీస్వామికి గంటను అంకితమిచ్చాడని రాసి ఉంది. శాసనం పేర్కొన్న కాలం క్రీ.శ.1795కి సంబంధించినది. అప్పట్లో దేవసముద్రంలో సర్ దేశాయ్ పాలన సాగిస్తున్నారు. విజయనగర రాజుల కాలం నాటి ఈ ఆలయం కాలానుగుణంగా పాలకుల భక్తికి ప్రభావితమైందని ప్రతీతి అని మంజన్న తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పరిశోధనలో విద్యార్థులు శరణబసప్ప కోల్కర, కురుగోడు మారుతి సహకరించినట్లు తెలిపారు.

బస్‌పాస్‌లు ఇవ్వాలని రాస్తారోకో

హుబ్లీ: విద్యా సంవత్సరానికి అనుగుణంగా విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ చేయాలి తదితర డిమాండ్ల పరిష్కారానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు హొసూరు బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. ఆ బస్టాండ్‌లో సమావేశమైన వివిధ కళాశాలల విద్యార్థులు రవాణా శాఖా మంత్రి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ ఆక్రోశం వెళ్లగక్కారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల విద్యా సంవత్సర పనివేళల జాబితాలో చాలా వ్యత్యాసం ఉందని, సదరు వేళ జాబితాలకు అనుగుణంగా విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి అత్యధికంగా నగర ప్రాంతాల్లోని కళాశాలలు, పాఠశాలలకు వస్తారు. ఆ మేరకు తరగతులు ప్రారంభం కాక ముందే పేద విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రాలేక చదువుకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. లేకుంటే ఈ సమస్య పరిష్కారం కోసం పోరాటం తప్పదని ఏబీవీపీ హుబ్లీ నగర కార్యదర్శి సుశీల్ ఇటగి, సచిన్ కుళగేరి హెచ్చరించారు.

దేశభక్తిని పెంపొందించుకోండి


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్


విజయపుర జిల్లాలో మోహన్ భాగవత్‌కు జ్ఞాపికను అందించి సత్కరించిన దృశ్యం

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

సాక్షి,బళ్లారి: ప్రతి భారతీయుడు దేశభక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఆయన నాలుగు రోజుల నుంచి విజయపుర జిల్లాలో బస చేసి పలువురు మఠాధీశుల సమాధులను దర్శించుకున్నారు. గురువారం ఆయన ఆ జిల్లాలోని చడచణ తాలూకా ఇంచగేరి మఠాన్ని దర్శించుకున్న అనంతరం పీఠాధిపతి రేవణసిద్ధేశ్వరతో కొంత సేపు మాట్లాడారు. నాలుగు రోజుల నుంచి ఆయన ఇండి తాలూకా నింబాళ గ్రామంలోని శ్రీగురుదేవ రానడ ఆశ్రమంలో బస చేసి పలువురు ప్రముఖులతో మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కూడా పాల్గొని దేశంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు.

చురుగ్గా అభివృద్ధి పనులకు సూచన


మాట్లాడుతున్న రాజశేఖర్ రామస్వామి

రాయచూరు రూరల్: నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చురుకుగా కొనసాగించాలని నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు రాజశేఖర్ రామస్వామి సూచించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. నగరంలో ప్రధాన కూడలిలో వాల్ క్లాక్ ఏర్పాటు, నూతన లేఅవుట్‌లకు అనుమతులపై జిల్లాధికారితో చర్చించాలన్నారు. ప్రమాదాలను నివారించే సూచిక బోర్డుల ఏర్పాటుకు పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో వేసిన లేఅవుట్‌లకు సంబంధించి త్వరిత గతిన శ్రీకారం చుట్టాలన్నారు. రూ.14 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్, ఎమ్మెల్సీ వసంత్ కుమార్, కమిషనర్ మెహబూబ్ జిలాని, సభ్యులున్నారు.

ప్రగతి పనులపై సమీక్ష

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో వివిధ అభివృద్ధి పనులపై మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసన గౌడ దద్దల్ అధికారులతో సమీక్షించారు. గురువారం బెంగళూరులోని మండలి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గంగా కళ్యాణ, భూ అభివృద్ధి పథకం తదితరాల ప్రగతిపై ఆరా తీశారు. సమావేశంలో ప్రభుత్వ ఉప కార్యదర్శి జ్యోతి, మండలి ప్రధాన కార్యదర్శి మంజునాథ ప్రసాద్, డైరెక్టర్ రాజ్‌కుమార్‌లున్నారు.

లారీ, టిప్పర్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు


ఢీకొన్న రెండు వాహనాలు నుజ్జయిన దృశ్యం

రాయచూరు రూరల్: లారీ, టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన నగర శివార్లలోని పవర్ గ్రిడ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను లారీ అదుపు తప్పి ఢీకొనడంతో లారీ డ్రైవర్ రాజావలిసాబ్(45) కాలు విరిగింది. అతనిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

రూ.2.36 లక్షలతో గుమాస్తా పరారీ

హుబ్లీ: వ్యాపార లావాదేవీలకు సంబంధించిన నగదు రూ.2.36 లక్షలను ఫలాన వ్యక్తికి ఇచ్చి రావాలని పంపించిన అంగడి గుమాస్తా ఆ డబ్బుతో సహా పరారైన ఘటన గంటికేరి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. శీలవంత వీధి కిరాణి వ్యాపారి రవీంద్ర రాజపురోహిత్ గుమాస్తాను నమ్మి మోసపోయిన వ్యక్తి. నిందితుడు శ్యాం సుందర్ ఆ యజమాని అంగడిలో గత నాలుగైదేళ్ల నుంచి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న యజమాని రవీంద్ర అలగుండగి వీధిలో ఉన్న వ్యక్తి డబ్బులు ఇచ్చి రావాలని రూ.2,36,120లతో పాటు తన బైక్‌ను ఇచ్చి పంపాడు. అయితే సదరు గుమాస్తా బైక్‌ను అదే వీధిలో రోడ్డు పక్కన పార్క్ చేసి డబ్బుతో సహా పరారయ్యాడు.

నేడు ఉచిత సామూహిక వివాహాలు

బళ్లారిఅర్బన్: కన్నడ రక్షణ యువ వేదిక నేతృత్వంలో 18వ ఉచిత సామూహిక వివాహాలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కప్పగల్ మునిస్వామి తెలిపారు. బళ్లారి సమీపంలోని అమరేశ్వర దేవస్థానం ఆవరణలో ప్రతి ఏడాది మాదిరిగానే తమ సంఘం ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు ఉచిత సామూహిక వివాహాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 921 జంటలకు పెళ్లిళ్లు చేశామన్నారు. నేడు 21 జంటలకు పెళ్లిళ్లు చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ప్రతి జంటకు తాళిబొట్టు, నూతన వస్త్రాలు, వచ్చిన బంధుమిత్రులకు భోజన సౌకర్యాన్ని తమ సంఘం తరపున కల్పిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

లారీని టెంపో ట్రాక్స్ ఢీకొని ఒకరు మృతి

- 10 మందికి పైగా గాయాలు


నుజ్జునుజ్జుగా మారిన టెంపో ట్రాక్స్ వాహనం

హొసపేటె: ఆగి ఉన్న లారీని టెంపో అదుపు తప్పి ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, 10 మందికి పైగా గాయపడిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా హలికెరె క్రాస్ వద్ద జాతీయ రహదారి-50 పై గురువారం జరిగింది. ప్రమాదంలో కృష్ణప్ప(62) అనే వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గంగావతి నుంచి మైసూరుకు వెళుతున్న లారీ మార్గ మధ్యంలో ఆగిపోవడంతో వేగంగా వస్తున్న టెంపో అదుపు తప్పి లారీ వెనుక భాగాన బలంగా ఢీకొంది. టెంపోలో ప్రయాణిస్తున్న వారు కలబుర్గిలో నిశ్చితార్థం పూర్తి చేసుకొని చిక్కబళ్లాపురలోని ఆరోడి గ్రామానికి వెళుతున్నారు. ప్రమాద సమయంలో టెంపోలో 15 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ఘటనతో టెంపో నుజ్జునుజ్జయింది. ఇద్దరు వ్యక్తులు టెంపోలో చిక్కుకుపోయారు. వారిని బయటకు తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఘటనపై కానాహొసళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రైతులకు విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె: జిల్లా భూసార ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గవియప్ప భూమిపూజను నిర్వహించారు. సుమారు రూ.15 లక్షల ఖర్చుతో జిల్లా భూసార ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా 2024–25వ సంవత్సరానికి వ్యవసాయ శాఖ పథకం కింద రైతులకు పనిముట్లు, విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం భూసార పరీక్షలపై అవగాహన కల్పించి మంచి పంటలు పండించేందుకు వీలుగా జిల్లా భూసార ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శరణప్ప ముద్గల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

నగరంలోని అనంతశయనగుడి సమీపంలో రైల్వే ఫ్లైఓవర్ పనులను గురువారం ఎమ్మెల్యే గవియప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి పనుల కారణంగా ఇక్కడ నివాసముంటున్న వారు అధిక మొత్తంలో నష్టపోయారన్నారు. వారికి నష్టపరిహారం కింద తగిన పరిహారం అందిస్తామన్నారు. ఈ విషయంపై జిల్లాధికారితో సమావేశమై స్థానికులతో చర్చించి తగిన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానికులు, అసిస్టెంట్ కమిషనర్లు, తహసీల్దార్లు, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.